thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 48 కరీంనగర్ మంగళవారం, 29 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## మేకిన్ ఇండియా విఫలం..మోదీ గుర్తించాలి

పట్నా : జీడీపీలో తయారీ రంగం వాటా 2104లో 15.3 శాతంగా ఉంటే ఇప్పుడది 12.6శాతానికి పడిపోయిందని.. ఇది గత 60ఏళ్లలో అత్యంత కనిష్ఠం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పేర్కొన్నారు. లోక్ సభలో మోదీ తన ప్రసంగంలో ఎక్కడా 'మేకిన్ ఇండియా' గురించి మాట్లాడలేదని.. ఈ 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమమే అయినా అది విఫలమైందనే విషయాన్ని ప్రధాని గుర్తించాలని అన్నారు.

పట్నాలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోదీ మాట్లాడితే.. ఎన్నికల్లో అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి ప్రాతినిధ్యం కల్పించామని గొప్పగా చెబుతుంటారని.. అయితే ఆ వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అన్ని అధికారాలనూ ఆయన లాగేసుకున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కూడా పేరుకే ఉన్నారని.. ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసిన ఓఎస్డీలే శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.

# ఏం జరుగుతుందో ఏమో..

## భారత్ నిర్ణయాలతో కాళ్ల బేరానికి పాకిస్తాన్..!



## ఆ దేశాలతో రాయబారం..

భారత్ వైఖరితో తర్జనభర్జన అవుతున్న పాకిస్తాన్.. ఉగ్రదాడిని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ సంచలన కామెంట్స్ చేస్తోంది. తమ పాత్రేమీ లేదంటూ ఒకరోజు.. యుద్ధానికి సిద్ధమంటూ మరోసారి వ్యాఖ్యలు చేస్తూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా.. పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. తాజాగా.. పహల్గామ్ ఉగ్రదాడి వ్యవహారంలో రష్యా, చైనా జోక్యం చేసుకోవాలని కోరారు.

భారత్ అబద్ధం చెబుతోందా?.. తాము వాస్తవాలు మాట్లాడుతున్నామా?.. అనే అంశాలను వెలికితీసేందుకు దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయొచ్చని ఖవాజా ఆసిఫ్ విజ్ఞప్తి చేయడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్- పాకిస్థాన్ సంయమనం పాటించాలని.. ఉద్రిక్తతలను తగ్గించేందుకు చైనా కృషి చేస్తుందని వెల్లడించింది. అదేసమయంలో.. ఉగ్రవాదంపై పోరాటం అన్ని దేశాల ఉమ్మడి బాధ్యత అని స్పష్టం చేసింది. ఇప్పటికే.. పహల్గామ్ ఉగ్రదాడిని అమానవీయ చర్యగాపేర్కొంది డ్రాగన్. ఇక.. భారత్- పాక్ మధ్య యుద్ధం చెలరేగకూడదని తాను కోరుకుంటున్నా అంటూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. వార్ జరిగితే శాంతికి భంగం కలుగుతుందన్నారు. లష్కరే తోయిబాకు చెందిన చాలామంది సభ్యులు ప్రస్తుతం జైళ్లలో, గృహ నిర్బంధాల్లో ఉన్నారని చెప్పారు. ఎల్ఈటీ అనుబంధ సంస్థ అయిన టీఆర్ఎఫ్ పహల్గామ్ దాడికి బాధ్యత వహించిందని.. ఆ తర్వాత మాత్రం యూ-టర్న్ తీసుకుందన్నారు.

అయితే.. పాక్ డిఫెన్స్ మినిస్టర్ ఆసిఫ్.. ఒకవైపు.. శాంతి, దర్యాప్తు మంత్రాలు జపిస్తూనే.. మరోవైపు రష్యా, చైనా జోక్యం కోరుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి.. ఇప్పటికే అమెరికా జోక్యానికి ప్రయత్నించి పాకిస్తాన్ విఫలమైంది. రెండు రోజుల క్రితం అమెరికా జోక్యానికి ప్రయత్నించిన పాక్ మీడియాకు అగ్రరాజ్యం దిమ్మతిరిగే షాకిచ్చింది. కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోబోమని అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేసినట్లు హౌట్ హౌస్ ప్రతినిధి వెల్లడించారు. మొత్తంగా.. పహల్గామ్ ఉగ్రదాడి విషయంలో పాకిస్తాన్ పడరాని పాట్లు పడుతోంది. భారత్ కఠిన చర్యలతో వణికిపోతూ.. ఎప్పుడు ఎలాంటి సర్జికల్ స్ట్రైక్ చేస్తుందో అన్న భయంతో పాక్‌లో ఫియర్ నెలకొంది.

ఈ క్రమంలోనే.. అమెరికా జోక్యానికి ప్రయత్నించగా ఆ దేశం తిరస్కరించడంతో.. తమ గోడు పట్టించుకోవాలంటూ ఇప్పుడు రష్యా, చైనాను దాయాది దేశం ప్రాధేయపడుతోంది.

## ఫైనల్ స్టేజ్‌కు ఆపరేషన్ కర్రెగుట్ట..!




2014లో అధికారంలో చేపట్టిన కేంద్రంలోని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని బీజేపీ సర్కారు.. అటు బహిర్గత శత్రువులైన ఉగ్రవాదులతో పాటు అంతర్గత శతృవులైన తీవ్రవాద నక్సలిజం అంతం చేయడాన్ని పనిగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట నక్సలైట్లను ఏరివేసే పనిని మొదలుపెట్టింది. మొత్తంగా ఇప్పటి వరకు 90 శాతం నక్సలైట్స్ మరణించడమే.. లొంగిపోవడం జరిగింది. ఇక ఈ నక్సలిజం పురుడుపోసుకుంది పశ్చిమ బంగాల్ లోని నక్సల్ బరి గ్రామంలో. అక్కడ ఉద్యమం పురుడు పోసుకుంది. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా దేశ వ్యాప్తంగా నక్సలిజం పలు ప్రాంతాల్లో ప్రబలింది.

ముఖ్యంగా పశ్చిమ బంగాల్ తో పాటు ఒరిస్సా, ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో నక్సలైట్లకు అడ్డా ఉంది. గతంలో పలు గ్రూపులుగా ఉన్న నక్సల్స్ అందరు కలిసి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా మావోయిస్ట్‌గా ఆ తర్వాత తన పేరు మార్చుకుంది. నక్సలైట్స్ కు ప్రస్తుతం కేంద్ర బిందువుగా ఉన్నది మాత్రం చత్తీస్‌గడ్‌లోని జగదల్ పూర్‌లోని బస్తర్ ప్రాంతం. దీన్నే దండకారణ్యం అంటారు.

ఇది చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, ఒడిషా, తెలంగాణ, ఏపీల్లో విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లోనే నక్సలైట్స్ తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ ఉంటారు. ఇండియన్ మావోయిస్టులు.. %ఝూఝూ%, బొకోహరామ్ తర్వాత మూడో అతిపెద్ద తీవ్రవాద సంస్థ అని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో మావో అంతు తేల్చేందుకు కేంద్రం కంకణం కట్టుకుంది. ఇప్పటికే తెలంగాణ, ఛత్తీస్ సరిహద్దులోని కర్రెగుట్టలో ఆపరేషన్ కొసాగుతుంది. అయితే బలగాల కూంబింగ్‌లో వారికి మావోల బంకర్ బయటపడింది. అయితే పోలీసులు తమను చుట్టుముడుతున్నారన్న సమాచారంతో మావోయిస్టులు వారి స్థావరాల నుంచి తప్పించుకున్నారన్న వార్తలు వినపడుతున్నాయి.



## ఇందిరమ్మ ఇండ్ల కోసం తెలంగాణ సర్కార్ కొత్త రూల్స్ !

హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్ల కోసం తెలంగాణ సర్కార్ కొత్త రూల్స్ పెట్టినట్లు సమాచారం అందుతోంది. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారులలో 53.3% మంది అనర్హులని ప్రభుత్వం తేల్చినట్లు సమాచారం అందుతోంది. ఇందిరమ్మ ఇండ్ల కోసం కాంగ్రెస్ పెట్టిన రూల్స్ అంటూ గులాబీ పార్టీ నేతలు ప్రచారం జరుగుతోంది. ఇందిరమ్మ ఇల్లు 60 గజాల లోపే కట్టుకోవాలని పేర్కొన్నారట. బ్యాంకులో రూ.50 వేల కంటే ఎక్కువ క్రాప్ లోన్ ఉంటే అనర్హులు అని సమాచారం అందుతోంది. కుటుంబం మొత్తానికి రెండున్నర ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉంటే అనర్హులు అని చెబుతున్నారు. కుటుంబంలో ట్రాక్టర్ ఉంటే ఇందిరమ్మ ఇల్లు పథకానికి అనర్హులు అని తెలుస్తోంది. ఇందిరమ్మ ఇల్లు కోసం 77.18 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 41.15(53.3%) లక్షల మంది అనర్హులుగా తేల్చి చెప్పిందట ప్రభుత్వం.



'ఆపరేషన్ కగార్'ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని కేంద్రాన్ని కోరిన ఇద్దరు నేతలు!

# నక్సలిజం - తీవ్రవాదం

## ఆ విషయంలో ఇద్దరిదీ ఒకే మాట..

## సీఎం, మాజీ సీఎంల ఏకాభిప్రాయం..!

హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. పదేళ్లుగా వీరిమధ్య రాజకీయ వైరం కొనసాగుతోంది. అయితే రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అంటారు. పార్టీ సిద్ధాంతం పరంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ ముఖ్యమైన మంత్రి కేటీఆర్ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తారు. కానీ, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో రేవంత్‌రెడ్డికి కేటీఆర్ మద్దతు తెలిపారు. ఇప్పుడు మావోయిస్టుల విషయంలో కేసీఆర్ మద్దతు తెలిపారు. తెలంగాణ రాజకీయాల్లో అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. రాజకీయ ప్రత్యర్థులైన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ మావోయిస్టు సమస్యపై ఒకే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని ఇద్దరూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

**'ఆపరేషన్ కగార్'పై ఇద్దరి ఆందోళన...** తెలంగాణ-చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కేంద్ర బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాన్ని తీవ్రతరం చేశాయి. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు దాదాపు 30 మంది నక్సలైట్లు హతమైనట్లు సమాచారం. అయితే, ఈ ఆపరేషన్ అమాయక గిరిజనులు, సామాన్య ప్రజలపై ప్రభావం చూపుతోందని రేవంత్, కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని తక్షణం నిలిపివేయాలని ఇద్దరూ డిమాండ్ చేశారు.

**శాంతి చర్చలకు పిలుపు...** మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నారని, కేంద్రం కూంబింగ్ ఆపరేషన్లు, కాల్పులను ఆపి చర్చలకు ముందుకు రావాలని కేసీఆర్ వరంగల్‌లోని ఎల్కతుర్తి బీఆర్ఎస్ సభలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరఫున కేంద్రానికి లేఖ రాస్తామని ఆయన ప్రకటించారు. మరోవైపు, శాంతి చర్చల కమిటీ నేతలు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, కేంద్రాన్ని కాల్పుల విరమణకు ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను సామాజిక కోణంలో చూస్తామని, శాంతి-భద్రతల సమస్యగా కాదని రేవంత్ స్పష్టం చేశారు.

**సలహాలు, చర్చలతో ముందడుగు...** నక్సలిజం సమస్యపై చర్చలకు అనుభవం ఉన్న మంత్రి జానారెడ్డి సలహాలు తీసుకుని, ఇతర మంత్రులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సునిశితంగా వ్యవహరిస్తూ, కేంద్రంతో సమన్వయం చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. కేసీఆర్ కూడా ఈ అంశాన్ని బలంగా లేవనెత్తి, కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

**రాజకీయ ప్రత్యర్థుల ఐక్యత..** సాధారణంగా ఒకరి విధానాలను మరొకరు తీవ్రంగా విమర్శించుకునే రేవంత్, కేసీఆర్ మావోయిస్టు సమస్య విషయంలో ఒకే గొంతుతో మాట్లాడటం తెలంగాణ రాజకీయాల్లో అరుదైన సంఘటన. ఈ ఏకాభిప్రాయం రాష్ట్రంలో శాంతి ప్రక్రియను బలోపేతం చేస్తుందా లేదా రాజకీయ లబ్ధికి ఉపయోగపడుతుందా అనేది చర్చనీయాంశం. ఈ అంశంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయో వేచి చూడాలి.

**శాంతి చర్చల వైపు అడుగులు...** మావోయిస్టు సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలనే రేవంత్, కేసీఆర్ ఉద్దేశం తెలంగాణలో శాంతి ప్రక్రియకు కొత్త దిశను ఇవ్వవచ్చు. ఈ సమస్యకు హింసాత్మక పరిష్కారం కాకుండా, చర్చల ద్వారా మార్గం సుగమం చేయాలనే ఇద్దరి నేతల ఆలోచన రాష్ట్రంలో సామాజిక సమస్యల పరిష్కారానికి ఒక ముందడుగుగా పరిగణించబడుతోంది. ఈ ఏకాభిప్రాయం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందో రాబోయే రోజులు తేల్చనున్నాయి.




## ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..? : కేసీఆర్‌పై మండిపడ్డ సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు. "కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. భారాసను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్‌గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్‌కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**జానారెడ్డితో సీఎం భేటీ..** జానారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కే కేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు.





## రాజ్‌భవన్‌లో లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణస్వీకారం

హైదరాబాద్: రాజ్‌భవన్‌లో తెలంగాణ లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణస్వీకారం చేశారు. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.




నల్గొండ: కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్‌లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. "గత భారాస ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. ప్రాజెక్టులకు భూసేకరణ విషయంలో ప్రజలు సహకరించాలి. రైతులను ఒప్పించిన తర్వాతే ప్రాజెక్టులకు భూసేకరణ చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకాన్ని సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ వరకు పొడిగిస్తాం. పూడిక వల్ల ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-2 పనులను పూర్తి చేస్తే.. ఉమ్మడి నల్గొండ జిల్లాకు నీటి సమస్య తీరుతుంది. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, భారాస నేతలు జేబులు నింపుకొన్నారు. భారాస నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోంది" అని ఉత్తమ్ అన్నారు.

**కేసీఆర్.. సోనియా ఆశీస్సులు తీసుకోలేదా?: కోమటిరెడ్డి...** 'తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కేసీఆర్ అనలేదా?' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. ఇప్పుడు ఆయనే.. తెలంగాణ విలన్ కాంగ్రెస్ పార్టీ అని దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "తెలంగాణ ఇచ్చినప్పుడు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ ఆశీస్సులు తీసుకోలేదా? హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని అసెంబ్లీలో కేసీఆర్ అనలేదా? ఇచ్చిన ప్రతి హామీని ఈ ప్రభుత్వం క్రమక్రమంగా నెరవేరుస్తోంది.

కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి రూ.10వేల కోట్లు దోచుకుతిన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. మంత్రులు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేయించి.. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. పదేళ్లు పాలించిన కేసీఆర్.. ఉద్యోగులకు సరిగా జీతాలు కూడా ఇవ్వలేదు" అని విమర్శించారు.




## పాతబస్తీలో ఈడీ సోదాలు

హైదరాబాద్: పాతబస్తీలోని యాకుత్‌పురా, సంతోష్‌నగర్‌లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. భూదాన్ భూముల వ్యవహారంలో ఈ తనిఖీలు చేపట్టారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఈఐపీఎల్ కంపెనీ భూములు విక్రయించింది. ఈఐపీఎల్ కంపెనీకి సుకూర్ బినామీగా ఉన్నట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ఈక్రమంలో సుకూర్, అతడి బంధువు షర్ఫన్, మరో ఇద్దరి ఇళ్లలో సోదాలు జరిపింది. ఇప్పటికే ఈ కేసులో అప్పటి రంగారెడ్డి కలెక్టర్ అమోయ్‌కుమార్, మహేశ్వరం తహసీల్దార్‌ను ఈడీ విచారించింది.



## కేరళ సీఎం కార్యాలయానికి బాంబు బెదిరింపు

గత రెండు వారాలుగా కేరళలోని ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా వస్తున్న బాంబు బెదిరింపు కాల్స్ కలకలం సృష్టిస్తున్నాయి. తాజగా కేరళ సీఎం కార్యాలయంతో పాటు సెక్రటేరియట్‌కు సోమవారం బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా బెదిరింపు కాల్స్ వచ్చినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. దీంతో బాంబ్ స్కాడ్, పోలీసు బృందాలు ఆయా ప్రదేశాలకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టాయి. గత రెండు వారాల్లో 12 బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం తిరువనంతపురం విమానాశ్రయానికి, రాజధానిలోని ప్రముఖ హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న బాంబు, డాగ్ స్క్వాడ్‌లు విమానాశ్రయ టెర్మినల్స్‌లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా ఎటువంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేవని..అవి నకిలీ బెదిరింపు కాల్స్‌గా గుర్తించామని పేర్కొన్నారు.

రెండు వారాలుగా కేరళ హైకోర్టు సహా జిల్లా కలెక్టరేట్‌లు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయన్నారు.మే 2న కేరళలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్న నేపథ్యంలో ఈ నకిలీ కాల్స్‌పై దర్యాప్తు వేగవంతం చేశామన్నారు.

## కేసీఆరే తెలంగాణకు విలన్‌గా మిగిలిపోతారు: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్: తక్కువ సమయంలో ఎక్కువ ప్రజాధనం దోచుకుంది కేసీఆరేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభలో కాంగ్రెస్‌పై కేసీఆర్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. "ప్రాజెక్టులు, భూముల పేరిట దోచుకొని రాష్ట్రాన్ని అప్పుల పాలుజేశారు.

దూరదృష్టి, ఆలోచన లేకుండా ఇబ్బడిముబ్బడిగా అప్పులు తెచ్చారు. పలాయనం చిత్తగించిన వ్యక్తి.. కాంగ్రెస్ గురించి మాట్లాడుతున్నారు. దొంగ పాస్‌పోర్టులు సృష్టించి విదేశాలకు పంపిన చరిత్ర కేసీఆర్‌ది. కాంగ్రెస్ వల్లే తెలంగాణ వచ్చాక ఆయన సీఎం అయ్యారు.




తెలంగాణ సాకారం చేసినందుకు కాంగ్రెస్ విలన్‌గా నిలుస్తుందా? కేసీఆరే తెలంగాణకు విలన్‌గా మిగిలిపోతారు"అని అన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది భారాసనేనని, రజతోత్సవ సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలు చెప్పిన సందేశం ఇదేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎల్కతుర్తితో ఆదివారం జరిగిన భారాస రజతోత్సవ సభపై భారాస నాయకులు, కార్యకర్తలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. "భారాస రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణకు ధన్యవాదాలు. దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద సభల్లో ఒకటిగా నిలిచిపోతుంది. నిన్నటి సమావేశం రజతోత్సవ కార్యక్రమాలకు ప్రారంభం మాత్రమే. ఇకపై తానే ముందుండి పోరాడతానని కేసీఆర్ ప్రకటించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి. రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చాం. ఇకపై ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని వెంటాడుతాం. ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం"అని కేటీఆర్ అన్నారు.

## విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు: పొంగులేటి

ఎల్కతుర్తి: పటిష్ఠమైన భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తయారు చేసిందని, రైతులను ఇబ్బంది పెట్టకుండా సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అధికారి కూడా రైతు కుటుంబం నుంచే వచ్చినవారే ఉంటారు. వారి కష్టాలు తెలుసు కాబట్టి వాళ్లను ఇబ్బంది పెట్టకుండా సమస్య పరిష్కరించాలి. ఈ ప్రభుత్వం 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలి విడతలో అత్యంత పేదవారికి ప్రాధాన్యత ఇస్తున్నాం. విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం." అని అన్నారు.



## గ్రూప్-1 నియామకాలపై అప్పీలు దాఖలు చేసిన టీజీపీఎస్సీ

హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీలు దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టనుంది. గ్రూప్ 1 నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్ష కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం.. నియామకాలు తాత్కాలికంగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీజే ధర్మాసనంలో టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేసింది. సీజే ధర్మాసనంలో అప్పీలు దాఖలు చేసినట్లు టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది సింగిల్ బెంచ్‌కు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై ఇవాళ జరగాల్సిన విచారణను జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బుధవారానికి వాయిదా వేశారు.

## యాదాద్రి పవర్ ప్లాంటులో అగ్నిప్రమాదం



నల్గొండ: యాదాద్రి పవర్ ప్లాంటులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి దామరచర్ల మండలం వీర్లపాలెంలోని పవర్ ప్లాంటులో మంటలు చెలరేగాయి. యూనిట్-1 బాయిలర్‌లో ఆయిల్ ఫైర్ కావడంతో ఈ ప్రమాదం జరిగింది. సకాలంలో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. యూనిట్-1 ప్రారంభానికి అధికారులు ట్రయల్ రన్ చేస్తున్నారు. ఈ ట్రయల్ రన్ సమయంలోనే మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది.

# సంఘ సంస్కర్త బంకుపల్లె మల్లయ్యశాస్త్రి

## – ఏప్రిల్ 29...బంకుపల్లె మల్లయ్యశాస్త్రి జయంతి



బంకుపల్లె మల్లయ్యశాస్త్రి ప్రముఖ పండితుడు. . రచయిత. ప్రధానంగా సంఘసంస్కర్త. సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన మల్లయ్యశాస్త్రి హైందవ సాంప్రదాయంలో ఉన్న మూఢాచారాలను పూర్తిగా వ్యతిరేకించాడు. స్త్రీ పునర్వివాహము శాస్త్రీయమని అనేక సభలలో వాదించి నిరూపించాడు. స్త్రీ విద్య ఆవశ్యకత గురించి పలు ఉపన్యాసాలు చేశాడు. తన ద్వితీయభార్యకు విద్య నేర్పించి మూడు ప్రబంధాలు, భారత భాగవత పురాణాలను నేర్పించాడు. ఆయన నేర్పిన విద్య, అందించిన ప్రోత్సాహం కారణంగా ఆమె సంగ్రహ రామాయణము, మరికొన్ని గ్రంథాలను రచించ గలిగింది. రజస్వలానంతర పురుష సంయోగార్హ కాలమే స్త్రీలకు వివాహకాలం అన్న సిద్ధాంతాన్ని ప్రకటించాడు. స్త్రీ పునర్వివాహము పూర్వాచారము కాకపోయినప్పటికి శాస్త్రీయము కాబట్టి ఆచరణీయమని వాదించాడు. సతీ శాసనము వచ్చిన తర్వాత పునర్వివాహము అవశ్యకత కలిగినదని వాదించి పత్రికలలో చర్చ కొనసాగించాడు. శారదా చట్టం ప్రతిపాదించిన కాలంలో ఆ చట్టానికి అనుకూలంగా మద్రాసు మొదలైన పలు ప్రాంతాలలో పలు సభలలో చర్చలు చేసి పండితులతో రజస్వలానంతర వివాహమే శాస్త్రీయమని అంగీకరింప చేశాడు. మల్లయ్య శాస్త్రి కుమార్తె కృష్ణవేణమ్మను శతావధాని వేదుల సత్యనారాయణశాస్త్రికి ఇచ్చి పునర్వివాహం చేశాడు. తన రెండవ భార్యవలన కలిగిన ప్రథమ కుమారుని జనన సమయంలో వారి ఆచారం ప్రకారం నల్లమేకను శక్తికి బలి ఇవ్వవలసి ఉండగా, ఆ ఆచారాన్ని విసర్జించాడు. శాఖాంతర వివాహం చేసి ఆకాలంలో ఆదర్శంగా నిలిచాడు. అస్పృశ్యత వ్యతిరేకంగా ఆంధ్రపత్రిక, త్రిలింగ పత్రికలలో వ్యాసాలు రాశాడు. మద్రాసు, నెల్లూరు, గుంటూరు, గోదావరి, కృష్ణ, విశాఖపట్నం, గంజాం మండలాలలో తిరిగి అస్పృశ్యతా ప్రచారం చేశాడు. శూద్రులను తన ఇంటికి పిలిచి వారితో పాటు భోజనము చేసేవాడు. అప్పారావు అనే ఒక బ్రాహ్మణేతరుడిని తన ఇంటిలోనే ఉంచుకుని తన కుమారులతో పాటుగా చదువు సంధ్యలు చెప్పాడు. ఆయన ఆంధ్రపత్రిక, భారతి పత్రికలద్వారా ధర్మశాస్త్రములను పరిశీలించి అందలి విషయాలను సప్రమాణకంగా ప్రకటించేవాడు. మల్లయ్యశాస్త్రి 1876వ సంవత్సరం ఏప్రిల్ 29వ తేదీ ధాత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పంచమి నాడు పునర్వసు నక్షత్రము, తులాలగ్నములో గంజాం జిల్లా సింగుపురం గ్రామంలో తన మాతామహుని ఇంటిలో జన్మించాడు. స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలానికి చెందిన ఉర్లాం గ్రామం. ఆయన తల్లిదండ్రులు సూరమ్మ, గంగన్న. ఆయనది కృష్ణ యజుశ్శాఖ, ఆపస్తంబ సూత్రుడు, భారద్వాజ గోత్రుడు. మల్లయ్యశాస్త్రి తన ఐదవ యేట తన తండ్రివద్ద వేదాధ్యయనము ప్రారంభించాడు. తరువాత ఉర్లాం జమీందారు కందుకూరి బసవరాజు ఆస్థాన పండితుడైన భళ్లమూడి లక్ష్మణ శాస్త్రి వద్ద సంస్కృతము నేర్చుకున్నాడు. తన పదహారవ యేడు వచ్చే సమయానికి పంచ.కావ్యాలు పూర్తిగా చదివాడు. తరువాత పర్లాకిమిడి రాజా వారి సంస్కృత కళాశాలలో చేరి అక్కడ భళ్లమూడి వెంకటశాస్త్రి వద్ద శృంగార నైషధము, అభిజ్ఞాన శాకుంతలము చదివాడు. తరువాత పరవస్తు రంగాచార్యుల వద్ద సిద్ధాంత కౌముది పూర్తి చేశాడు. కూరెళ్ల సూర్యనారాయణశాస్త్రి వద్ద తర్కశాస్త్రము చదువు కున్నాడు. పోకల సింహాచలం వద్ద సంగీతము నేర్చుకున్నాడు. బంకుపల్లి కామశాస్త్రి వద్ద మంత్ర శాస్త్రాన్ని అభ్యసించాడు. భళ్లమూడి దక్షిణామూర్తి శాస్త్రి వద్ద పంచదశ ప్రకరణములు, గీతాభాష్యము చదువు కున్నాడు. శ్రీకూర్మం సంస్కృత పాఠశాల పండితుడైన నౌడూరి వెంకటశాస్త్రి వద్ద మనోరమ, శబ్దరత్నములు, పారిభాషేందు శేఖరము చదివాడు. గిడుగు రామమూర్తి పంతులు వద్ద ఇంగ్లీషు చదివాడు. మంత్రశాస్త్ర విద్యలో తన సహాధ్యాయి అయిన గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద వేదాంత, మీమాంస శాస్త్రాలను నేర్చుకున్నాడు. నీలమణి పాణిగ్రాహి వద్ద సూర్యసిద్ధాంత దర్పణాలను చదివి దృక్సిద్ధ పంచాంగాలను ఐదారు సంవత్సరాలు వెలువరించాడు. మల్లయ్యశాస్త్రి తన 21వ యేట శ్రీకాకుళం హైస్కూలులో తెలుగు పండిత పదవికి 18మంది పండితులతో పోటీపడి ప్రథముడిగా నెగ్గి ఆ ఉద్యోగాన్ని సంపాదించు కున్నాడు. అక్కడ రెండు సంవత్సరాలు పనిచేశాడు. తర్వాత కొంతకాలం లుకలాం గ్రామంలో కన్నేపల్లి రామావధాని కుమారులకు సంస్కృతం బోధించాడు. ఆ తర్వాత పర్లాకిమిడి రాజా వారి ఇంగ్లీషు కళాశాలలో తెలుగు పండిత పదవిని చేపట్టాడు. బరంపురం సిటీ కాలేజీలో కూడా సంస్కృతాంధ్ర పండితుడిగా కొంతకాలం పనిచేశాడు. 1912లో కలకత్తా సంస్కృత విద్యా పీఠంలో పరీక్ష ఉత్తీర్ణుడై కావ్యతీర్థ బిరుదును పొందాడు. సంస్కృతంలో సీతా కళ్యాణము, జానకీ వహ్ని ప్రవేశము అనే పురాణ హరికథలుగా వ్రాసినందుకు సంస్థానం రాజు "పురాణ వాచస్పతి" అనే బిరుదును ప్రదానం చేశాడు. ఆంధ్ర విద్యారణ్య, విద్యారత్న బిరుదులు పొందాడు. ఆయన కాశీయాత్రను ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్ వద్ద 1947, సెప్టెంబరు 26న తనువు చాలించాడు.

**రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# అంతర్జాతీయ నృత్య దినోత్సవం: భావాల్ని కలిపే కళోత్సవం

## ఏప్రిల్ 29...అంతర్జాతీయ నృత్య దినోత్సవం




ప్రపంచమంతా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 29న అంతర్జాతీయ నృత్య దినోత్సవం ఘనంగా జరుపుకుంటారు. నృత్యం ఒక కళ మాత్రమే కాదు ు అది సంస్కృతుల్ని కలిపే వేదిక, భావాల్ని పలికించే మాధ్యమం, మానవ అనుభూతుల ఆవిష్కరణ. ఈ దినోత్సవం, నాట్య కళ గొప్పతనాన్ని గుర్తుచేస్తూ, దానికి గౌరవం కల్పించే ప్రత్యేకమైన రోజు. ఈ దినోత్సవాన్ని 1982లో యునెస్కో ఆధీనంలోని ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్ స్థాపించింది. ఆధునిక బ్యాలెట్ నృత్యానికి పితామహుడిగా భావించే జీన్–జార్జెస్ నోవెర్రె (1727–1810) పుట్టిన రోజును పురస్కరించుకుని ఏప్రిల్ 29 తేదీని ఎంపిక చేశారు. నోవెర్రె నృత్యాన్ని కేవలం రూపా చిత్రాల సమాహారంగా కాకుండా, భావావేశాల్ని మిళితం చేసే కథనంగా అభివృద్ధి చేశాడు. ఆయన రచించిన "%లావతీం శీఇ ఖుఅఇ-అఐిడ ఖఅు ఢీఇశ్రీశ్రీవం%" నాట్యరంగంలో మైలురాయిగా నిలిచింది. అంతర్జాతీయ నృత్య దినోత్సవం ప్రధాన లక్ష్యాలు: నృత్య కళ యొక్క ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా చాటడం. వివిధ నృత్యరూపాల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించడం. రాజకీయ, జాతీయ, సాంస్కృతిక భేదాలు లేకుండా ప్రజలను నృత్యం ద్వారా ఏకం చేయడం. యువతలో నాట్య కళ పట్ల ఆసక్తిని, గౌరవాన్ని పెంచడం. ప్రతి సంవత్సరం, ఒక ప్రముఖ నర్తకుడు లేదా కొరియోగ్రాఫర్ ఈ సందర్భానికి ప్రత్యేక సందేశాన్ని అందిస్తూ, నృత్యం ప్రాముఖ్యతను నలుదిశలా వ్యాప్తి చేస్తారు. ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా అనేక నృత్య ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, పోటీలు, సదస్సులు నిర్వహిస్తారు. నాట్య పాఠశాలలు, కళాశాలలు, సాంస్కృతిక సంస్థలు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటాయి. ప్రపంచ నృత్య రూపాల పరిచయం ద్వారా, ఒక్కో సంస్కృతి ప్రత్యేకతను, సమగ్రతను చాటుతుంది. ప్రధాన నగరాల్లో జరిగే బహుళ సంస్కృతుల నృత్య ప్రదర్శనలు, కళల బంధాన్ని మరింత బలపరుస్తాయి. కొన్నిచోట్ల ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, కళాకారులను ప్రోత్సహిస్తాయి. నృత్యం కేవలం శరీర చలనం కాదు బీ అది: భావావేశాలకు ఆకారమిచ్చే నిశ్శబ్ద భాష, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉపశమనం, ఆధ్యాత్మిక అనుభూతులకు మాధ్యమం. భరతనాట్యం, కూచిపూడి, కథక్, ఒడిస్సీ వంటి భారతీయ శాస్త్రీయ నృత్య శైలులు భావ ప్రకటనలో విశిష్టతను ప్రతిబింబిస్తాయి. నృత్యం లయ, తాళం, భావం (భావార్థం) ల సమ్మిళితం. భారతదేశం నాట్య సంపద పరంపరలో అపూర్వమైన దేశం. ఇక్కడ: భరతనాట్యం (తమిళనాడు), కూచిపూడి (ఆంధ్రప్రదేశ్), కథక్ (ఉత్తర భారతం), ఒడిస్సీ, మోహినియాట్టం, కథకళి, మణిపూరి వంటి ఎన్నో శాస్త్రీయ నృత్యరూపాలు వెలసాయి. ప్రతి అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని భారత్ కళాభిమానంతో, ఉత్సాహంతో జరుపుకుంటోంది. కళా అకాడమీలు, ప్రైవేటు నాట్య సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఈ సంపదను కొత్త తరాలకు పరిచయం చేస్తున్నాయి. నృత్యం అనేది పరిమితులులేని భావప్రకటన. అది మాటలు లేకుండానే ప్రపంచాన్ని ఆకట్టుకుంటుంది. అంతర్జాతీయ నృత్య దినోత్సవం నాట్య కళా గొప్ప తనాన్ని గుర్తుచేస్తూ, భావాలను, సంస్కృతులను ఒకే వేదికపై కలిపే ప్రాముఖ్యతను చాటుతుంది. ఇది మీరు అందించిన బేస్ టెక్స్ట్ చాలా బాగుంది, గొప్పగా ఉంది! మీ చివరి లైన్ ప్రకారం ("నృత్యానికి నివాళి" కూడా జోడించావు. చేయండి") ు దానికి అనుగుణంగా చివర్లో ఒక "నృత్యానికి నివాళి" అనే శీర్షికతో ముగింపు భాగాన్ని చక్కగా రాస్తాను: నృత్యానికి నివాళి భావప్రకటనకి, సంస్కృతుల ఏకతకి, మానవ అనుభూతుల ఆవిష్కరణకి నృత్యం ఒక అమూల్యమైన మాధ్యమం. శరీరాన్ని లయబద్ధంగా కదిలిస్తూ, మనసును భావాలతో నింపే ఈ కళా సంపదకు మనం హృదయపూర్వక నివాళి అర్పిద్దాం. ప్రతి అడుగు... ప్రతి హావ భావం... ఒక భావ కదలిక. ప్రతి నాట్యం... ఒక జీవన పుట. ఈ అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా, నృత్యానికి ు భావాలను కలిపే మహత్తర కళకి ు నమస్కరిస్తూ, "కళలకు గౌరవం, జీవితానికి అందం" అనే సందేశాన్ని మనం వెదజల్లుదాం. ఈ సందర్భంగా, ప్రతి ఒక్కరూ నృత్యం వంటి కళలకు గౌరవం ఇచ్చి, వాటిని జీవితంలో భాగంగా చేసుకునే సంకల్పం చేయాలి. నృత్యం మన జీవితాన్ని, మన భావాలను, మన ప్రపంచాన్ని మరింత అందంగా మార్చగల శక్తి కలిగి ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# 2025లో ప్రపంచానికి ముప్పు తప్పదా.. బాబా వంగా భవిష్యవాణి కలకలం!



జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేకమంది నిపుణులు రెండు దేశాల మధ్య యుద్ధం జరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాబా వంగా ప్రస్తావన మళ్లీ తెర మీదకు వచ్చింది. వాస్తవానికి బాబా వంగా ప్రపంచ వినాశనం గురించి అనేక భవిష్యవాణిలు చేశారు. బాబా వంగా చెప్పిన విషయాలు ఒక్కొక్కటిగా నిజమవుతున్నాయని చాలామంది అంటున్నారు. అంతేకాకుండా, బాబా వంగా పహల్గామ్ దాడి గురించి కూడా ముందే చెప్పారని కొందరు అంటున్నారు. ఈ దాడిని బాబా వంగా 2043 నాటికి ప్రపంచంలో ఇస్లాం పాలన వస్తుందనే భవిష్యవాణితో ముడిపెట్టి చూస్తున్నారు. ఇది మాత్రమే కాదు.. బాబా వంగా 2025 నుంచి ప్రపంచ వినాశనం ప్రారంభమవుతుందని భవిష్యవాణి చేశారు. దీనితో ప్రపంచంలోని పెద్ద సంఖ్యలో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. బాబా వంగా ఒక అంధ బల్గేరియన్ మానసిక నిపుణురాలు. ఆమె తన భవిష్యవాణుల ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆమె 1996లో మరణించారు. బాబా వంగా ప్రపంచ వినాశనం గురించి ఏమి చెప్పారో, వాటి సంకేతాలు ఎలా కనిపిస్తున్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.

**2025లో యూరప్‌లో యుద్ధం...** బాబా వంగా 2025లో యూరప్‌లో ఒక పెద్ద యుద్ధం జరుగుతుందని జోస్యం చెప్పారు. ప్రపంచ వినాశనం దీనితోనే మొదలవుతుందని దీని కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రభావితమవుతారని కూడా ఆమె అన్నారు. నిపుణులు చెబుతున్న ప్రకారం డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ప్రపంచంలో వాణిజ్య యుద్ధం మొదలైంది. ఇప్పటివరకు అమెరికా వంటి దేశానికి మద్దతుగా నిలిచిన అనేక యూరోపియన్ దేశాలు కూడా ట్రంప్ విధానాలను వ్యతిరేకించడం ప్రారంభించాయి. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే పరిస్థితి తీవ్రంగా మారవచ్చు. యూరప్‌లో అరాచకం ఏర్పడవచ్చు. వాణిజ్య యుద్ధంలో ధరలు విపరీతంగా పెరిగి ప్రపంచంలో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది.

**2043 నాటికి ఇస్లామిక్ పాలన...** బాబా వంగా మరొక భవిష్యవాణి 2043 నాటికి ప్రపంచంలో ఇస్లామిక్ పాలన వస్తుందని చెప్పింది. చాలా మంది పహల్గామ్ దాడిని దీనితో ముడిపెట్టి చూస్తున్నారు. బాబా వంగా ఈ భవిష్యవాణి పాకిస్తాన్ గురించి చెప్పిందని కొందరు అంటున్నారు. పహల్గామ్ దాడి తర్వాత ఆసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారత్, పాకిస్తాన్ వంటి దేశాల సరిహద్దుల్లో యుద్ధం ప్రారంభమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది పెరిగితే తీవ్రమైన పరిణామాలు ఉండవచ్చు.

**ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో భూకంపాలు...** ప్రపంచ వినాశనం గురించి బాబా వంగా చెప్పిన మరొక భవిష్యవాణి సంకేతాలు కూడా కనిపిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఒకదాని తర్వాత ఒకటి భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు పెరిగాయి. ఇటీవల మయన్మార్‌లో సంభవించిన శక్తివంతమైన భూకంపంలో చాలా మంది మరణించారు. ఇలాంటి ఒక భవిష్యవాణిని జపాన్‌కు చెందిన మరో వ్యక్తి కూడా చెప్పారు. జూలైలో జపాన్‌లో సునామీ వచ్చే అవకాశం ఉందని తను జోస్యం చెప్పారు.

# ఓవరాక్షన్ కాకుంటే.. పాక్ కు వెళ్లే వేళ ఈ మాటలా?

ఓపక్క నిర్దయగా ఒక దేశ ప్రజల ప్రాణాలు తీస్తున్న దేశానికి చెందిన పౌరుల ప్రాణాల్ని కాపాడాల్సిన ధర్మం ప్రపంచంలో మరెక్కడా ఉండదు. తమ దేశం చేసే తప్పులకు సదరు దేశస్తులు మూల్యం చెల్లించక తప్పదు. ఈ చిన్న విషయాన్ని మర్చిపోయి.. ఇంతకాలం భారత్ ఆతిథ్యాన్ని అందుకొని... తిరిగి వెళ్లే వేళలోనూ భారత్ మీద నిందలు వేసే అతి బ్యాచ్ ను ఏమనాలి? ఎలా చూడాలి. ఎంత భావోద్వేగంలో అయినా సరే.. ఈ దారుణ పరిస్థితికి కారణం తమ దేశ ప్రభుత్వమే అన్న ఇంగితాన్ని మర్చిపోయే వాళ్లను ఏమనాలి? దాడికి పాల్పడింది ఉగ్రవాదులు.. శిక్షింపబడింది వాళ్లేనే కానీ ఏం తప్పు చేయని మమ్మల్ని ఎందుకు శిక్షించటం? అంటూ భారత్ లో ఉండి తాజాగా తమ దేశానికి వెళ్లే వేళలో పాకిస్తానీయులు వేస్తున్న ప్రశ్నలు దేనికి నిదర్శనం? కనికరం అన్నది లేకుండా అమాయకులు ప్రాణాలు తీసేసిన తమ దేశానికి చెందిన ఉగ్రవాదులను పాకిస్తానీయులు ఎలా వెనకేసుకొని వస్తారు? అంతదాకా ఎందుకు పహల్గాం ఉగ్రఘటన తర్వాత పాక్ లోని ప్రభుత్వం.. అక్కడి నేతల రియాక్షన్ చూసిన తర్వాత అయినా మన దేశంలో ఉన్న పాకిస్తానీయుల



తీరు మారాలి కదా? ఒకవేళ.. ఎవరి దేశం వారికి ముఖ్యం అన్న పాయింట్ విషయానికి వచ్చినప్పుడు.. నోరు మూసుకొని తమ దేశానికి వెళ్లకుండా.. నీతి బోధలు ఏల? అన్నది మరో ప్రశ్న. తాము పాక్ లో పుట్టటమే నేరమా? అంటున్న వారు.. గుర్తించాల్సిన అంశం ఏమంటే.. అవును.. నిజమే కదా? అన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో దౌత్య చర్యల ద్వారా శాంతియుత వాతావరణాన్ని కొందరు పాకిస్తానీయులు కోరుకోవటం చూస్తే.. ఒళ్లు మండక మానదు. వాళ్ల దేశానికి చెందినోళ్లు మనోళ్లను కనికరం లేకుండా చంపేస్తుంటే.. అందుకు ఎలాంటి మూల్యం చెల్లించని దాయాదితో శాంతి చర్చలు ఎందుకు జరపాలి? అనారోగ్య కారణాలతో ప్రతి నెల వందలాది మంది పాక్ జాతీయులు భారత్ కు వచ్చి చికిత్స చేయించుకొని వెళుతుంటారు. అలాంటి వారిలోకొందరు తాజాగా తమ దేశానికి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితుల్లో.. "పహల్గాం ఘటనకు ముందు వరకు స్థానికులు తమతో బాగానే ఉండేవారు.. ఆ తర్వాత వారి తీరులో మార్పు వచ్చింది" అని పాక్ జాతీయుల నోటి నుంచి వచ్చిన మాటల్ని చూసినప్పుడు.. ఇంత జరిగిన తర్వాత కూడా ఇంటి అల్లుళ్ల మాదిరి ట్రీట్ చేయాలేం కదా? అన్న మాట బలంగా చెప్పాల్సిన అవసరం ఉందని చెప్పాలి.

# ఒకప్పుడు వేల కోట్ల స్కామ్ జరిగిన చోటు...

## నేడు ఆహ్లాదకరమైన కాఫీ కేఫ్!

పంజాబ్ నేషనల్ బ్యాంక్... ఈ పేరు వింటేనే వేల కోట్ల రూపాయల నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ కుంభకోణం గుర్తుకు వస్తుంది. ముంబైలోని బ్రాడీ హౌస్ బ్రాంచ్ ఈ మోసానికి కేంద్ర బిందువుగా నిలిచింది. అయితే ఇప్పుడు ఈ ప్రదేశం పూర్తిగా మారిపోయింది. ఎలా అంటే నమ్మశక్యం కాని విధంగా ఈ బ్యాంక్ బ్రాంచ్‌ను ఇప్పుడు ఒక అందమైన కాఫీ షాప్‌గా మార్చేశారు. సందర్శకుడు ఇప్పుడు హాయిగా ఇక్కడ కుర్చీల్లో కూర్చుని, మెల్లగా వినిపిస్తున్న సంగీతాన్ని ఆస్వాదిస్తూ రుచికరమైన ఆర్టిసానల్ కాఫీని తాగుతున్నారు. ఒకప్పుడు అక్కడ నెలకొన్న గందరగోళానికి ఇది పూర్తి విరుద్ధమని చెప్పొచ్చు. దక్షిణ ముంబైలోని ఫోర్ట్ ప్రాంతంలో ఉన్న బ్రాడీ హౌస్ బిల్డింగ్ ఒకప్పుడు దేశంలోనే అతిపెద్ద ఆర్థిక కుంభకోణాలలో ఒకదానికి కేంద్రంగా ఉండేది. నీరవ్ మోదీ, అతని మేనమామ మెహుల్ చోక్సీ 2011 మార్చి నుంచి 2017 నవంబర్ మధ్య బ్రాడీ హౌస్ బ్రాంచ్ అధికారులకు లంచాలు ఇచ్చి లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్, ఫారిన్ లెటర్స్ ఆఫ్ క్రెడిట్ ఉపయోగించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి



సుమారు 13,000 కోట్ల రూపాయల ప్రజల సొమ్మును కాజేశారు. ఈ కుంభకోణం 2018 జనవరిలో వెలుగులోకి వచ్చింది. పీఎన్బీ భారతీయ రిజర్వ్ బ్యాంక్‌కు మోసం గురించి నివేదిక సమర్పించి, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటికే చోక్సీ, మోదీ దేశం విడిచి పారిపోయారు. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ కుంభకోణంపై దర్యాప్తు చేశాయి. 2019 మార్చిలో సీబీఐ, ఈడీ మోదీపై చేసిన ఆరోపణల ఆధారంగా జారీ చేసిన ఎక్స్‌ట్రాడిషన్ వారెంట్‌పై లండన్‌లో అరెస్ట్ అయ్యారు. అప్పటి నుంచి వారు జైలులోనే ఉన్నారు. బెల్జియం ఫెడరల్ పోలీస్ సర్వీస్ భారతీయ ఏజెన్సీల అభ్యర్థన మేరకు ఏప్రిల్ 12న చోక్సీని అరెస్ట్ చేసింది. అయితే, పీఎన్ బీ కుంభకోణానికి సంబంధించిన అనేక పరిణామాలు జరుగుతున్నప్పటికీ, బ్రాడీ హౌస్‌పై వాటి ప్రభావం కనిపించడం లేదు. దానిని ఇప్పుడు ఒక విలాసవంతమైన కేఫ్‌గా మార్చేశారు. ఒకప్పుడు ఆర్థిక నేరాలకు సాక్షిగా నిలిచిన ఈ ప్రదేశం ఇప్పుడు ప్రశాంతమైన కాఫీ షాప్‌గా రూపాంతరం చెందడం నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది.

చురకలు

## సంపాదకీయం

# మోడీ వరస హెచ్చరికలు... అంతా వ్యూహాత్మకమా ?

కాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రదాడి విషయంలో మొదట నరేంద్ర మోడీ ట్విట్టర్ ద్వారా ఘాటుగా రియాక్ట్ అయ్యారు. ఆ తరువాత బీహార్ లో జరిగిన ఒక సభలో ఘాటుగా స్పందించారు. ఇపుడు చూస్తే ఆయన మన్ కీ బాత్ కార్యక్రమం లో పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ చాలా సీరియస్ స్టేట్మెంట్స్ ఇచ్చరు. ప్రతీ భారతీయుడి రక్తం మరిగిపోతుందని మోడీ అన్నారు. కాశ్మీర్ మీద ఉగ్రదాడిపై అంతా అగ్రహంతో రగిలిపోతున్నారని అన్నారు. అంతే కాదు ఉగ్రవాదులకు ధీటైన సమాధానం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇంతటికష్టకాలంలో దేశం ఏకతాటిపై నిలిచిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మోడీ ఇలా వరస హెచ్చరికలు చేయడం ఎందుకోసం అన్న చర్చ వస్తోంది. ఆయన అత్యంత బలవంతుడు. అనుకుంటే ఉగ్రదాడి జరిగిన మరుక్షణాన్నే పాక్ మీద దాడి చేయవచ్చు. లేదా మౌనంగానే ఉంటూ సరైన సమయం చూసి శతృవు మీద ఎటాక్ చేయవచ్చు. అంతే కాదు దాయాది పీచమణచేందుకు బహుముఖీయమైన అస్త్రాలతో ఒక్కసారిగా మీద పడవచ్చు. ఇలా ఎన్నో చేయవచ్చు. కానీ మోడీ మాత్రం ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ప్రతీ సందర్భంలో పాక్ కి బాగా వినిపించేలా సీరియస్ వార్నింగ్స్ తో రీసౌండ్ చేస్తున్నారు. ఎందుకిలా అంటే అంతా వ్యూహాత్మకం అని అని చెబుతున్నారు. ఉగ్ర దాడి తరువాత పాక్ సైన్యం అప్రమత్తం అయింది. ఆ పాలకులు సరిహద్దుల వద్ద భద్రత మోహరించి రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. ఇక భారత్ మీద ఉగ్ర దాడి జరగడంతో ప్రపంచ దేశాలు కూడా సానుభూతి చూపిస్తూ భారత్ కి మద్దతుగానే మాట్లాడుతున్నాయి. ఇలా ప్రపంచంలో ఇపుడు అనుకూలత భారత్ కి ఉంది. అయితే కాలం గడచే కొద్దీ అది కొంత చల్లబడవచ్చు. అందుకే వేడి మీద ఉంచేందుకే మోడీ ఈ విధంగా మాట్లాడుతున్నారు అన్న చర్చ సాగుతోంది. మరో వైపు చూస్తే పాక్ తెంపరితనం కూడా ప్రపంచం అంతా చూసేలాగానే మోడీ ఈ ప్రకటనలు చేస్తున్నారు. పాక్ అసలే రెచ్చగొట్టుడు తన నైజం అని చాటి చెప్పుకుంటుంది. ఇపుడు కూడా అలాంటి పనులే చేస్తోంది. అణు బాంబులు అంటోంది. భారత్ మీదనే మా దాడి అని అవాకులూ చవాకులూ పేలుతోంది. ఇవన్నీ కూడా పాక్ మీద భారత్ ఎంతలా దాడి చేసినా తప్పు లేదని తటస్థులకు అభిప్రాయం కలిగేలా చేస్తున్నాయని అంటున్నారు. ఇక దేశంలో చూస్తే ఈ నెల 22న ఉగ్రదాడి జరిగిన నాటి నుంచి దేశమంతా వేడెక్కి ఉంది. ప్రతీకారం తీర్చుకోమని గట్టిగా కోరుతోంది. దాంతో ప్రజలకు మద్దతుగా ఉంటూ వారి వాయిస్ నే తన నోట మోడీ మళ్ళీ వినిపించడం ద్వారా వారికి ఎంతో స్వాంతన కలిగిస్తున్నారు. ఇక పాక్ మీద గట్టి ఆపరేషన్ నే రెడీ చేస్తున్నారు అని అంటున్నారు. ఆషామాషీగా ఈసారి దాడి ఉండదని అంటున్నారు. పాక్ కి శాశ్వతంగా గుణపాఠం నేర్పేలా ఉంటుందని చెబుతున్నారు. అందు కోసమే కొంత ఆలస్యం అయినా సరైన రిజల్ట్ కోసమే భారత్ చూస్తోంది అని అంటున్నారు. ఈ లోగా జనాలో ఉన్న ఎమోషన్స్ కంట్రోల్ లో ఉంచడం కోసం వ్యూహాతమకంగానే ఈ తరహా ప్రకటనలు చేస్తున్నారు అయితే పాక్ తో సహా అందరికీ తెలుసు. భారత్ ఏదో విధంగా ప్రతీకారం తీర్చుకుంటుంది అని. అది ఏ రూపం లో ఉంటుంది అన్నదే ఎవరికీ అంతుబట్టడం లేదు. అయితే అదే సస్పెన్స్. అక్కడే ఉంది అసలైన స్ట్రాటజీ. ఇక పాక్ మీద దాడి అంటే త్వరలో జరగవచ్చు. లేదా కొంతకాలం ఆగి అయినా జరగవచ్చు. ఒక సుదీర్ఘమైన ప్రణాళిక కోసమే ఇదంతా జరుగుతోంది అని అంటున్నారు. సో పాక్ నడ్డి విరగడం ఖాయం. అది ఎపుడు అంటే పాక్ కోరినపుడు కాదు, పైగా పాక్ యుద్ధ పిపాసతో రగులుతున్న ఈ సమయంలో అంత కంటే కాదు అని అంటున్నారు. మరి ఎపుడు అంటే వెయిట్ అండ్ సీ.

# దేవతలకు రూపాలిచ్చిన కళాతపస్వి రవి వర్మ - ఏప్రిల్ 29... రాజా రవివర్మ జయంతి

"రవివర్మకే అందని ఒకే ఒక అందానివో", "రవి చూడని పాడని నవ్య నాదానివో" అంటూ "రావణుడే రాముడైతే" చిత్రం (1980) కోసం, వేటూరి సుందర రామమూర్తి కలం నుండి జాలువారి, బాలు - జానకి గళాల నుండి అలవోకగా, సుమధురంగా గానం చేయబడిన పాట, సంగీత ప్రియులకు సుపరిచితమే. చిత్రకళకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన చిత్రకారుడు రాజా రవివర్మ. హైందవ సంస్కృతిలో అంతర్భాగమైన రామాయణ, మహాభారత ఆది పురాణాలలో ఘట్టాలను, చిత్రాలుగా మలిచి, గుర్తింపు పొందారు రాజా రవివర్మ. భారతావనిలోని కేరళలో తిరువనంత పురానికి 25 మైళ్ల దూరంలోని కిలమానూరు, రాజ ప్రాసాదంలో ఉమాంబ తాంబుతాట్టి, నీలకంతం భట్ట దంపతులకు 1848 ఏప్రిల్ 29న రవివర్మ జన్మించారు. చిన్నతనంలోనే ఈయన చూపిన ప్రతిభ వల్ల, ట్రావెన్కోర్ మహారాజా అయిల్యం తిరునాళ్ చేరదీసి, ప్రోత్సహించారు. అక్కడి ఆస్థాన చిత్రకారుడైన, శ్రీ రామ స్వామి నాయుడు వద్ద శిష్యరికం చేశాడు. చిత్రకళను బ్రిటిష్ దేశస్థుడైన, థియోడార్ జెన్సన్ వద్ద నేర్చుకున్నారు. పాశ్చాత్య చిత్రకళలోని శక్తి, కొట్టొచ్చినట్లున్న భావ వ్యక్తీకరణ, రవి వర్మను ఎంతగానో ప్రభావితం చేశాయి. అవి భారతీయ చిత్రకళా శైలికి ఎంతో భిన్నంగా కనిపించాయి. 1873 వియన్నా చిత్ర ప్రదర్శనలో, మొదటి బహుమతి పొందిన తర్వాత రవి వర్మ వెలుగులోకి వచ్చారు. ఆయన తన చిత్రాలను, దక్షిణభారత స్త్రీల లాగా ఊహించి, అందంగా చిత్రించే వాడు. ముఖ్యంగా మహాభారతం




లోని నల దమయంతుల, శకుంతల దుష్యంతుల కథలలోని ఘట్టాలను, చిత్రాలుగా చిత్రించి ఎంతో పేరు సంపాదించారు. భారతీయుల ఊహలలో, తమ పురాణాలలో ఉన్న పాత్రలు రవివర్మ రూప కల్పన చేసిన చిత్రాల్లాగా మారిపోయాయి అంటే అతిశయోక్తి లేదు. రవివర్మ తరుచుగా తన శైలిలో ప్రదర్శ నాత్మకంగాను, చాందసంగాను ఉంటాడన్న విమర్శలను ఎదుర్కొన్నా, ఆయన పనితనం భారతదేశంలో ప్రశంసా పాత్రమై, కీర్తి గడించింది. 1894లో లితో గ్రాఫిక్ యంత్రాలు, చిత్రించడానికి అనువైన రాళ్లు, సాంకేతిక నిపుణులను, జర్మనీ నుండి ఆయన తెప్పించారు. దేశంలోనే మొదటిసారిగా అత్యాధునిక ప్రెస్ ను ముంబైలో ప్రారంభించారు. అయితే అక్కడ స్థలాభావం కారణంగా, భయంకరమైన ప్లేగు వ్యాపించడం వల్ల, కార్మికులు సరిగా లభించక పోవడం వల్ల 4 సంవత్సరాల తర్వాత, మహారాష్ట్ర లోని కొండా కోనల నడుమ ఉన్న, మలవాలి అనే గ్రామాన్ని పెంచుకున్నారు. పక్కనే తన నివాసాన్ని కూడా ఏర్పరచుకున్నారు. రవి వర్మ మరణించడానికి రెండేళ్ళ ముందు, తాను నెలకొల్పిన ప్రెస్ ను, తన స్నేహితుడైన ఒక జర్మన్ సాంకేతిక నిపుణునికి విక్రయించారు. దాంతోపాటు 100 చిత్రాలకు కాపీరైట్ కూడా ఇచ్చివేసారు. అయితే 1972లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం కారణంగా, ప్రెస్ కు భారీ నష్టం వాటిల్లింది. ఆ తర్వాత మిగిలిన చిత్రాలను రాళ్ళను, ప్రెస్ చుట్టూ నివసించే వారికి పంచి పెట్టారు. ఆ తర్వాత ముంబై-పూణే ప్రభుత్వాలు కొన్నిటిని మాత్రమే భద్ర పరచ గలిగాయి. శ్రీకృష్ణ రాయబారము, రావణ జటాయు వధ, ఇంద్రజిత్ విజయము, శకుంతల, సుభ ద్రార్జునులు, దమయంతికి హంస సంవాదము, శంతనుడు మత్స్యగంధి, ప్రేమలేఖ వ్రాస్తున్న శకుంతల, కణ్వుని ఆశ్రమములో రుషి కన్యగా శకుంతల, ఇంద్రజిత్ విజయము, లేడీ విత్ ఫ్రూట్స్, హార్ట్ బ్రోకెన్, పల్లెపడుచు, భిక్షకుల కుటుంబము గుడి వద్ద దానాలు స్త్రీ లాంటి అపురూప చిత్రాలు రాజా రవివర్మ కు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# సాగునీటి వివక్షత పై ఎలుగెత్తి చాటిన విద్యాసాగర్ రావు - ఏప్రిల్ 29...ఆర్. విద్యా సాగర్‌రావు వర్ధంతి

వలస పాలకుల స్వార్థ పాలనలో, సాగు నీటి రంగంలో జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టు ల్లో మోసంపై గణాంకాలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి విద్యాసాగర్ రావు. తెలంగాణకు నీటి విషయంలో జరిగిన మోసం, ప్రాజెక్టులపై జరిగిన అన్యాయం పై విద్యాసాగర్‌రావు చేసిన పోరాటం, అధ్యయనం అనన్య సామాన్యం. సాగునీటి రంగలో నిపుణులైన విద్యాసాగర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో తెలం గాణకు నీటి కేటాయింపుల విషయంపై జరిగిన అన్యాయం పై ఎలుగెత్తి చాటారు. నీటి పారుదల శాఖలో వివిధ పదవులలో, హోదా లలో పని చేసిన ఆయన, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రాజెక్టులు, నీటి కేటాయింపు లపై ఎప్పటికప్పుడు సమాచారం, సలహాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేసేవారు. సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన ఆధార సహితంగా, బహిర్గత పరిచి, ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ను ప్రేరేపించడంలో, ఉద్యమ తెరాస పార్టీ అధినేతకు వెన్ను దన్నుగా ఉన్నారు. అలా కేసీఆర్‌కు ఉన్న అతి దగ్గర వ్యక్తులలో విద్యాసాగర్ రావు ఆంతరంగిక ముఖ్యులలో ఒకరై పోయారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తన పరి జ్ఞానంతో కొత్త ప్రాజెక్టుల రూప కల్పనలో ఆయన భాగస్వామ్యం విడదీయ జాలనిది, ఆయన పాత్ర నిజంగా మరువలేనిది.. "జయశంకర్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప తెలంగాణ మహాను భావుడు విద్యాసాగర్ రావు" అని కేసీఆర్ చేత ప్రశంసింప బడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ ఆయన. ఆర్. విద్యాసాగర్‌రావు (14 నవంబరు 1939 %-% 2017 ఏప్రిల్ 29) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన జాజిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్థితి, వారి కుటుంబంలో అందరికీ చదువు పట్ల ఆసక్తి కలగడానికి హేతువైంది. వారి గ్రామంలో తొలి సారిగా మెట్రిక్యులేషన్ చేసిన వ్యక్తి రాఘవ రావు కాగా, మొదటి పట్టభద్రులు రాఘవరావు పెద్ద కుమారుడు, మొట్ట మొదటి ఇంజనీరింగ్ పట్టభద్రుడు విద్యాసాగర్‌రావు కావడం విశేషం. విద్యాసాగర్ రావు 1960లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి ఇంజనీరింగ్ లో పట్టభద్రు లయ్యారు. 1979 లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి రూర్కీ) లో నీటి వనరుల అభివృద్ధి లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన 1983లో అమెరికా లోని కొలోరాడో స్టేట్ విశ్వ విద్యాలయం నుండి నీటి వనరుల వ్యవస్థ ఇంజనీరిం గులో డిప్లొమా పొందారు. ఆయన 1990లో ఢిల్లీ విశ్వ విద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టాను కూడా సంపాదించారు. బీటెక్ పూర్తి అయిన వెంటనే క్యాంపస్‌లోని మహిళా కాలేజీ మెయింటెనెన్స్ ఇంజనీరుగా ఉద్యోగంలో చేరారు. కళల పట్ల ఆసక్తి కలిగిన ఆయన, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా రాయటం, నాటకాలు వేయడం వంటి హాబీ లకు దూరం కాలేదు. అను దినం సాయంత్రం విధుల నిర్వహణ అనంతరం రవీంద్ర భారతికి వెళ్ళేవారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి, అనంతరం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, నీటిపారుదల శాఖలో ఇంజ నీరుగా పనిచేశారు. ఢిల్లీలో ఉన్న సమయంలో సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసు కున్నారు. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాక, తరువాత తిరిగి హైదరాబాద్ వచ్చారు. దాదాపు 34 సంవత్సరాల పాటు కేంద్ర జల సంఘం లోనే విధులు నిర్వహించడం తో ఆయన దేశ వ్యాప్తంగా జల వనరుల అంశంపై అపారమైన అనుభవం గడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల విషయాలపై సమగ్ర అవగాహన, సరైన ఆలోచనను కలిగి ఉండేవారు. 2016 నవంబ రులో కాకతీయ విశ్వ విద్యాలయంచే నిర్వహించ బడిన "మిషన్ కాకతీయ" ప్రాజెక్టుకు సంబంధించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలో వ్యవసాయ రంగంలో నీటి పారుదల ప్రాజెక్టు లపై ప్రభుత్వ విధానాలను సమగ్రంగా వివరించారు. 2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (భారత దేశం) ఆయనను "లీడింగ్ ఇంజ నీరింగ్ పెర్సనాలిటీస్ ఆఫ్ ఇండియా"గా గుర్తించి, పురస్కార గ్రహీతను చేసింది. ఆయన ఎన్నో రచనలు చేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాల న్నింటినీ కలిపి.. 'నీళ్లు-నిజాలు' పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. అలా "నీళ్ళు నిజాలు విద్యాసాగర్ రావు"గా పేరెన్నిక




గన్నారు. ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రంలో ఉచిత పాత్రలో నటించారు. ఐక్యరాజ్య సమితి ఇన్విరాన్ మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యు డిగా, సెంట్రల్ వాటర్ కమి షన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా సేవలు అందించిన విద్యాసాగర్ రావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన లోనూ సలహాలు అందించారు. సాగునీటి రంగ రిటైర్డ్ చీఫ్ ఇంజినీరుగా, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగా సుపరిచితులు అయిన విద్యా సాగర్‌రావు రచయితగా, నటునిగా చూపిన ప్రతిభ గురించి చాలా మందికి తెలియదు. గిరీషం కలం పేరుతో ఆయన రాసిన రచనలు అనేక పత్రికల్లో ప్రచురించారు. బాల్యంలో కవి సమ్మేళనాలు, నాటకాల ప్రదర్శనలకు వెళ్లేవారు. కాలేజ్ స్థాయి వివిధ పోటీల్లో పాల్గొని, నాటకాలు కూడా వేసేవారు. కొంత కాలం ఆనారో గ్యానికి గురై, 2017 ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో దివంగ తులైనారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**


# ప్రజాసేవలో ఘనాపాఠీ ... రారెవరూ ఆయనకు సాటి - ఏప్రిల్ 29... వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి

నీతి, నిజాయతీలకు మారుపేరు, నిబద్ధతకు ప్రతిరూపం ఆయన. తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన ప్రజా నాయకుడు. రాజకీయాల విలువలకు పెద్దపీట వేసి, ప్రజాపోరాటాల్లో పాల్గొన్న చైతన్యశాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తమ శాసనసభ్యుడు, గ్రంథాలయోద్యమ సారథి, రాష్ట్ర తొలి అధికార భాషా సంఘం అధ్యక్షుడు, బహుగ్రంథకర్త. పోరాట యోధుడు, ప్రజా సేవకుడు. ఆజన్మ బ్రహ్మచారి, అపర భీష్ముడు. ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఖాదీ దుస్తులతో, చేతిలో ఖాదీ సంచితో నిరాడంబరంగా కనిపించే అజాత శత్రువు.ఆయన గురించి ఎంత రాసినా తక్కువే. ఆయనే ప్రజలు మెచ్చిన నేత...వావిలాల గోపాల కృష్ణయ్య. వావిలాల గోపాలకృష్ణయ్య (సెప్టెంబరు 17, 1906 – ఏప్రిల్ 29, 2003) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుడు, పద్మ భూషణ పురస్కార గ్రహీత. కళా ప్రపూర్ణ బిరుదు గ్రహీత. 1906 సెప్టెంబరు 17న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో వావిలాల నరసింహం, పేరిందేవి దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు. పలనాడు పుల్లరి సత్యాగ్రహంలో గార్లపాటి హనుమంతరావు తదితర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘ సభ్యుడిగా ఉంటూ, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావల్సిందేనని పట్టుబట్టారు. 1925లోనే సత్తెనపల్లిలో 'శారదానిలయం' అనే గ్రంథాలయాన్ని, వావిలాల గోపాలకృష్ణయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ హయర్ స్టడీస్ అనే సంస్థని గుంటూరు అరండల్‌పేటలో ఏర్పాటు చేశారు. 1974 – 77 కాలంలో తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షునిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘ సంయుక్త కార్యదర్శిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సివిక్ బోర్డు సభ్యుడిగా పనిచేసారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి, గెలుపొందారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం ఏర్పడటంతో అక్కడ పోటీ చేసి తొలి శాసన సభ్యుడిగా ప్రజలకు సేవలు అందించారు. 1952, 1955, 1962, 1972 ఎనికల్లో వరుసగా నాలుగు పర్యాయాలు శాసన సభ్యునిగా గెలిచి 19 ఏళ్ల పాటు ప్రజా సేవలో నిలిచారు. ఆయన కృషి ఫలితంగానే శాతవాహన నూలు మిల్లు, ఫణిదం చేనేత సహకార సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యాయి. సమాజంలో అసమానతలను రూపు మాపేందుకు ఎంతో కృషి చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమ సంస్థ బాధ్యుడిగా, గ్రంథాలయ ఉద్యమ రథ సారధిగా, దళిత, గిరిజనోద్ధరణ ఉద్యమ నాయకుడిగా ఆయన ముందు నడిచారు. పద్మభూషణ్‌తో పాటు ఎన్నో పురస్కారాలు, సత్కారాలను అందుకున్నారు. ఏక సంథాగ్రాహి, తెలుగు ఆంగ్ల భాషలలో అనేక గ్రంథాలు రచించిన మేధావి. తెలుగులో నలభై అయిదు, ఆంగ్లంలో పదహారు పుస్తకాలు రచించారు. 1922లో 'శివాజీ', 1947లో మద్రాసు మంత్రివర్గమా ఎక్కడికి? 1951లో విశాలాంధ్రం, 1976-77లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమం తదితర రచనలు చేశారు. పత్రికా విలేఖరిగా ప్రారంభించి ప్రజా సేవకే సర్వం త్యాగం చేసిన త్యాగశీలి, ధన్య జీవి గోపాలకృష్ణయ్య. సుదీర్ఘమైన ఆయన ప్రజా జీవిత ప్రస్థానంలో అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. 'విశాలాంధ్ర' ఉద్యమం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం. అన్నిటికన్నా



అతి ముఖ్యమైనది నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కోసం ఆయన చేసిన కృషి మరువ రానిది. నాటి ప్రధాని నెహ్రూ చేత ఆ ప్రాజెక్ట్ కు శంఖుస్థాపన చేయించటంలో వావిలాల కృషి మరవ లేనిది. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' అనే సత్కారంతో గౌరవించింది. భారత ప్రభుత్వం వీరిని 'పద్మ భూషణ్' బిరుదుతో సత్కరించింది. చివరి రోజులలో ఆనారోగ్యానికి గురై నిమ్స్‌లో కొంతకాలం వైద్యం చేయించుకొన్న ఆయన 2003 ఏప్రిల్ 29న మరణించారు. వావిలాల శత జయంతిని పురస్కరించుకొని 2006 సెప్టెంబర్ 14వ తేదీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నాటి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య, నాటి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు, నాటి సహకార శాఖ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తదితరుల భాగస్వామ్యంతో సత్తెనపల్లి తాలుకా సెంటర్‌లో వావిలాల గోపాలకృష్ణయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. **రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# సజీవ సాక్ష్యాలు.. మైదం చంద్రశేఖర్ చిత్రాలు - ఏప్రిల్ 29... చంద్ర ప్రథమ వర్ధంతి



"చంద్ర" పేరుతో దేశ విదేశాలలో పేరెన్నిక గన్న అపురూప చిత్రకారుడు, శిల్పి, కార్టూనిస్టు మైదం చంద్రశేఖర్. కళ్లకు కనిపించిన, కళ్ల ముందు కదలాడిన ఊహలకు జీవం పోసి, గీసే గీతలతో అద్భుత సృష్టి చేయడానికి అనర్హమైనది ఏదీ లేదని నిరూపించిన ప్రతిభాశాలి చంద్ర. చంద్ర 1946, ఆగష్టు 25వ తేదీన వరంగల్ జిల్లా, నర్సింహులపేట మండలం, పెద్దముప్పారం గ్రామంలో సోమలక్ష్మి, రంగయ్య దంపతులకు జన్మించారు. 1955లో హైదరాబాద్ లోని సుల్తాన్ బజార్ పాఠశాలలో మెట్రిక్ వరకు చదివారు. సైఫాబాద్ సైన్స్ కళాశాలలో పి.యు.సి (ప్రీ యూనివర్శిటీ కోర్స్) పూర్తి చేశారు. తర్వాత ఫైన్ ఆర్ట్సులో పట్టభద్రులు అయినారు. డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో ఆర్టిస్ట్ కమ్ డిజైనర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. బాపు తర్వాత ఆ స్థాయిలో విరివిగా వార, మాస పత్రికలకు బొమ్మలు గీసిన ఖ్యాతి చంద్రకే దక్కుతుంది. ఒకనాడు ఏ ఇంట చూసినా సాహిత్య గ్రంథాలు, నవలలు, కథల పుస్తకాలు దర్శనం ఇవ్వగా, అనంతర కాల గమనంలో పత్రికలు ప్రజలకు చేరువై, చదువరుల నిత్య జీవితాలలో మమేకం కావడంతో వాటిలో తాను బొమ్మలు వేయడంలో సాధనచేసి, భావాత్మకమైన రేఖాచిత్ర కళలో తన దైన ప్రత్యేక ముద్ర వేశారు. చంద్ర. తొలిరోజుల్లో బాపు అడుగుజాడల్లో నడిచిన చంద్ర ఆ తర్వాత తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన కొన్ని వేల కథలకు చిత్రాలను సమకూర్చారు. ఎన్నో పుస్తకాలకు ముఖచిత్రాల రూప కల్పన చేశారు. వేలకొద్దీ కార్టూనులు గీశారు. చిత్రకళ మీద వ్యాసాలు, సమీక్షలు, కవితలు... అలాగే చంద్ర దాదాపు 150 కి పైగా కథలు రాసి, వివిధ పత్రికలలో ప్రచురించారు. ఆయన మొదటి కార్టూను 1959లో ఆంధ్రపత్రికలో, మొదటి కథ 1961లో ఆంధ్రప్రభలో అచ్చయ్యాయి. ఇతడు జ్యోతి, యువ మాసపత్రికలలో ఆర్టిస్టుగా పనిచేశారు. స్వాతి మాసపత్రిక, మయూరి వారపత్రిక, పుస్తక ప్రపంచం మాసపత్రికలలో సంపాదక వర్గంలో పనిచేశారు. 1970 నుండి 1976 వరకు విప్లవ రచయితల సంఘంలో సభ్యుడుగా ఉన్నారు. విరసం కళాకారుడిగా ఎమర్జెన్సీ సమయంలో జైలుశిక్షను అనుభవించారు. ఇరవై సినిమాలకు, ఆరు డాక్యుమెంటరీ చిత్రాలకు కళాదర్శకుడిగా పనిచేశారు. రెండు డాక్యుమెంటరీ చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఇంద్రధనుస్సు, వెన్నెలవేట మొదలైన టి.వి.సీరియల్స్‌కు దర్శకత్వం వహించారు. చంద్ర వేసిన బొమ్మలు పాత్రలనే కాక ఆ పాత్రల లోతుల్లోని మానసిక ఆనందాల్ని, అంతరంగాల అల్లకల్లోలాల్ని, సంఘర్షణల్నీ చెబుతాయి. కను చూపుల ద్వారా గ్రహించిన దృశ్యాలను, మానస రూపాలను, చేతి మునివేళ్లతో అలవోకగా కుంచెతో జాలు వారించి, సజీవాలుగా, అగణిత రేఖాచిత్రాలు, వర్ణచిత్రాలను చిత్రీకరించి, అజరామరాలుగా చంద్ర తీర్చి దిద్దారు. కళా ప్రేమికుల మనో ఫలకాలపై చెరిగిపోని జ్ఞాపకాలుగా మిగిల్చారు. నాలుగు దశాబ్దాల పాటు నలుపు తెలుపులో ఇలస్ట్రేషన్స్, రంగుల్లో బొమ్మలు, కార్టూన్లు, పెయింటింగ్స్, గ్రీటింగ్ కార్డులు, లోగోలు గీసిన చంద్రకు దేశ విదేశాలలో ఉన్న అభిమానులకు లెక్కే లేదు. వేల సంఖ్యలో నవలలకు కవర్ పేజీలు వేశారు. దశాబ్దాల పాటు వార ప్రతికలకు పండగ ప్రత్యేక సంచికల్లో కవర్ పేజీలు గీశారు. ఓపెన్ యూనివర్శిటీలో ఆయన పాఠాలు కూడా చెప్పారు. ప్రముఖ డైరెక్టర్ బి. నరసింగ రావుతో ఉన్న అనుబంధంతో ఆయన చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్ గా పనిచేయడమే కాకుండా కొన్ని సినిమాలలో నటించారు. మరికొన్ని చిత్రాలలో అతిథి పాత్రలు సైతం పోషించిన చంద్ర, టీవీ సీరియల్స్ ను డైరెక్ట్ చేశారు. గత కొంతకాలంగా చంద్ర నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ, తాజాగా కరోనా బారిన కూడా పడ్డారు. మదర్ థెరిసా రీహాబిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతూ గత సంవత్సరం ఏప్రిల్ 29న రాత్రి మృతి చెందారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

చురకలు



# పట్టణాల్లోని ఇళ్లకు కొలతలు

కరీంనగర్: జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు మున్సిపాలిటీల్లో ఉన్న ఇళ్లకు కొలతలు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించారు. రెండేళ్ల కిందట భువన్ యాప్‌తో సర్వే చేపట్టగా ఆ సమయంలో 75 శాతం ఇళ్లను లెక్కించారు. 2018 సంవత్సరంలో విలీనమైన గ్రామాలతోపాటు నగరంలో నూతన భవనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. వీటికి సరైన విధంగా పన్ను మదింపు జరగకపోవడం, అదనపు అంతస్తులు నిర్మించుకోవడం, ఆస్తిపన్ను పరిధిలోకి రాకపోవడం, అక్రమ నిర్మాణాలు కట్టడం, ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్లు తీసుకోవడంతో కొలతల విషయంలో తేడాలు ఉంటున్నాయి. ఆస్తిపన్ను మదింపునగర, పురపాలికల్లో భువన్ యాప్ ద్వారా భవనాల చిత్రాలు, కొలతలను అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా అంతర్జాలంలో నమోదు చేశారు. వీటన్నింటికి ఆస్తిపన్ను మదింపు ప్రక్రియ జరుగుతుంది. ఇప్పటికే ఆస్తిపన్ను సర్దుబాటు కావాల్సి ఉండగా పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి పెంచిన మొత్తంతో డిమాండ్ నోటీసులు వచ్చే అవకాశముంది.

**అదనపు కట్టడాలకు నోటీసులు**

ఆస్తిపన్ను మదింపులో తేడాలు ఉండటంతో ఒక్కో ఇంటికి సర్వే చేస్తూ



అదనపు కట్టడాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొత్తగా వచ్చిన వార్డు అధికారులకు డివిజన్లు, వార్డులు అప్పగించి తక్కువ ఆస్తిపన్ను చెల్లిస్తున్న జాబితాను తీసుకొని మళ్లీ కొలతలు చేపడుతున్నారు. ప్రధానంగా అదనంగా అంతస్తులు నిర్మించుకోవడం, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని వదలడం లేదు. వాణిజ్య సంస్థ ఆస్తిపన్ను ఏవిధంగా వస్తుందో నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

**పెరుగుతున్న పన్ను**

భువన్ యాప్‌తోపాటు అదనపు నిర్మాణాలకు కొలతలు ఇష్టానుసారంగా చేస్తుండటంతో అడ్డగోలుగా పన్నుల భారం పడుతుంది. దాంతో ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొందరికి అయితే ఎలాంటి కొలతలు చేపట్టకుండానే రివైజ్డ్ ఆస్తిపన్ను చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఓ దశలో నల్లా కనెక్షన్ కూడా తొలగించారు. వీటిపై అభ్యంతరాలు పరిష్కరించుకునే అవకాశాన్ని ఇవ్వకుండా దాటేశారని మండి పడ్డారు. ప్రస్తుతం ఆస్తిపన్ను అధికంగా వస్తుందనే ఫిర్యాదుల మేరకు తిరిగి కొలతలు చేపట్టి ఆస్తిపన్ను రాబట్టుకోవాలని నిర్ణయించారు.

# చల్లనివన్నీ.. మంచివి కాదండోయ్..!

నీలగిరి : ఎండలు మండుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందేం దుకు చల్లటి పానీయాలు తీసుకుంటే బాగుంటుందని అందరూ భావిస్తుంటారు. అయితే చల్లనివన్నీ మంచి పానీయాలా కాదా అని ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో సమృద్ధిగా నీరు తాగాల్సిన అవసరం ఉంది. ఎండ వేడికి తట్టుకోలేక పలువురు జ్యూస్ లు, ఐస్‌క్రీంలు, ఇతర పానీయాలు తీసుకుంటారు. వినియోగదారులను ఆకర్షించేందుకు నిర్వాహకులు వీటిలో రంగులు, ఇతర పదార్థాలను కలుపుతారు. వీటి వల్ల అనేక రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు చెబుతున్నారు.

**కల్తీకి అవకాశం ఉన్న పదార్థాలు**

జ్యూస్‌లు, మజ్జిగ, ఐస్‌క్రీంలు ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లు కల్తీ జరిగేందుకు ఎక్కువగా అవకాశం ఉంటుంది. రంగులు, రుచి కోసం పలు రకాల రసాయనాలను వీటిలో కలుపుతారు. ఫుట్‌పాత్‌లపై తయారు చేసిన ఆహార పదార్థాలు తీసుకునే ముందు ఓ సారి ఆలోచించి తీసుకోవడం ఉత్తమం. జ్యూస్‌లు, ఐస్‌క్రీంలు తయారు చేసేందుకు కలుషిత నీరు, పాలు..పండ్లు త్వరగా పక్వానికి వచ్చేందుకు కార్బైడ్‌లను వినియోగిస్తారు.

**కల్తీపై నిరంతర నిఘా**

–జ్యోతిర్మయి, జోనల్ అధికారి ఆహార కల్తీ నిరోధక శాఖ ఉమ్మడి నల్గొండ జిల్లా ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న వ్యాపారులపై నిరంతర నిఘా పెట్టాం. ఉమ్మడి జిల్లాలో సంచార తనిఖీ వాహనం తిప్పుతున్నాం. వినియోగదారులు ఫిర్యాదులు చేసిన చోట, అనుమానం ఉన్న ఫుడ్ తయారీ కేంద్రాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

2024–25 నల్గొండ జిల్లాలో మొత్తం 42 కేసులు నమోదు చేశారు. 9 చోట్ల అనారోగ్య కారకాలు ఉన్నట్లు గుర్తించారు. 33 చోట్ల నాణ్యత పాటించడంలేదని తేలింది. వీరికి రూ.3.47లక్షలు జరిమానా విధించారు.

వేసవిలో తీసుకోవాల్సిన పదార్థాలు

–కల్యాణి, డైటీషియన్

వేసవిలో ఆరోగ్యం కోసం తాజా పండ్లు, అధిక నీటిని అందించే కూరగాయలు తీసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగుతూ ఉండాలి. నీరు అధికంగా ఉండే సొరకాయ, బీరకాయ, దోసకాయ, టమాట, కీరదోస మొదలైనవి తీసుకోవాలి. సబ్జా గింజలు రోజుకు 15 గ్రాములు నానబెట్టి తీసుకుంటే శరీరం వేడి నుంచి ఉపశమనం పొందుతుంది. ఫ్రైలు, అధిక కొవ్వు పదార్థాలు తీసుకోవడం మంచిది కాదు. షుగర్ వ్యాధిగ్రస్థులు పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి.

# గురుకులం.. పక్కా పర్యవేక్షణే బలం

సంగారెడ్డి : గురుకులాలు.. ఒకప్పుడు సీటు లభించాలంటే ప్రవేశ పరీక్షకు కష్టపడి చదవాలి. ఇక్కడ సీటు దక్కింతే తమ పిల్లల భవిత బాగుంటుందని తల్లిదండ్రులు సంబర పడేవారు. రానురాను గురుకులాల్లో నాణ్యత తగ్గుతోంది. విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు.. భోజనం నాణ్యంగా లేకపోవడం వంటి కారణాలతో పిల్లలు వీటిలో చదివేందుకు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రవేశాలు తీసుకుంటాయి. ఫలితాలు వచ్చిన తరువాత పిల్లలు చేరకపోవడంతో సెప్టెంబరు వరకు సైతం ప్రవేశాలు కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదు. **అద్దె భవనాల్లో ఇరుకుగా..** ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాల్లో బీసీ, మైనార్టీ గురుకులాలు 56 ఉన్నాయి. వీటిలో చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. తరగతి గదిలోనే ఉదయం పాఠాలు వినడం.. రాత్రిపూట అదే గదిలో పడుకోవడం చేయాల్సి వస్తోంది. సొంత భవనాలు నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చినా అమలు కావడంలేదు. కొద్దిపాటి శౌచాలయలు విద్యార్థుల సంఖ్యకు సరిపోవడం లేదు. దుర్వాసన వ్యాపిస్తోంది. విద్యార్థులు అస్వస్థతకు గురై ఇబ్బంది పడుతున్నారు. వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

**ఆటపాటల ప్రోత్సాహం తక్కువే** సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ గురుకులాల్లో గతంలో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహించే వారు. విద్యాభ్యాసంపై దృష్టి పెడుతూనే మరోవైపు ఆటలు.. సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు ఇచ్చేవారు. 5వ తరగతి నుంచే క్రీడలు నేర్పించేవారు. ఇక్కడ చదివిన పిల్లలు వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. ప్రత్యేకంగా కౌన్సెలర్లతో సైకాలజీ తరగతులు నిర్వహించేవారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండే వారు.. మార్కులు తదితర కారణాలతో అఘాయిత్యాలు చేసుకోకుండా మానసిక స్థైర్యం కల్పించే వారు. వేసవి శిబిరాలు అన్ని జిల్లాల్లో నెల రోజుల పాటు ఉండేది. మూడేళ్ల నుంచి అరకొరగా చేపడుతున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు వచ్చేందుకు నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు చెప్పించేవారు.

# కోట్‌పల్లి.. కల్పవల్లి!



ధారూర్: చుట్టూ అటవీ ప్రాంతం.. మధ్యలో ప్రాజెక్టు ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని చెట్లు, అలుగు నుంచి ప్రవహించే నీరు, ఇక్కడి ప్రకృతి రమణీయత సందర్శకులను ఆకట్టుకుంటోంది. వికారాబాద్ జిల్లా కేంద్రానికి 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు జిల్లాలోనే అతిపెద్ద సాగునీటి వనరు. వికారాబాద్‌కు ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న అనంతపద్మనాభ స్వామిని దర్శించుకొని అనంతగిరి కొండలను తిలకించి అక్కడి నుంచి సందర్శకులు ఈ ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వస్తుంటారు. రోజు రోజుకూ పర్యాటకుల తాకిడి పెరిగి అక్కడి పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలని అక్కడ మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఇదిగో ఇలా.. కోట్‌పల్లి ప్రాజెక్టు 24 అడుగుల లోతు, 1784 ఎకరాల్లో విస్తరించి ఉంది. పర్యటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జంట నగరాలు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు ఇక్కడకి వస్తున్నారు. వారాంతంలో, సెలవు రోజుల్లో ఐదు వందల నుంచి వెయ్యి వరకు, మిగతా రోజుల్లో వంద నుంచి రెండు వందల వరకు సందర్శకులు ఇక్కడకు వస్తుంటారు. ప్రోగ్రెసివ్ ఇన్ తెలంగాణ, జస్టీస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోటింగ్ కొనసాగుతోంది. అందులో 40 మంది లైఫ్‌గార్డులు పనిచేస్తున్నారు. 50 వరకు వివిధ రకాల బోట్లు అందుబాటులో ఉన్నాయి. అటవీశాఖ అధికారులు చెక్‌పోస్టును ఏర్పాటు చేసి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు.

**ఇలా చేస్తే మేలు..**

ప్రాజెక్టు సమీపంలో చిన్న పార్కును ఏర్పాటుచేసి అందులో పిల్లలు ఆడుకోవడం కోసం పరికరాలను, కూర్చోడానికి బల్లలు ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

క్రికెట్, వాలీబాల్ ఆటలు ఆడుకునేందుకు స్థలాన్ని గుర్తించి అభివృద్ధి చేయాలని పర్యాటకులు చెబుతున్నారు.

ప్రాజెక్టు చుట్టూ గ్రామీణ ప్రాంతం కావడంతో పట్టణాల నుంచి వచ్చే వారికి స్థానికంగా మంచి హోటళ్లు లేక ఇబ్బందులకు గురవుతుంటారు. హోటళ్లు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వర్షాకాలంలో కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలు కనువిందు చేస్తుంటాయి. కనుచూపుమేరా నీళ్లు సందర్శకులను ఆకట్టుకుంటాయి. ఎత్తైన ప్రదేశం నుంచి వీక్షించాలంటే అక్కడ వాచ్‌టవర్ ఏర్పాటు చేయాలి. సేదతీరేందుకు చిన్నపాటి షెడ్ ఉండాలి.

నీటిని చూసిన వెంటనే సందర్శకులు ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతుంటారు. ప్రాజెక్టు ఎక్కువ లోతులో ఉండడం, గుంతలు, రాళ్లు కారణంగా ఈతకు వెళ్లలేక నిరుత్సాహానికి గురవుతున్నారు. అక్కడ ఈత కొలను ఏర్పాటు చేస్తే అందరికి మరింత ఉత్సాహంగా గడిపేందుకు అవకాశం ఉంటుంది.

# అనంత గిరులు.. ఆరోగ్య సిరులు



వికారాబాద్ : అందమైన అనంతగిరి కొండలు.. ఆధ్యాత్మికతకు నిలయమైన పద్మనాభ ఆలయం. ఆపై ఔషధ మొక్కలు.. వెరసి ఈ కొండలు వేలాది పర్యాటకులను ఆకట్టుకోవడమే కాదు, ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తున్నాయి.

**క్షయకు మందుల్లేని రోజుల్లోనే..**

క్షయ వ్యాధికి మందులు లేని రోజుల్లోనే వికారాబాద్–అనంతగిరి కొండలపై కొన్ని నెలల పాటు నివసించి ఇక్కడి గాలి పీల్చుకుంటే చాలు క్షయ వ్యాధి తగ్గేదని చరిత్ర చెబుతోంది. ఇందుకు నిదర్శనంగా నాటి నిజాం నవాబు ఏర్పాటుచేసిన ఛాతీ ఆసుపత్రి నిలుస్తోంది.

**ఔషధ వనం ఏర్పాటు**

ఈ కొండలపై మానవాళికి ఉపయోగపడే ఎన్నో రకాల ఔషధ మొక్కలు సహజ సిద్ధంగా పెరుగుతున్నాయి. వీటి సంరక్షణ అటవీ అధికారులు చేపట్టారు. అనంతగిరికి వచ్చే దారిలో 1200 ఎకరాల్లో ఔషధ వనాన్ని నిర్మించారు.. సుమారు 30 రకాల ఔషధ మొక్కలను నాటారు.

**జాగ్రత్తగా రక్షిస్తున్నాం**

అనంతగిరి కొండలపై సహజ సిద్ధంగా ఉన్న ఔషధ మొక్కలకు తోడు అటవీ శాఖ నాటిన ఔషధ మొక్కలను కూడా రక్షిస్తున్నాం. వట్టిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నాటుతున్నాం. స్వదేశీ అభియాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అనంతగిరి కొండలను అభివృద్ధికి ఎంపిక చేసింది. ఈ పనులను రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తోంది.

జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ అధికారి, వికారాబాద్.

**ప్రయోజనాలు గమనించండి**

కానుగలో ఔషధ గుణాలు మెండుగా ఉన్నాయి. కానుగ గింజల నుంచి నూనెను తీస్తారు. కానుగ నూనె చర్మవ్యాధులకు తగ్గడానికి ఉపయోగపడుతుంది. కానుగ మొక్కలను నీడ కోసం రోడ్ల పక్కన పెంచుతున్నారు.

తిప్పతీగ రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ సులభంగా పెరిగి ఎగబాకుతుంది. ఇక్కడ బాగా పెరుగుతోంది. మధుమేహం, రక్తపోటుకు బాగా పనిచేస్తుంది. అల్లనేరెడు దీని ఆకులు, బెరుడు పండు కాలేయం పనితీరును క్రమబద్ధీకరిస్తుంది. మెదడు, గుండె చక్కగా పనిచేయడానికి ఉపకరిస్తుంది. మూత్రంలో మంటను తగ్గించటానికి పనిచేస్తుంది..

స్వదేశీ అభియాన్ కింద.. కేంద్రం ఎంపిక

అనంతగిరి కొండల విస్తీర్ణం.. 3,763 ఎకరాలు

వికారాబాద్ టౌన్‌కు దూరం.. 6. కి.మీ.

ఔషధ మొక్కల పెంపకం.. 1,200 ఎకరాలు

# మైదానాలిలా.. ఆటలెలా?



జగిత్యాల:కోరుట్ల పట్టణంలోని క్రీడా మైదానం ప్రహరీ కూలిపోవడంతో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ఆటలు ఆడుకునేందుకు క్రీడాకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థినులు, యువతులు అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి వస్తోంది. కోరుట్ల స్టేడియంలో ఆటలు ఆడుకోవాలంటే జిల్లా క్రీడల అధికారి అనుమతి తీసుకోవాలని సూచించడంతో పలువురు క్రీడాకారులు అసహనానికి గురవుతున్నారు. ఇండోర్ స్టేడియం పూర్తయినప్పటికీ క్రీడా పరికరాలు లేవు.

ధర్మపురి పట్టణంలోని క్రీడా మైదానం అభివృద్ధికి గతంలో రూ.1.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాకపోవడంతో క్రీడా వసతులకు నోచుకోకుండా పోయింది.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికితీసేందుకు ఏటా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. సాధన చేసేందుకు అవసరమైన వసతుల కల్పనలో యువజన, క్రీడల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మినీ క్రీడా ప్రాంగణాలతో పాటు మల్లాపూర్, ధర్మపురి, రాయికల్, ఇబ్రహీంపట్నంతో పాటు పలు మండలాల్లో మినీ క్రీడా ప్రాంగణాలకు స్థలం కేటాయించినప్పటికీ నిర్మాణాలు చేపట్టలేదు. లక్ష జనాభా దాటిన కోరుట్ల, జగిత్యాల, మెట్‌పల్లి పట్టణ ప్రాంతాల్లో క్రీడా మైదానాల్లో వసతులు అంతంత మాత్రంగానే ఉండటంతో యువత ముందుకు రావడంలేదు. క్రీడా మైదానంలో వసతులు కల్పించకపోవడంతో క్రీడాకారులకు తిప్పలు తప్పడంలేదు. ఆటలు ఆడుకోవడానికి సరైన క్రీడా పరికరాలు లేవు. మూత్రశాలలను అభివృద్ధి చేయాల్సి ఉంది. క్రీడా మైదానంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. క్రీడాకారులకు అవసరమైన మేరకు పరికరాలు అందుబాటులో లేవు. వేసవి దృష్ట్యా వసతులు కల్పించాల్సి ఉంది. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, రాయికల్‌తో పాటు పలు మండలాల్లో మినీ స్టేడియాలకు స్థలాలను కేటాయించి ఎంపీ, జడ్పీ నిధులతో తాత్కాలికంగా ఏర్పాట్లు చేసినప్పటికీ వాటిల్లో క్రీడా వసతులు శూన్యం. ఆయా క్రీడా మైదానాలు ఇప్పటికీ యువజన, క్రీడల విభాగంలో చేరకపోవడం గమనార్హం.

వసతులు కల్పిస్తాం– రవికుమార్, జిల్లా క్రీడల అధికారి, జగిత్యాల

జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో క్రీడా మైదానాల్లో వసతుల కల్పనకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. అవసరమైన క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచుతాం. ఇండోర్ స్టేడియాల్లో సౌకర్యాల కల్పనకు కృషిచేస్తాం. కోరుట్ల మైదానంలో టోర్నమెంట్‌కు మాత్రమే అనుమతులు తీసుకోవాలని సూచించాం. నిత్యం ఆటలు ఆడుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదు.

# వేసవి సెలవులు.. బోధనకు మెరుగులు

వెల్గటూరు: అభ్యసనా సామర్థ్యాల సాధనలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ సగటు కంటే వెనుకబడినట్లు వివిధ సర్వేల్లో వెల్లడయింది. ఫలితంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి.. తద్వారా విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాల పెంపునకు వేసవి సెలవులు వేదిక కానున్నాయి. ఈ మేరకు ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటానికి రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. శిక్షణకు రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేసి ఈ నెల 30 లోగా పూర్తి చేసి ఎస్‌సీఈఆర్టీకి జాబితా పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా విద్యాధికారుల నుంచి రిసోర్స్ పర్సన్ల ఎంపికకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

**సర్వే ఫలితాలతో దిద్దుబాటు**

ఎన్‌సీఈఆర్టీ, విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అసైన్‌మెంట్ సెంటర్ నిర్వహించిన జాతీయ సాధన సర్వే(నాస్)–2021లో జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణ ఫలితాలు తక్కువగా ఉన్నాయి. పీజీఐ,



అసర్ నివేదికలు వివిధ స్థాయిలలో ముఖ్యమైన అభ్యసనా అంతరాలు చూపాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపు ప్రాముఖ్యతను పీజీఐ స్పష్టం చేసింది. అసర్ నివేదికలో ప్రాథమిక స్థాయిలో పఠనం, గణిత నైపుణ్యాలలో పేలవమైన ఫలితాలు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయుల్లో సాధికారత కల్పించటం, వినూత్న వ్యూహాలు, ప్రభావవంతమైన బోధనా పద్ధతులపై దృష్టి పెట్టేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థుల అభ్యసనా ప్రతిభలో అంతరాలు పరిష్కరించటంతో పాటు బోధన నాణ్యత పెంచడానికి ఇది దోహద పడనుంది.

**రిసోర్స్ పర్సన్ల ఎంపిక ఇలా**

రిసోర్స్ పర్సన్లను జిల్లా కలెక్టర్, డీఈవో, డైట్ అధ్యాపకులు తదితర అధికారులతో కలిసి ఇంటర్వ్యూ, డెమోల ఆధారంగా ఎంపిక చేయనున్నారు. ప్రతి మండలం నుంచి ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు ఎస్జీటీల చొప్పున, జిల్లా పరిధిలో స్కూల్ అసిస్టెంట్లను రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేయాలి. ఈ నెలాఖరు వరకు వీరి నియామకం పూర్తి చేసి మే నెలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీరి ద్వారా మొత్తం ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తారు. ఎస్జీటీల నుంచి ప్రతి మండలానికి తెలుగు, పరిసరాల విజ్ఞానం(ఈవీఎస్), ఆంగ్లం, గణితంకు ఇద్దరి చొప్పున 8 మంది.

తెలుగు, ఈవీఎస్, గణితం, ఆంగ్లం, ప్రత్యేక విద్య(స్పెషల్ ఎడ్యుకేషన్)లకు ఇద్దరి చొప్పున 10 మంది డీఆర్పీలు.

ఉర్దూ మాధ్యమంలో ఉర్దూకు ఇద్దరు, గణితం, ఈవీఎస్‌లకు ఒక్కొక్కరి చొప్పున నలుగురు డీఆర్పీలు.

ఉన్నతస్థాయి: స్కూల్ అసిస్టెంట్ల నుంచి తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతిక–రసాయన, జీవ, సాంఘికశాస్త్రాలు, వ్యాయామ, ప్రత్యేక విద్యలకు నలుగురి చొప్పున 36 మంది డీఆర్పీలు.

ఉర్దూ మాధ్యమానికి ఉర్దూ, గణితం, భౌతిక, జీవ, సాంఘికశాస్త్రాల నుంచి ఇద్దరేసి చొప్పున 10 మంది డీఆర్పీలు.


ప్రధానోపాధ్యాయుల శిక్షణ: ప్రాథమిక స్థాయిలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు, ఉన్నత స్థాయిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు నలుగురేసి చొప్పున డీఆర్పీలు.

# జాతీయ రహదారులు.. ప్రమాదాలకు నిలయాలు

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండగా ఇటీవల పోలీసు అధికారులు ప్రమాదాల బ్లాక్ స్పాట్లను గుర్తించారు. జిల్లాలో 46 బ్లాక్ స్పాట్లను గుర్తించిన పోలీసులు ఆర్మూర్–జగదల్‌పూర్, జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈ ఏడాది మూడు నెలల్లో 128 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 47 మంది మృతి చెందారు. 123 మంది క్షతగాత్రులయ్యారు.

**రాత్రిపూట కనిపించేలా సోలార్ బోర్డులు**

జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రమాదాల నివారణ కోసం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి చర్యలు చేపట్టారు. ఇటీవల డీజీపీ కార్యాలయం నుంచి 11 రకాల రోడ్డు భద్రతకు ఉపయోగించే బారికేడ్లు, సోలార్ హెచ్చరిక లైట్లు, మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పట్టుకునేలా



బ్రీత్ ఎనలైజర్ మిషన్లు, పోలీసులకు రక్షణ జాకెట్స్, ట్రాఫిక్ కోన్స్, ఇనుప బారికేడ్లతోపాటు పలు రకాల పరికరాలు జిల్లాకు తెప్పించారు. రాత్రిపూట సోలార్‌తో పని చేసే హెచ్చరిక బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై మల్యాల, కొండగట్టు ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

ఆర్మూర్–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై మెట్‌పల్లి సమీపంలో వట్టివాగు, గండి హన్మాండ్లు, ఆరపేట, కోరుట్ల వద్ద నంది చౌక్, మేడిపల్లి సమీపంలో పీఎన్‌ఆర్ గార్డెన్ సమీపంలో, జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి, చల్‌గల్, ఏఆర్‌గార్డెన్, రిలయన్స్ పెట్రోల్ బంక్, మంచినీళ్ల బావి, తిప్పన్నపేట, పొలాస, కల్లెడ, ధర్మపురి, రాయపట్నం సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై పూడూరు, కొండగట్టు, మల్యాల ఎక్స్‌రోడ్, రాజారం, ధరూర్, రెడ్డి ఫంక్షన్ హాల్ ప్రాంతాలను ప్రమాద బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు.

చురకలు



# చోరీలతో బెంబేలు

కోరుట్ల: చిత్రంలో కనిపిస్తోంది కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నాగేల్లి బుచ్చన్నకు చెందిన వ్యవసాయ బావి. బావికి అమర్చిన 5 హెచ్‌పీ విద్యుత్తు మోటారును దొంగలు ఎత్తుకెళ్లడంతో కేవలం పైపులు మాత్రమే మిగిలాయి. 5 గంటల వరకు పొలం వద్ద ఉండి తర్వాత ఇంటికి వచ్చాడు ఉదయం 12 గంటలకు వెళ్లి చూడగా మోటారు కనిపించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని అయిలాపూర్, కల్లూర్ గ్రామాల్లో రెండు నెలల వ్యవధిలో సుమారు 20 వరకు విద్యుత్తు మోటార్ల తీగలను దుండగులు కత్తిరించి ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. కోరుట్ల పట్టణం, మండలంలో వరుస చోరీలు జరగడంతో రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తరచూ వ్యవసాయ విద్యుత్తు మోటార్లు, తీగలను దుండగులు ఎత్తుకెళ్తున్నారు. విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేసి విలువైన రాగి తీగలను దోచుకెళు న్నారు. ఇళ్లు, దుకాణాల ముందు, ప్రజలు సంచరించే ప్రాంతాల్లో నిలిపిన ద్విచక్ర వాహనాలు సైతం చోరీకి గురవుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా తాళం వేసిన ఇళ్లు దర్శనమిస్తే తాళాలను ధ్వంసం చేసి చొరబడి చోరీలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. నిత్యం పట్టణంలోని కాలనీల్లో పోలీసులు గస్తీ తిరుగుతున్నా, రహదారిపై పెట్రోలింగ్ వాహనాలు సంచరిస్తున్నా చోరీలు ఆగడం లేదు. ఈ విషయమై కోరుట్ల సీఐ సురేశ్‌బాబును వివరణ కోరగా మే, జూన్‌లో




చోరీల ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున హైవే పెట్రోలింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలని ఎస్పీ సూచించినట్లు తెలిపారు. సిబ్బందితో పట్టణంలో, చోరీలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో గస్తీ, రాత్రిపూట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కోరుట్ల పట్టణం బీమునిదుబ్బ ప్రాంతంలోని రవీందర్ అనే వ్యక్తి ఇంట్లో ఈనెల 17న చోరీ జరిగింది. రవీందర్ కుటుంబ సభ్యులు పనిమీద కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి వెళ్లగా మధ్యాహ్నం దుండగుడు ఇంటి ముందు, వెనకాలున్న తాళాలను ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడ్డాడు. బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లేందుకు యత్నించగా కుక్కల అరవడంతో దుండగుడు రూ.30వేల నగదు, గడియారం అపహరించుకొని వెళ్లాడు.

కోరుట్ల మండలం వెంకటాపూర్‌లో ఈనెల 7న తోట మహేష్ అనే వ్యక్తి ఇంటి ముందు ద్విచక్ర వాహనం నిలిపి ఉంచి ఇంట్లోకి వెళ్లారు. ముఖం కడుక్కొని బయటకు వచ్చి చూస్తే ద్విచక్ర వాహనం కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# లెక్కలున్నాయి.. మొక్కలు లేవు!

ఎల్లారెడ్డిపేట:మొక్కలు పూర్తిగా ఎండిపోగా మిగిలిన కర్రలు, గుంతలు మాత్రమే దర్శనమిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోనిది. కామారెడ్డి, కరీంనగర్ ప్రధాన రహదారిని ఆనుకొని గతంలో వందల సంఖ్యలో మొక్కలు నాటారు. చాలా వరకు మొక్కలు చనిపోగా, మరికొన్ని పూర్తిగా ఎండిపోయాయి. అయినప్పటికీ ఉపాధిహామీ పథకంలో మొక్కల సంరక్షణ పేరిట నిత్యం కూలీలతో పనిచేయిస్తున్నారు జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, 12 మండలాలు, 260 గ్రామపంచాయతీలున్నాయి. రెండు మున్సి పల్‌లు మినహా అన్ని మండలాల్లో గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యాన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2020- 2021 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-2025 ఆర్థిక సంవత్సరం వరకు 5,825



ప్రదేశాల్లో 91,31,134 మొక్కలను నాటారు. ఇందులో రోడ్లకు ఇరువైపులా(అవెన్యూ ప్లాంటేషన్) 1520 ప్రాంతాల్లో నాటిన మొక్కల సంఖ్య 8,41,342. ఇవే కాకుండా ప్రతి సంవత్సరం వివిధ శాఖల పరిధిలో నాటిన మొక్కలు అదనం. ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ భూములు, అటవీభూములు, రైతుల వ్యవసాయ క్షేత్రాలను మొక్కలు నాటేందుకు ఎంచుకున్నారు. అందుబాటులో మొక్కలు లభించేలా అన్ని గ్రామాల్లో బాలవనాలను నెలకొల్పారు. గుంత తీసి, ఒక మొక్క నాటితే రూ.60 చొప్పున కూలీలకు చెల్లించారు. అధికారుల లెక్కల్లో లక్షల మొక్కలున్నా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

**సంరక్షిస్తే మేలు...**రోడ్లకు ఇరువైపులా సీమతంగేడు, గుల్మోహార్, సిస్, నిద్రగన్నేరు, రేల వంటి రకాల మొక్కలను నాటారు. మియావాకి పద్ధతి పాటించారు. కాగా రోడ్ల వెంట నాటిన మొక్కల సంరక్షణను అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడక్కడా వృక్షాలుగా ఎదిగినా గ్రామీణ ప్రాంతాల్లో మొక్కల జాడ కనిపించడం లేదు. రహదారుల వెంట నాటిన మొక్కలను కాపాడేం దుకు 400 మొక్కలకు ఒకరు చొప్పున నెలలో 20 పనిదినాలను కల్పిస్తున్నారు. మొక్కల చుట్టూ నీరు నిలిచేలా గుంతలు తీయడం, గడ్డిని తొలగించడం, నీటిని అందించడం, చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటడం కూలీల పని. ఈ పనులు ఎక్కడా సక్రమంగా సాగడం లేదు.

గ్రామపంచాయతీలదే నిర్వహణ బాధ్యత

శేషాద్రి, డీఆర్డీఓ, రాజన్న సిరిసిల్ల జిల్లా

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి, ప్లాంటేషన్ పనులు నిర్వహించాం. మొక్కలు నాటిన రెండేళ్ల తర్వాత మొక్కల సంరక్షణ బాధ్యత అంతా ఆయా గ్రామ పంచాయతీలదే. వివిధ ప్రాంతాలు, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను పక్కాగా సంరక్షించాలి. క్రమం తప్పకుండా నీటిని అందించాలి. మొక్కల సంరక్షణ పనులు నిర్వహించే కూలీలకు ఈజీఎస్‌లోనే వేతనాలు చెల్లిస్తాం.

# బోర్లకు కేసింగ్.. ఇష్టారీతిన ఛార్జీలు



తాండూరు: మెట్ట వ్యవసాయం నుంచి రైతులు ఆరుతడి పంటలను సాగు చేసేందుకు దృష్టి సారిస్తున్నారు. ఇందుకు అవసరమైన సాగునీటిని భూగర్భం నుంచి పైకి తీసుకు వచ్చేందుకు పొలాల్లో బోర్లను వేసుకుంటున్నారు. వేసవిలో పైకి వచ్చే నీరు ఏళ్ల తరబడి అలాగే ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులు అప్పులు చేసి మరీ బోర్లను వేసుకుంటున్నారు. అయితే వీరి అవసరాలను ఆసరాగా చేసుకున్న ప్రైవేటు రిగ్గుల యజమానులు సిండికేట్‌గా మారి పోయారు. అడ్డగోలుగా ఛార్జీలు విధించి ఇష్టం వచ్చినట్లు దోచుకుంటున్నారు.

**అవగాహన లేమి ఆసరాగా తీసుకుని..**

ఒక్కో మీటరు లోతుకు వేసే కేసింగుకు ఎంత మేర చెల్లించాలనే విషయంలో రైతులకు అవగాహన లేదు. దీంతో రిగ్గుల యజమానులను అడిగే వారు లేక ధరల విషయంలో తాము చెప్పిందే తుది నిర్ణయమనే విధంగా వ్యవహరిస్తున్నారు.

**అడుగు లోతు లెక్కన వసూలు**

పొలాల్లో బోర్లు వేసుకునే రైతుల వద్ద మీటరు లోతు లెక్కన మాత్రమే కేసింగుకు వసూలు చేయాలి. ఇందుకు ప్రభుత్వం నిర్ణీత ఛార్జీలను ఖరారు చేసింది. రిగ్గుల యజమానులు మాత్రం దీన్ని పక్కకు పెట్టారు.

**అనుమతి పొందినవి ఏడు సంస్థలే**

జిల్లాలో బోర్లు వేయడానికి అనుమతులు పొందిన రిగ్గుల సంస్థలు కేవలం ఏడు మాత్రమే ఉన్నాయి. ఇవి కాకుండా మరో పదికి పైగా రిగ్గులు అక్రమంగా బోర్లను వేస్తున్నాయి.

**జిల్లాలో వ్యవసాయ పరమైన బోర్లు .. లక్షకు పైగా..**

వీటి కింద పంటల సాగు.. 3లక్షల ఎకరాలు.

మొత్తం సాగు భూములు.. 6లక్షల ఎకరాలు.

ప్రైవేటు రిగ్గుల యజమానులు వసూలు చేస్తున్న ఛార్జీలు

అడుగు కేసింగ్‌కు రూ.400 నుంచి రూ.500 (మీటరు వద్ద రూ.1200నుంచి రూ.1500)

100 అడుగుల లోతు వరకు తవ్వే ప్రతి అడుగుకు రూ.100 నుంచి రూ.150.

100 అడుగుల దాటిన తర్వాత ప్రతి అడుగుకు రూ.150 నుంచి రూ200.

ప్రెస్సింగ్‌కు వసూలు చేస్తున్న ధర రూ.15,000 నుంచి రూ.25,000.

ఇవీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మీటరు కేసింగ్‌కు: రూ.70590 మీటర్ల వరకు ఒక్కో మీటరు లోతు తవ్వకానికి: రూ.50090 మీటర్లు దాటిన తర్వాత ఒక్కో మీటరుకు : రూ.550

# ఒరుగు.. ఉపాధి కనుమరుగు



పరిగి, కుల్కచర్ల, దోమ : పరిగి, కుల్కచర్ల, దోమ, పూడూరు మండలాల నుంచి ప్రతి ఏడాది మామిడి సీజన్‌లో 50 టన్నులకు పైగా ఒరుగు ఉత్పత్తి జరిగేది. ప్రకృతి పరిస్థితుల కారణంగా ఈసారి 30టన్నులకు పడిపోయే అవకాశం ఉందని అంచనా.. డిసెంబరులో వీచే చలిగాలులకు చెట్లు పూతపట్టేది. కానీ ఈసారి పూత అంతంతే.. కాత బాగా తగ్గడంతో ఉపాధిపై ప్రభావం పడింది. వేసవి సీజన్ రాగానే మామిడి ఉత్పత్తులతో పల్లెలకు కొత్త కళ వచ్చేది. ఎటు చూసినా ఒరుగు తయారీతో మహిళలకు, మరోవైపు కూలీలకు చేతినిండా ఉపాధి లభించేది. ఒరుగు తయారీతో ఇతర జిల్లాలకు రవాణా చేసేందుకు వాహనదారులు పోటీపడేది. అలాంటిది చాలా వరకు దిగుబడులు దిగాలు పరచడంతో ఉపాధిపై ప్రభావం పడుతోంది. సీజన్ సమయంలో మామిడిపై ఆధారపడి బతికే కుటుంబాలు నాలుగు వేలకు పైమాటే. ఉన్న కాయలు కూడా ఇటీవల వీచిన భారీ గాలులు, వర్షం కారణంగా పూడూరు, రాకంచర్ల, బొంరాస్‌పేట, కిష్టాపూర్, మొత్కూరు, కామినిపల్లి, చౌడాపూర్, ఏర్పుమళ్ల, పాలేపల్లి, మొత్కూరు, దిర్సంపల్లి తదితర ప్రాంతాల్లో కాయలు నేలరాలాయి. రాలిన కాయల ఒరుగు నల్లగా ఉండి నాణ్యత దెబ్బతింటుంది. విపణిలో ధరరాక ఆర్థికంగా మరింత నష్టం తప్పడంలేదు.

**విపణిలో ఇలా..**

తోటపై ఉన్న తాజా కాయలను మార్కెట్‌కు తరలిస్తే ఒక బ్యాగు(22కిలోలు)కు కాయసైజును బట్టి రూ.500 రూ.600 గిట్టుబాటు అవుతుంది.

అదేరాలిన కాయలకు రూ.150, నుంచి రూ.200 పలుకుతుంది.

పుల్లటి కాయలు ఒరుగుకు అనుకూలం. నాణ్యమైన ఒరుగు క్వింటాకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు ధర పలికిన సందర్భాలున్నాయి.

జిల్లాలో మామిడి తోటలు 13,250 ఎకరాలు

గతేడాది ఉత్పత్తి ఎకరాకు 40 - 45 మెట్రిక్ టన్నులు

ఈ ఏడాది తగ్గనున్న ఉత్పత్తి సుమారు: 10వేల మె.ట

ప్రతి సీజన్‌లో ఆధారపడే కుటుంబాలు: 4వేలు

# రాజన్న క్షేత్రం.. భక్త నీరాజనం



వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టనుండటంతో భక్తుల తాకిడి మరింతగా పెరిగింది. సోమ, శుక్ర, ఆదివారాల్లో అధికంగా భక్తులు దర్శనానికి వచ్చేవారు. జూన్ 15 నుంచి రాజన్న గుడిలో స్వామివారికి రోజువారీ పూజలు మాత్రమే ఉంటాయి. భీమేశ్వరాలయంలో దర్శనాలు కొనసాగించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అభిషేకం, అన్నపూజ, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, కుంకుమ పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల్లో ప్రధానంగా కోడె మొక్కులు, చిన్నారుల పుట్టు వెంట్రుకల మొక్కు చెల్లించుకునే భక్తుల సంఖ్య అధికంగా ఉంటోంది. కొత్తగా పెళ్లి చేసుకున్న జంటలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని కోడె మొక్కు తీర్చుకుంటున్నారు. దీంతో ఆలయంలో ప్రతీనిత్యం భక్తుల రద్దీ నెలకొంటోంది. విద్యాసంస్థలకు సెలవులు రావడంతో భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉంది.

**రూ.76 కోట్లతో...**ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను మొదటి దశలో రూ.76 కోట్లతో చేపట్టడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు సంబంధించిన అభివృద్ధి పనులకు గత ఏడాది నవంబరు 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు వివిధ శాఖల మంత్రులు హాజరై శంకుస్థాపన చేశారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. పనులు మొదలు పెట్టేందుకు శృంగేరి పీఠాధిపతులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ అధికారులు, వేద పండితులు, ఇంజినీరింగ్ అధికారులు పలుమార్లు సంప్రదించి అనుమతులు పొందారు. మరోసారి పీఠాధిపతులను కలిసి వారి సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకొని పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

**మొదటి విడతలో చేపట్టే పనులివే...**

రాజన్న ఆలయలో గర్భాలయాన్ని, మహామండపాన్ని అలానే ఉంచి ఆగమ, వాస్తు శాస్త్ర ప్రకారం మిగతా విస్తరణ పనులు చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారు. నూతన నిర్మాణాలను మూడు విడతల్లో చేపట్టనున్నారు. విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా మొదటి విడతలో రాజ గోపురాలు, ప్రాకారాలు, నిత్యనివేదన మండపం, కోటి లింగాల మండపం, నిత్య కల్యాణాలు, అద్దాల మండపం, ధర్మగుండం, అనివేటి మండపం, నాగిరెడ్డి మండపం, నీటిసఫరా, విద్యుత్తు పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో పాటు భీమేశ్వరాలయం వద్ద భక్తుల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు వేగవంతంగా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. షార్టు టెండర్ల ద్వారా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూపకల్పన చేస్తోందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

# పడకేసిన పల్లె పాలన

జగిత్యాల : పల్లెలపై అధికారుల పట్టింపు లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పారిశుధ్యం గాడితప్పుతోంది. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో జాప్యంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉండగా 9 లక్షలకుపైగా జనాభా జీవిస్తున్నారు. పల్లెల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కాక పంచాయతీలలో నిధులు లేకపోవటంతో ప్రత్యేకాధికారులు పల్లెల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. పంచాయతీ కార్యదర్శులు ఉన్న నిధులతో చిన్న చిన్న పనులు చేస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులే ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు ఏడాదికిపైగా ప్రభుత్వం నుంచి నిధులు రాక జిల్లాలోని పల్లెల్లో అభివృద్ధి కానరావటంలేదు. పెద్ద గ్రామ పంచాయతీలకు నిధులు మెండుగా ఉండగా చిన్న గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పల్లెలకు ప్రత్యేకాధికారులు వెళ్లకపోవటంతో పారిశుధ్యం లోపించింది. పారిశుధ్య కార్మికులు, ఈ పంచాయతీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి



వేతనాలు కూడా రావటంలేదు. వేతనాలు రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఏప్రిల్ నెలలోనైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచులైన తమ సమస్యలు పట్టించుకుంటారని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

**విధుల్లో చేరని జిల్లా పంచాయతీ అధికారి**

పల్లె పాలనను పట్టించుకోవటంలేదనటానికి మరో నిదర్శనం జిల్లా పంచాయతీ అధికారి లేకపోవటం. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ బదిలీ అయిన తర్వాత డీఆర్‌డీవో ఏపీడీ మదన్‌మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన రెండు విధులు నిర్వహించటం ఇబ్బందిగా మారింది. నిజామాబాద్ డీఎల్‌పీవోగా పని చేస్తున్న ఎం.శ్రీనివాస్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఆయన విధుల్లో చేరలేదు. రెండోసారి సైతం విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చేరకపోవటంతో పూర్తి బాధ్యతలు లేక పాలన పూర్తిగా కుంటుపడింది.

# చిల్లర సమస్యలు ఉండవిక..!

వలిగొండ : ఆర్టీసీ ప్రయాణికులకు బస్సులో చిల్లర సమస్య అధికంగా ఉంది. టికెట్‌కు సరిపడ డబ్బులు ఇవ్వాలని కండక్టర్లు అడుగుతున్నా చిల్లర లేక నోట్లు ఇస్తుంటారు. దీంతో అటు ప్రయాణికులు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారి మధ్య వాగ్వాదాలకు దారి తీస్తోంది. ఈ సమస్యలకు చెక్ పెట్టెందుకు ఆర్టీసీ డిజిటల్ చెల్లింపులను అమల్లోకి తీసుకురానుంది. బస్సులో ఎలక్ట్రానిక్ టికెట్ ఇష్యూ (ఈ-టిమ్)ను ప్రవేశపెడుతోంది. ఫోన్-పే, గూగుల్ పే, స్వైపింగ్ ద్వారా టికెట్ తీసుకునే సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం అన్ని రంగాల్లో డిజిటల్ చెల్లింపులు నిత్యకృత్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కూడా ఈ విధానంపై కొన్ని నెలలుగా కసరత్తులు మొదలు పెట్టింది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయోగాత్మకంగా డిజిటల్ చెల్లింపులు అమల్లోకి తీసుకురాగా ఇది విజయవంతమైంది. అన్నీ చోట్ల ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. బస్సులతో పాటు టికెట్ రిజర్వేషన్ కేంద్రాలు, టికెట్ బుకింగ్ ఏజెన్సీల వద్ద ప్రవేశపెట్టనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరిగుట్ట డిపోకు 70 ఈ-టీమ్ మిషన్లు రావడంతో కండక్టర్లకు త్వరలో శిక్షణ తీసుకోనున్నారు.

త్వరలో అందుబాటులోకి సేవలు:మురళీకృష్ణ, డిపో మేనేజర్, యాదగిరిగుట్టయాదగిరిగుట్ట డిపోకు ఈ-టిమ్స్ మిషన్లు 70 వచ్చాయి, మరికొన్ని రావాల్సి ఉంది. యంత్రాల పని తీరు పరిశీలించి కండక్టర్లకు శిక్షణ ఇవ్వనున్నాం. త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

# చెరువుల వద్ద.. చేపల కొలనులు

చేగుంట : ప్రతి గ్రామంలో కొలనులు ఏర్పాటు చేసి చేపల పెంపకానికి చేయూత నివ్వాలని కేంద్రం ప్రభుత్వం సంకల్పించింది. ఉపాధి పథకంలో ప్రతి గ్రామంలో చెరువు శిఖంలో వీటి నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించగా, కొన్ని చోట్ల పనులు మొదలయ్యాయి. దీనివల్ల కూలీలకు పనులు, శిఖం భూముల పరిరక్షణ, మత్స్యకారులకు మరింత ఆదాయం సమకూరాలన్నదే లక్ష్యం. జిల్లాకు ప్రస్తుతం 85 చేపల కొలనులు మంజూరుకాగా, 59 చోట్ల పనులు ప్రారంభమయ్యాయి, చేగుంట, నార్సింగి, హవేలిఘనపూర్, కొల్చారం, పాపన్నపేట, చిన్నశంకరంపేట, శివ్వంపేట, టేక్మాల్, మెదక్, నర్సాపూర్ మండలాల్లో కొనసాగుతున్నాయి. నార్సింగి మండలంలో నార్సింగి, సంకాపూర్, భీంరావుపల్లి, నర్సంపల్లిలో నిర్మాణాలను ముమ్మరం చేశారు. ఒక్కో కొలనుకు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు.

అత్యధిక పనిదినాలు కల్పించేలా..: ఆర్థిక సంవత్సరం 2025-26లో ఉపాధి పథకంలో కొత్తగా మరిన్ని పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ పనులను పరిశీలించి చేపల కొలనులు ఏర్పాటు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో గ్రామంలో 3,300 పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో కొలను 14 మీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో నిర్మిస్తున్నారు. ఎంపిక చేసిన చెరువు శిఖంలో నాలుగు కొలనులు నిర్మిస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాటిలో నీరు నిల్వ ఉండటంవల్ల చేపలు పెంచుకునేందుకు దోహదపడుతుంది.శిఖం భూముల పరిరక్షణకు: ప్రస్తుతం మత్స్యశాఖ రాయితీతో చేప పిల్లలను నీటి వనరుల్లో పెంచుతున్నారు. వీటికి వంద నుంచి మూడు వందల మీటర్ల దూరంలో కొలనులు నిర్మిస్తున్నారు. కూలీలకు ఉపాధి, చెరువుల శిఖం భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా పనుల రూపకల్పన చేశారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక, రాయితీ చేపపిల్లలను కూడా వీటిలో వదిలేలా ఏర్పాటు చేస్తున్నారు. **ఎన్ని ప్రతిపాదనలు వచ్చినా అనుమతి : శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో** గ్రామాల నుంచి చేపల కొలనుల నిర్మాణాలకు ప్రతిపాదనలు వస్తే మంజూరు చేయటానికి సిద్ధంగా ఉన్నాం. జిల్లా వ్యాప్తంగా మొదటగా కొన్నింటికి ప్రతిపాదనలు రావడంతో పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం వరకు పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపట్టి మత్స్యసంపదను పెంపొందించాలన్నది లక్ష్యం. శిఖం భూములను రక్షించేందుకు కూడా ఇది దోహదపడుతుంది. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రతిపాదనలు పంపించాలి.

# నీరు నిలుపు.. సాగుకు మలుపు

తాండూరు : తాండూరు శివారులోని కాగ్నా నదికి వరదలొచ్చినప్పుడు ఆనకట్టలు లేక నీరంతా దిగువకు వృథాగా వెళ్లిపోయేది. కళ్లముందే పొలాలకు పారాల్సిన నీరు ఇలా నేలపాలవుతుంటే రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యేవారు. అడ్డుకట్టలు కడితే కొంతమేరకైనా వృథాను అరికట్టవచ్చని నీరు నిలిచి పొలాలకు పారించి పంటలు పండించుకోవచ్చని రైతులు అధికారులకు పదేపదే విన్నవించేవారు. ఎట్టకేలకు వారి కృషి ఫలించింది. తాజాగా వరద నీరు వృథాగా పోకుండా అధికారులు ఆనకట్టలు నిర్మిస్తున్నారు.

రూ.10 కోట్లవ్యయం: ఇప్పటికే నదిలో దిగువ, ఎగువ రెండు ఆనకట్టల్ని నిర్మించారు. రూ.10 కోట్ల వ్యయంతో కొత్తగా కట్టలు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో కురిసే వానకు నదిలోకి భారీగా వచ్చే వరద నీరు వృథాగా అటుఇటూ వెళ్లకుండా మరో కట్టను నిర్మిస్తున్నారు. తాండూరు- కొడంగల్ మార్గంలోని వంతెనకు ఎగువన కొత్తగా నిర్మించిన ఆనకట్ట వద్ద వరద నీరు నిల్వటానికి అధికారులు రెండు వైపులా మరో కట్టను ఏర్పాటు చేస్తున్నారు. వరద నీరు వచ్చినప్పుడు ఇది వరకు నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్తూ పంట పొలాలను దెబ్బతీసేది. నదికి రెండు వైపులా కట్టలు ఏర్పాటు చేస్తుండటంతో



వరద నీరు ఆనకట్ట వద్దే నిల్వ ఉంటుంది.

**కొడంగల్‌కు మెరుగైన తాగునీటి సరఫరా..**

ఇక్కడి ఆనకట్ట నుంచే కొడంగల్ నియోజకవర్గానికి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగానే నీటి సరఫరా మరింత మెరుగు కోసం ఆనకట్టకు రెండు వైపులా రెండు కిలో మీటర్ల పొడవునా కొత్తగా మట్టి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే వర్షా కాలం నాటికి పూర్తి చేసే విధంగా వేగంగా చేస్తున్నారు. నదిలోని మట్టినే తీసి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నది మధ్యలో ఆనకట్ట, రెండు వైపులా మట్టి కట్టలతో వరద నీరు భారీగా నిల్వ ఉండటానికి అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు వివరిస్తున్నారు.

# పశుపోషకులకు బాసట

చొప్పదండి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వగా.. ఈసారి వాటికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేయాలని భావించింది. వేసవిలో జల సంరక్షణకు ఇంకుడుగుంతలు, చేపల కొలనులతోపాటు పాడి రైతుల కోసం ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

**నాలుగు పశువులు ఉంటేనే..**

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి కనీసం నాలుగు పశువులను కలిగి ఉంటేనే షెడ్ల నిర్మాణానికి అనుమతినిస్తారు. పశువుల షెడ్లతోపాటు దాని పక్కనే తాగునీటి ట్యాంకు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక గదిని సైతం నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు చిన్న, సన్నకారు రైతులు తమ పశువులను పొలాల వద్ద చెట్ల కింద కట్టేసేవారు. దీంతో వాటి ఆరోగ్యంపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపడంతో వ్యాధుల బారినపడేవి. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి



అనుమతినివ్వడంతో వారి కష్టాలు తీరనున్నాయి.

**రూ.లక్ష వరకు కేటాయింపు**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 926 షెడ్ల నిర్మాణానికి అనుమతి రాగా.. ఇప్పటివరకు 336 నిర్మించారు. మిగతావి ప్రగతిలో ఉన్నాయి. ఈనెలాఖరు వరకు వీటన్నింటిని పూర్తి చేసేలా ఉపాధిహామీ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు కేటాయిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి : శ్రీధర్, డీఆర్డీవో కరీంనగర్**

పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31 లోగా వీలైనన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇవి పాడి రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

# సన్నబియంతో సంతృప్తికరంగా భోజనం..!

కొత్తగూడెం: పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉగాది (ఈనెల 30) నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పౌరసరఫరాలశాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న లబ్ధిదారుకు ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇకపై వీటి స్థానంలో సన్నబియ్యం అందించనున్నారు. రైతుల నుంచి కొన్న సన్నధాన్యాన్ని మరపట్టించి తిరిగి నిరుపేదలకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.అక్రమాలకు అడ్డుకట్ట.. ఇన్నాళ్లు 'రేషన్' లబ్ధిదారులకు ప్రతినెలా దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. అయితే అందులో ఎక్కువ శాతం మంది వాటిని తినలేక దళారులకు విక్రయించటంతో పథకం లక్ష్యం నీరుగారేది. లబ్ధిదారులు మార్కెట్‌లో సన్న బియ్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో వాటి ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈనేపథ్యంలో రేషన్‌కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం అందించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. **ఏడు లక్షల కార్డులు.. 11వేల మె.ట. బియ్యం**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 7,05,950 రేషన్‌కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ప్రతినెలా సుమారు 11వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని అంచనా వేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు, పాతకార్డుల్లో పేర్లు చేర్చేందుకు చర్యలు చేపట్టింది. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఏప్రిల్‌లో కొత్తకార్డులు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఇదే జరిగితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల బియ్యం కోటా పెంచాల్సి ఉంటుంది. సుమారు 60 నుంచి 70వేల వరకు కార్డులు, 3లక్షల వరకు యూనిట్లు పెరిగే అవకాశం ఉన్నందున కనీసం 2వేల మెట్రిక్ టన్నుల బియ్యం అదనంగా కావాలి.

# వేలుపట్టి నడిపించినా.. వెలి



హైదరాబాద్: "హలో.. హైదరాబాద్‌లో రోడ్డుపక్కన ఉన్న మృతదేహం వద్ద దొరికిన సంచిలో మీ ఫోన్ నంబరుంది.. మీ నాన్న అనుకుంటా! మృతదేహాన్ని తీసుకెళ్తారా.." మాట పూర్తయ్యేలోపు ఫోన్ కట్. మళ్లీ చేస్తే స్విచ్ఛాఫ్.

"అమ్మా.. గాంధీ ఆసుపత్రి బయట మీ వాళ్లెవరో చనిపోయారు.." అని చెప్పగానే.. "మేం రాలేం.. అంత్యక్రియలు కానిచ్చేయండి.. ఫోన్ పే నంబరు చెబితే డబ్బు పంపుతాం. చితాభస్మం దాయాల్సిన పనిలేదు. వీలైతే ఆ మూసీలోనే కలిపేయండి." అంటూ సమాధానం.

ఆ తల్లికి నలుగురు సంతానం. ఏడుపదుల వయసులో అమ్మను భారంగా భావించారు. బంధువుల ఇంట్లో శుభకార్యమని కాకినాడ నుంచి హైదరాబాద్ తీసుకొచ్చారు. సనత్‌నగర్‌లో వదిలేసి మాయమయ్యారు. స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం పొందుతూ మానసిక వేదనతో కన్నుమూసింది. బిడ్డలకు సమాచారమిస్తే అంత్యక్రియలు మీరే చేసేయండి అంటూ చేతులు దులుపుకొన్నారు.

గ్రేటర్ పరిధిలో ఏటా 500లకు పైగా అనాథ మృతదేహాలను గుర్తిస్తున్నారు. అందులో అధికశాతం వృద్ధులే. పెంచి పెద్ద చేసిన పిల్లలే వారిని భారంగా భావిస్తున్నారు. ఆస్తిపాస్తులు రాయించుకొని నగరంలో వదిలేసి వెళ్లిపోతున్నారు. చనిపోయాక మృతదేహాల వద్ద దొరికిన ఫోన్ నంబర్లను సంప్రదించినా స్పందించకుండా కఠినంగా వ్యవహరిస్తుండటం దయనీయం.

**భారమని.. దూరంగా వదిలేసి**

బంజారాహిల్స్‌లోని దేవాలయం వద్ద కూర్చునే ఒక పెద్దాయన వయసు 68ఏళ్లు. భార్య మరణించాక ఇల్లు తన పేరిట రాయించుకున్న కొడుకు గెంటేయడంతో నగరంలో కూతురి ఇంటికి చేరాడు. అల్లుడి సూటిపోటి మాటలను భరించలేక.. భిక్షాటన చేస్తున్నాడు. రైతుగా గౌరవంగా బతికి ఇప్పుడిలా అభిమానం చంపుకొంటూ చేయిచాస్తున్నానంటూ కన్నీరు పెట్టుకున్నారు. వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యలు, కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందులతో కన్నవారిని భారంగా భావించే బిడ్డలు వారిని వైద్యపరీక్షలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు చూద్దామని చెప్పి నగరం తీసుకొస్తున్నారు. కొందరు మధ్యలోనే బస్సులు, రైళ్లలో వదిలేసి వెళ్లిపోతున్నారు. మరికొందరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించి తప్పుడు వివరాలిస్తున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రులు, బస్సు, రైల్వేస్టేషన్లు, శివారుల్లో రోజూ 10 మంది వృద్ధులను వదిలేసి వెళ్తున్నట్టు పోలీసుల అంచనా.

**ఆ నలుగురు.. మోసేదెవ్వరు**

నగరంలో అనాథలుగా మరణించాక తలకొరివి పెట్టాల్సిన కుమారులను సంప్రదిస్తే వేం అందుబాటులో లేమంటూ సమాధానమిస్తున్నారు. రూ.20 కోట్ల ఆస్తులున్న పెద్దాయన.. కొద్దిరోజుల క్రితం రోడ్డుపక్కన మరణించాడు. మృతుడి జేబులోని ఫోన్ నంబర్‌కు సమాచారం అందిస్తే అంత్యక్రియలు ఖర్చులు పంపుతామంటూ ఫోన్ పెట్టేశాడంటూ ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎంతో గొప్పగా జీవించి.. బంధువులు.. ఆత్మీయుల మధ్య సాగాల్సిన చివరిమజిలీ.. పాడె మోసేందుకు ఆ నలుగురు కూడా లేకుండా ఒంటరిగా బతుకు ముగిస్తున్నారు.

# బెదిరిస్తూ.. బెంబేలెత్తిస్తూ..



తాండూరు : ఖనిజాల ఖిల్లాగా పేరున్న తాండూరులో నాపరాళ్ల అక్రమ రవాణాను అడ్డుకోవాలంటే గనుల శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో తమ అధికారాలను వినియోగించి వాహనాలను అడ్డుకోవాలని చూస్తే బెదిరిస్తున్నారు. దాడులకూ తెగిస్తున్నారు. పోలీసులు వెంట ఉంటేనే విధులను నిర్వహించే పరిస్థితి నెలకొంటోంది. లేదంటే అక్రమ రవాణా యథాతథంగా సాగిపోతోంది.

**కర్ణాటక నుంచే ఎక్కువ**

తాండూరు మండలానికి చేరువలో కర్ణాటక రాష్ట్రం మిర్యాణం గ్రామం ఉంది. ఇక్కడ వేల ఎకరాల్లో నాణ్యమైన ముడి నాపరాళ్లు నిక్షిప్తమై ఉన్నాయి. ఇదే నాపరాయిని మిర్యాణ్‌లో ఉన్న చెక్‌పోస్టును తప్పించి తాండూరులోని యూనిట్లకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇలా వచ్చిన ముడి నాపరాయిని నునుపుగా మార్చి ఆర్డర్ల మేరకు విక్రయించి లాభ పడుతున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి తాండూరుకు చెందిన మరి కొందరితో చేతులు కలిపి వ్యవహారం నడిపిస్తున్నారు. ఇక తాండూరు మండలంలో లీజు పొందిన నాపరాళ్ల గనులు 60 ఉంటే అనుమతులు లేని గనులు పదుల సంఖ్యలో కొనసాగుతున్నాయి. గనుల శాఖ తరచూ తనిఖీలు నిర్వహించి యజమానులను హెచ్చరిస్తున్నా షరామామూలే.

**తెగించిన లారీ డ్రైవర్**

తాజాగా ఈనెల 24న రాత్రి తాండూరు మండలం గౌతాపూరు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సూర్యకాంత్ రెడ్డి 11.30 గంటల సమయంలో మిర్యాణం నుంచి తాండూరు వైపు వస్తున్న నాపరాళ్ల లోడ్ లారీని ఆపి డ్రైవర్‌ను రాయల్టీ పత్రాలను అడిగారు. డ్రైవర్ అతడిని కిందకు తోసేసి వెళ్లడంతో గాయాలకు గురయ్యాడు. విధులకు ఆటంకం కల్గించి గాయపరిచాడని పేర్కొంటూ కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌లో ఏడీ సత్యనారాయణ సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే రోజు ఎఫ్ఐఆర్ చేశారు. జరిగిన ఘటనపై ఏడీ రాష్ట్ర ఉన్నతాధికారులకు విషయాన్ని చేర వేశారు. మంగళవారం హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ గోవింద్‌రాజు తాండూరుకు చేరుకుని ఏడీ సత్యనారాయణతో కలిసి సూర్యకాంత్‌రెడ్డిని స్థానిక ఆసుపత్రిలో పరామర్శించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తాండూరు, గౌతాపూర్, బషీరాబాద్ మోమిన్‌పేట తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో గనులు విస్తరించి ఉన్నాయి.

ఒక్క తాండూరులోనే 100కుపైగా ఎకరాల్లో నాపరాయి గనులున్నాయి. వీటిలో పగలూ, రాత్రి పనులు సాగుతుంటాయి. అక్రమ రవాణా కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ రూ.కోట్లలో రాకుండా పోతోంది.

తవ్వకాలకు అనుమతులు పొందిన గనులు.. 228
అనుమతులు లేనివి.. 130
ఒక్కో గనిలో పనిచేసే కార్మికులు.. 10-20
సుద్ద, లేటరైట్, స్టోన్ మెటల్, నాపరాయి గనులు: 600 ఎకరాలు
నిత్యం అక్రమ రవాణా.. 50 లారీలు
డిమాండ్ ఉన్నవి.. సుద్ద, నాపరాయి, ఎర్రరాయి, స్టోన్‌మెటల్.

# వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి



సారంగాపూర్: బీర్‌పూర్, ధర్మపురి మండలాల చివరి ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో చేపట్టిన బీర్‌పూర్ రోళ్లవాగు ఆధునికీకరణ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. ప్రాజెక్టు పనులు 2017లో ప్రారంభించగా ఇప్పటి వరకు అటవీ అనుమతులు లేకపోవడంతో పూర్తికాలేదు. ఇటీవల రెవెన్యూ శాఖ భూములు అప్పగించగా అటవీ అనుమతులకు జిల్లా అటవీశాఖ అధికారులు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆధునికీకరణతో పర్యావరణం, వన్యప్రాణులు, అటవీ ప్రాంత నష్టం అంచనా తయారీకి ప్రత్యేకంగా అధ్యయనం చేసి నివేదించనున్నారు. ఇటీవల ప్రాజెక్టు ముంపు ప్రాంతాన్ని రాష్ట్ర అటవీ వనరులు, వన్యప్రాణుల సంరక్షణ అధికారి పరిశీలించగా అటవీ అనుమతుల కోసం రాష్ట్ర ఉన్నతాధికారులు రానున్నారు.

అటవీ, సహజ వనరుల నిర్వహణ అధ్యయనాల పరిశోధన విశ్వవిద్యాలయం(సీఈఎఫ్ఎన్ఏఆర్ఎం) అధికారులు, ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని అధ్యయనం చేసి నష్టం అంచనా వేయనున్నారు. ఇందులో మొక్కలు, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణానికి చేపట్టాల్సిన దానిపై అధ్యయనం చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా రూ.40 లక్షలతో సర్వే నిర్వహించి ఆధునికీకరణ చేపడుతుండంతో ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని గుర్తించనున్నారు. మూడు రకాలుగా వన్యప్రాణుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, అడవుల సంరక్షణగా విభజించి అటవీ సంపద పెంచేందుకు అవసరమైన నిధులు, చేపట్టాల్సిన చర్యలపై నివేదిక తయారు చేసి పంపించనున్నారు.

**3.67 లక్షల మొక్కల పెంపకం**

ప్రాజెక్టు ఆధునికీకరణలో ముంపునకు గురవుతున్న అటవీభూములకు బదులుగా 335 హెక్టార్ల రెవెన్యూ భూములను పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల్లో అప్పగించడంతో ఆయా భూములను అటవీశాఖ స్వాధీనం చేసుకుంది. దీని ద్వారా ఆయా భూములతోపాటు పర్యావరణ, వనరుల సంరక్షణ కింద అటవీ శాఖ 3.67 లక్షల మొక్కల పెంపకం చేపట్టనుంది. ఇందులో ముందుగా అటవీ శాఖకు అప్పగించిన రెవెన్యూ భూములలో 80 వేల మొక్కలు నాటనుండగా, మిగతా మొక్కలు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో నాటేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. అంతేకాకుండా అరుదుగా ఉండే తౌసీ, నల్లమద్దీ, టేకు భారీ వృక్షాలు ప్రాజెక్టు ముంపు ప్రాంతం నుంచి వేర్లతో సహా తరలించి సారంగాపూర్ మండలంలోని గణేష్‌పల్లె, బీర్‌పూర్ ఘాట్, జగిత్యాల అర్బన్ పార్కు ప్రాంతాల్లో నాటనున్నారు. అటవీ అనుమతులకు నివేదించాం- రవిప్రసాద్, డీఎఫ్‌వో, జగిత్యాల

ప్రాజెక్టు ఆధునికీకరణలో ముంపునకు గురవుతున్న అటవీ భూముల వివరాలు అటవీశాఖకు నివేదించాం. ముంపునకు గురువుతున్న భూములకు బదులుగా అందించిన వాటిలో అటవీ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. ఉన్నతాధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

# వడ్డీ రాయితీ వచ్చేసింది

పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సంఘాల ఆర్థిక బలోపేతానికి చేయూతనిస్తూ ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందిస్తోంది. బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు తీసుకుని వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లించిన స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం వడ్డీ రాయితీ నిధులు మంజూరు చేస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 2024 నుంచి జనవరి 2025 వరకు నిధులు విడుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన సంఘాల ఖాతాలలో మంజూరైన నిధులను జమ చేస్తున్నట్లు తెలిపారు. వడ్డీ రాయితీ నిధులు మంజూరు చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాయిదాల చెల్లింపు సక్రమంగా ఉంటే చాలు

మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకుంటారు. వీటిని సద్వినియోగం చేసుకుని వివిధ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించి వడ్డీతో కలిపి బ్యాంకులకు వాయిదాలను



చెల్లిస్తుంటారు. వాయిదాల చెల్లింపు సక్రమంగా ఉంటే ఏటా వారు కట్టిన వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. దీనివల్ల మహిళా సంఘాలకు సున్నా వడ్డీతో రుణాలు అందించినట్లవుతుంది.

జిల్లాలోని 10,805 సంఘాలు వడ్డీ రాయితీకి అర్హత సాధించగా రూ.20.35 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ సంఘాల్లో 1,65,000కుపైగా సభ్యులున్నారు. అర్హులైన వారికి రూ.3 లక్షల నుంచి రూ.10లక్షల దాకా రుణాలిస్తున్నారు. గతంలో చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నా ఇప్పుడు అధికారుల చర్యలతో పారదర్శకత పెరిగింది. లోపాలు తగ్గాయి. ఇదే సమయంలో మహిళల్లో బాధ్యత మరింత పెరిగింది.

సున్నా వడ్డీకే తీసుకుంటున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా బాగుపడుతున్నారు. తమకాళ్లపై తాము నిలబడేందుకు అధికారులు శిక్షణ కూడా ఇస్తుండటంతో నేర్చుకుని ఉపాధిలో ఉన్నతంగా ఎదుగుతున్నారు. కేవలం కుట్లు, అల్లికలు, కిరాణా దుకాణాలు, బుట్టల అల్లకం వంటి చిన్న చిన్న వాటికే పరిమితం కావడంలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటివి కూడా చేపడుతూ తాజాగా బస్సులను కూడా తీసుకుని నడిపించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు ప్రభుత్వం వీరికి పూర్తి అండగా నిలుస్తోంది.

# చివరి అంకం.. ఆటంకం

హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ద్వారా ఇప్పటివరకు రూ.97 కోట్లు ఫీజుల రూపంలో సమకూరింది. 500 వరకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఈ నెల 31తో రాయితీ గడువు ముగియనుంది. సర్వర్‌డౌన్ కావడంతో గురువారం ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధిలో 3.5 లక్షల మంది దరఖాస్తు చేశారు. నిర్ణీత గడువు నాటికి లేఅవుట్లలో 10 శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయిన వాటిని ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ కిందకు తీసుకొచ్చారు.

**అంచనా తలకిందులు**

ఒక్క హెచ్ఎండీఏ పరిధిలో కనీసం రూ.ఐదారు వందల కోట్లు గరిష్ఠంగా రూ.వేయి కోట్ల ఆదాయం సమకూరుతుందని భావించినా వివిధ కారణాలతో లక్ష్యం నెరవేరడం లేదు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ



మొత్తం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) నిర్వహిస్తోంది. తరచూ సాంకేతిక కారణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫీజు చెల్లించిన తర్వాత చాలామంది దరఖాస్తుదారులకు సంబంధించి ప్లాట్ల సమాచారం ఎర్రర్ కింద చూపుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు తమ దరఖాస్తు ఉందా....తాము చెల్లించిన ఫీజు మొత్తం ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

**స్పందన అంతంతే..**

మార్చి 31లోగా పథకం వినియోగించుకునే వారికి ఎల్ఆర్ఎస్ ఫీజుతోపాటు ఓపెన్ స్పేస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ ప్రకటించినా ఇప్పటివరకు అనుకున్న స్పందన కనిపించలేదు. ఈ నేపథ్యంలో రాయితీ గడువు పెంచుతారా లేదా అనేది చూడాలని హెచ్ఎండీఏ వర్గాలు అంటున్నాయి. గడువు మరికొంత కాలం పెంచే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. కొన్ని లేఅవుట్ల పరిధిలో 200 మీటర్లలోపు చెరువులు, నీటి కుంటలు లేనప్పటికీ ఎల్1 కేటగిరి కింద పెండింగ్‌లో పెట్టారు. సిబ్బంది కొరత, ఇతరత్రా కారణాలతో వీటి పరిశీలనలో జాప్యం జరుగుతోంది. ఒకే సర్వే నంబరు, పక్కపక్కనే ఉన్న ప్లాట్లకు సంబంధించి మార్కెట్ ధర వేర్వేరుగా ఉండటంతో ఫీజులు అధిక మొత్తంలో ఉంటున్నాయి. సాంకేతిక కారణాలతో ఇలా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

# కాలుష్య ఉద్గారాలు.. ఆ'గాలి'

హైదరాబాద్: కాలుష్య ఉద్గారాల స్థాయి పెరిగే కొద్దీ పీల్చే గాలి ప్రాణాంతకం అవుతుందని సెంటర్ ఫర్ సైన్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) నిపుణులు హెచ్చరించారు. వాహనాల వల్ల పెరుగుతున్న కాలుష్యంతో అనారోగ్య సమస్యలతో పాటు ఆయువుపై ప్రభావం చూపుతుందని వెల్లడించారు. లాన్సెట్ నివేదిక, 'ఎక్స్‌పోజర్ టు వెహికిల్ ఎమిషన్స్ ఇన్‌టేక్ ఫ్రాక్షన్' ఆధారంగా హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, చెన్నై, ముంబయి, దిల్లీ, కోల్‌కతా నగరాల్లో వాహన కాలుష్యం పెరుగుతోందన్నారు. ఫలితంగా పీఎం 2.5 సూక్ష్మ ధూళి కణాల స్థాయి పెరిగి అనారోగ్యంతో పాటు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. లాన్సెట్ నివేదిక ప్రకారం కాలుష్యం కారణంగా సంభవించే మరణాల్లో దిల్లీలో 11.2శాతం, వారణాసి 10.2, కోల్‌కతా 7.3, పుణె 5.9, హైదరాబాద్, ముంబయి, అహ్మదాబాద్ నగరాల్లో 5.6శాతం మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. **నియంత్రణే ప్రధానం..**వాహనాల ఉద్గారాలను నిత్యం తనిఖీ చేసుకొని పీయూసీ సర్టిఫికెట్ తీసుకోవాలని సీఎస్ఈ నిపుణులు వెల్లడించారు. కాలం చెల్లిన వాటిని తుక్కుగా మారుస్తూ, ఇంధన వినియోగాన్ని తగ్గించాలి. రెట్రోఫిట్‌పై (విద్యుత్ బ్యాటరీతో నడిచే వాహనాలుగా మార్చడం) వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం వైపు మళ్లించాలని సూచించారు. **పౌరుల భాగస్వామ్యం ముఖ్యమే**కాలుష్య ఉద్గారాలకు అడ్డుకట్ట వేయాలంటే నియంత్రణే ముఖ్యమని ఇందులో పౌరుల భాగస్వామ్యం అవసరమని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నిపుణులు సూచించారు.

# వన్యప్రాణులకు.. సాంకేతిక భరోసా

తిరుపతి : అగ్ని ప్రమాదాలకు తోడు మండుతున్న ఎండలతో వన్యప్రాణులు ఆహారం, నీటి కోసం అలమటించాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అటవీశాఖ గతంలోకంటే మెరుగ్గా, సాంకేతికత తోడుగా దాహార్తిని తీర్చే కార్యాచరణ అమలు చేస్తోంది. శేషాచలం అడవుల్లో సహజంగా నీటి ఆధారిత ప్రదేశాలు ఎక్కువ. తలకోన నుంచి తిరుమల మీదుగా మామండూరు, బాలపల్లె వరకు జలపాతాలు, నీటిచెలమలు, కుంటలు, పాతబావులు అనేకం ఉన్నాయి. ప్రధానంగా ఎస్వీ నేషనల్ పార్కు, ఎస్వీ అభయారణ్యం, చామల పరిధిలోకి వచ్చే అటవీ ప్రాంతంలో ఎక్కువగా అడవులకు ఉత్తర భాగంలోనే ఈ నీటి ఆధారిత ప్రదేశాలు ఉన్నాయి.

**దక్షిణం వైపునే ప్రాణాపాయం**

తిరుమలకు, అవ్వాచారికోనకు దక్షిణ భాగంలో ఉండే అటవీ ప్రాంతంలో ఎలాంటి నీటి ఆధారాలు లేవు. వన్యప్రాణులు సమూహాలుగా అవి నిర్దేశించుకున్న ప్రదేశాల్లోనే జీవిస్తూ ఉత్తర ప్రాంతం వైపు వెళ్లకుండా సమీపంలోని జనావాసాల్లోకి వెళ్తూ వేటగాళ్లు, కుక్కల దాడుల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి.

దక్షిణంవైపున నీటి ఆధారంలేని ప్రదేశాలను అటవీశాఖ రెండు నెలలకు ముందుగానే నోటిఫై చేసింది. సీసీ కెమెరాలు, డ్రోన్ సాంకేతిక దన్నుతో ఎక్కడెక్కడ నీటి నిల్వలు ఉన్నాయి, ఎక్కడ వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయన్న సమాచారాన్ని అధికారులు సేకరించారు.



శేషాచలంతోపాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు, వెంకటగిరి, వడమాలపేట, పుత్తూరు, భాకరాపేట, యర్రావారిపాలెం పరిధిలో నీటి ఆధారంలేని, వన్యప్రాణులు ఎక్కువగా సంచరించే 200 పైగా పాయింట్లను గుర్తించింది. అందుబాటులో ఉన్నవాటితోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన సాసర్ పిట్లలో అవసరాన్నిబట్టి వారానికి ఒకట్రెండుసార్లు నీటిని నింపే ఏర్పాట్లను అటవీశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

తిరుమల నుంచి మామండూరు వరకు 75 చోట్లకు పైగా నీటి లభ్యత ఉండేలా చూస్తున్నారు.పటిష్ఠంగా అమలు: వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు డీఎఫ్‌వో వివేక్ ఆనంద్ సారథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేశాం. సమస్యాత్మక అటవీ ప్రదేశాల్లో వారానికి ఒకట్రెండుసార్లు నీటిని నిల్వ చేస్తున్నాం. రాబోయే మూడు నెలలపాటు ఈ ఏర్పాట్లు జరుగుతాయి. సుదర్శన్‌రెడ్డి, అటవీక్షేత్రాధికారి, తిరుపతి రేంజి

## రూ.లక్షలు పోసి.. ఖాళీగా వదిలేసి

చిత్తూరు : రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ఖాళీగా వదిలేయడంతో విలువైన ప్రజాధనం వృథాగా మారింది. 2016లో అప్పటి తెదేపా పాలనలో ఎంతో ఉన్నతాశయంతో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ప్రాంగణంలోనే జీవ నియంత్రణ ప్రయోగశాల (బయోలాజిక్ కంట్రోల్ ల్యాబ్) భవనాన్ని రూ. 25-30 లక్షలతో నిర్మించారు. ఇక్కడ ప్రయోగశాలకు అవసరమైన పరికరాలు అమర్చి జీవ నియంత్రణ ఎరువులు తయారుచేసి రాయితీపై రైతులకు అందజేయాలి. 2019లో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం ఈ ప్రయోగశాలను పట్టించుకోలేదు. **నెల్లూరు నుంచి దిగుమతి..**

జిల్లాకు ప్రస్తుతం నెల్లూరు, నంద్యాలలోని జీవ నియంత్రణ ప్రయోగశాలల నుంచి తెప్పించి రైతులకు అందజేస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఆర్థిక భారంతోపాటు రైతులకు సకాలంలో అందడం లేదు. తెగుళ్లు అరికట్టలేక పంట దిగుబడులు పడిపోయి రైతులు నష్టపోతున్నారు.

**జీవనియంత్రణ ఎరువుల తయారీ..**

పంటల సాగులో జీవ నియంత్రణ ఎరువులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. రైజోబియం, ట్రైకోడెర్మావిరిడి, పాస్ఫోబ్యాక్టీరియా, సుడోమోనాస్ వంటి జీవనియంత్రణ ఎరువులు భూమిలో ఉన్న ఎరువులు మొక్కకు అందేలా దోహదపడతాయి. ఈ ఎరువులు ఇక్కడ తయారుచేసి రైతులకు రాయితీపై అందజేయాలి. వీటి వినియోగంతో వేరుకుళ్లు సహా పలు రకాల తెగుళ్లు నివారించవచ్చు.

**వృథాగా పరికరాలు..**జీవన ఎరువుల తయారీకి ఉపయోగించే యంత్రాలు, పరికరాలు భవనంలో వృథాగా పడి ఉన్నాయి. రూ.లక్షల విలువ చేసే ఈ యంత్రాలు కొన్ని నెలలు అలానే పడేస్తే పనికిరాకుండా పోయే పరిస్థితులు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులే పేర్కొంటున్నారు. **మరికొన్నింటికి ప్రతిపాదనలు..** -నాగపద్మిని, ఇన్‌ఛార్జి డీడీ, జిల్లా వనరుల కేంద్రం, చిత్తూరు ప్రయోగశాలను అందుబాటులోకి తేవాలంటే మరికొన్ని పరికరాలు కావాలి. వీటి సరఫరాకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అవి రాగానే అమర్చి ప్రయోగశాలను ప్రారంభిస్తాం.

## విద్యార్థులు ఫుల్.. ఫలితాలు నిల్

చిత్తూరు : పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఫలితాలపై చర్చించాల్సిన అధికారులు పట్టించుకోలేదు కారణం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో నిమగ్నమవడమే. జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత ఏడు పాఠశాలలు సాధించగా.. సున్నా ఉత్తీర్ణత పాఠశాలలు లేవు.. పైగా ఒకరిద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఒకరిద్దరు ఉత్తీర్ణత.. ముళకలుత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల (గంగాధరనెల్లూరు)లో 25 మంది పరీక్ష రాయగా ఒకరు పాసయ్యారు. తంబుగానిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల (బంగారుపాళ్యం)లో పదిమందికి ఒకరు, కొల్లాగుంట సీఎస్ఐ ఉన్నత పాఠశాల (కార్వేటినగరం)లో 29 మందికి నలుగురు ఉత్తీర్ణులయ్యారు. నక్కనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల(వి.కోట)లో ఏడుగురికి ఒకరు, కొల్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాల(శాంతిపురం)లో ఏడుగురికి ఒకరు, నరసింహరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాల (ఎస్ఆర్‌పురం)లో 20 మందికి ముగ్గురు, ఎస్ఆర్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 92 మందికి 15 మంది, రామకుప్పం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 25 మందికి ఐదుగురు ఉత్తీర్ణత సాధించారు. వందశాతం ఉత్తీర్ణత పాఠశాలలు ఇలా.. పూతలపట్టు మండలంలో ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ పాఠశాలలోని 75మందీ ఉత్తీర్ణులయ్యారు. అదే మండలంలో గొడుగుచింత జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడుగురు, సదుం మండలం పాలమంద జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిది మంది, జ్యోతిబా ఫులే రెసిడెన్షియల్ పాఠశాలలో 77మంది, యాదమరి మండలంలో 14కండ్రిగ జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 13మంది, గుడిపాల మండలం ఏఎల్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 30మంది, బైరెడ్డిపల్లె మండలం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో 82మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్ఆర్‌పురంలో మరీ తక్కువ. ఎస్ఆర్‌పురం మండలంలో 321 మందికి.. 115 మంది ఉత్తీర్ణులై 35.83 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. రామకుప్పంలో 679 మందికి.. 338 మంది ఉత్తీర్ణతతో 49.78 శాతం, గుడుపల్లెలో 576మందికి.. 312మంది ఉత్తీర్ణతతో 54.17శాతం సాధించింది. గుడిపాల మండలంలో 273 మంది పరీక్ష రాయగా 261మంది ఉత్తీర్ణతతో 95.60శాతం సాధించింది. తర్వాత స్థానంలో పూతలపట్టు మండలంలో 447మందికిగాను 384మంది ఉత్తీర్ణతతో 85.91శాతం, సదుం మండలంలో 245మందికిగాను 210మంది ఉత్తీర్ణతతో 85.71శాతం, పాలసముద్రం మండలంలో 182మందికిగాను 149మంది ఉత్తీర్ణతతో 81.87శాతం సాధించింది.

# ప్రతి లెక్క.. ఇకపై పక్కా!



పాడేరు : జానకీరామపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి రసీదులు లేకుండానే నగదు పుస్తకంలో రూ. 81 వేల ఖర్చులు రాసేశారు. నిబంధనలకు విరుద్ధంగా భవిష్యనిధి సొమ్ము రూ. 8.72 లక్షలు వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారు. బినామీ రుణాల పేరుతో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు.

చెట్టుపల్లి సహకార సంఘం సీఈఓ రూ. 60.62 లక్షల సంఘం నిధులను దుర్వినియోగం చేసినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. పాలకవర్గం అనుమతి లేకుండా, నాబార్డు నిబంధనలకు వ్యతిరేకంగా తమ జీతభత్యాల పేరుతో మళ్లించేసుకున్నారన్నది ప్రధాన అభియోగం. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) కంప్యూటరీకరణ చేశారు. బ్యాంకులు మాదిరిగానే పీఏసీఎస్‌ల్లో లావాదేవీలన్నీ ఈ నెల నుంచి ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. దీనివల్ల గతంలోలా అక్రమాలకు పాల్పడటానికి అవకాశం ఉండదు. నిన్నమొన్నటి వరకు సొసైటీల్లో వ్యవహారాలన్నీ సాధారణ పద్ధతుల్లో జరిగేవి. చేతి రాతలతో రికార్డులను తారుమారు చేసేవారు. వాయిదాలు చెల్లించకుండా సర్దుబాటు చేయడం, బినామీల పేరిట రుణాలు బుక్కేశారు. ఈ సంఘాలను నేతలు తమ సొంత అవసరాల కోసం నష్టాల్లోకి నెట్టేసేవారు. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ చేతివాటానికి ఇన్నాళ్లకు చెక్ పెట్టగలిగారు. ఉమ్మడి జిల్లాలో 98 సహకార సంఘాలకు గాను ప్రస్తుతం 96 సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చారు.

**రెండేళ్లుగా కంప్యూటరీకరణ**

సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ ప్రక్రియను 2023 నుంచి మొదలుపెట్టారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి గతేడాది మార్చి 31 వరకు జరిగిన లావాదేవీలన్నీ డేటా క్యాప్చర్ టూల్ (డీసీటీ) అనే సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ చేశారు. పాత రికార్డులన్నీ అందుబాటులో లేకపోవడం, సిబ్బంది అవగాహన లేమి వల్ల కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతూ వచ్చింది. కేంద్రం నుంచి ఒత్తిడి పెరగడం, అధికారులు తరచూ సమీక్షలు పెట్టి లక్ష్యాలను విధించడంతో ఎట్టకేలకు గత నెలాఖరు నాటికి పూర్తి చేయగలిగారు. అనకాపల్లి కేంద్రంగా ఉన్న గౌరీ సంఘం, మునగపాక సహకార సంఘాల్లో లావాదేవీలు ఎక్కువగా ఉండటంతో వాటిలో ఇంకా ఆన్‌లైన్ సేవలను మొదలుపెట్టలేకపోయారు. మిగతా అన్నిచోట్లా బ్యాంకింగ్ తరహా సేవలను అందిస్తున్నారు.

పారదర్శకతకు అవకాశం: సహకార సంఘాలను ఆన్‌లైన్ చేయడం వల్ల అక్కడ జరిగే లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుంది. అక్రమాలు జరగడానికి ఆస్కారం ఉండదు. ప్రతి వ్యవహారం జిల్లా కేంద్రం నుంచే పర్యవేక్షించడానికి వీలుంటుంది. రుణాలతోపాటు రికవరీ శాతం పెరిగి సంఘాలు లాభాలబాట పట్టడానికి అవకాశం ఉంది.

డీవీఎస్ వర్మ, సీఈఓ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, విశాఖపట్నం

# ప్రకృతి వైద్యానికి పునరుజ్జీవం



నర్సీపట్నం : ప్రాచీన ప్రకృతి వైద్యం జనానికి మరింత చేరువవుతోంది. దీని పునరుజ్జీవానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆయుష్ ఆసుపత్రుల ద్వారా ఆయుర్వేద వైద్య సేవలను ఇప్పటికే జనానికి అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు ఇందులోనే భాగమైన ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయగలిగే 'పంచకర్మ' వైద్య విధానాన్ని ప్రజల ముంగిటకు తీసుకువస్తోంది. జిల్లాలో వీటి విభాగాలకు మూడింటికి కొత్తగా అనుమతి మంజూరు కావడం విశేషం.

ప్రకృతి వైద్యం పట్ల క్రమేపీ జనం మొగ్గుచూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంప్రదాయ వైద్య విధానానికి అన్నివిధాలా ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి. జిల్లాలోని ఒక్క కొరుప్రోలులోని స్పెషాలిటీ వెల్‌నెస్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూసీ) లో మాత్రమే పంచకర్మ వైద్య చికిత్స విభాగం కొనసాగుతోంది. తాజాగా నర్సీపట్నం, అనకాపల్లి, కన్నూరుపాలెంలోనూ వీటి ఏర్పాటుకు వీలుగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని ఆయుష్ ఆరోగ్య మందిరాల్లో (ఏఏఎం) అన్ని వసతులతో అనుకూలంగా ఉన్న వాటిని గుర్తించి వాటి స్థాయిని పెంచుతుంటారు. ఈ మేరకు కొత్తగా మూడు కేంద్రాలకు అవకాశం లభించింది. త్వరలోనే వీటన్నింటిలో పూర్తిస్థాయి ప్రకృతిసిద్ధమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

పంచకర్మను అయిదు కర్మలతో చేపట్టే చికిత్సగా పేర్కొంటారు. వమన, విరేచన, హస్తినస్య, రక్తమోచన అనే అయిదు రకాల చికిత్సలతో వ్యాధులను నయం చేస్తుంటారు. వీటిద్వారా దీర్ఘకాల వ్యాధులైన కీళ్లు, నడుము, తల నొప్పులు, బొల్లివ్యాధి, సొరియాసిస్, సైనసైటిస్, సయాటికా తదితర వాటికి తక్కువ సమయంలోనే ఎంతో ఉపశమనం లభిస్తుందంటున్నారు.

మౌలిక వసతులు సమకూరుతాయి- ఝాన్సీలక్ష్మీబాయ్, ఆయుష్ ఆర్‌డీడీ

కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించడంతో పంచకర్మ విభాగాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నర్సీపట్నంలో ప్రారంభమైన ఆయుష్ ఆసుపత్రికి ఈ విభాగం సైతం మంజూరు కావడం విశేషం. జిల్లాలో ఎంపిక చేసిన ఈ మూడింటిని త్వరలోనే ఎస్‌డబ్ల్యూసీలుగా అభివృద్ధి చేసి పంచకర్మ చికిత్సను అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటికి తగిన సిబ్బంది ఇతర మౌలిక వసతులు సైతం సమకూరుతాయి.

# ఉపాధికి ఊతం.. పల్లె ప్రగతికి సమాహారం



తిరుపతి : ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో సామాజిక ఆస్తుల సృష్టి, కూలీల వేతనాల చెల్లింపునకు వైకాపా ప్రభుత్వం పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉపాధిహామీ పథకాన్ని గరిష్ఠంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఒకేసారి అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించారు. ఇందుకు తగ్గట్టుగానే పనులు గుర్తించి ఆగమేఘాలపై పూర్తి చేయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరులో భారీస్థాయిలో ఖర్చుపెట్టి పథకం ఉద్దేశాన్ని నెరవేర్చారు.

పాడి రైతులకూ మేలు చేయాలనిజగన్ ముఖ్యమంత్రి అయ్యాక పాడి రైతులకు ఎంతో మేలుచేసే గోకులం షెడ్లను అటకెక్కించారు. అంతకుముందు నిర్మించిన వాటికి బిల్లులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టారు. కూటమి కొలువుదీరిన తర్వాత గతేడాది జులై ఒకటిన గోకులం పథకాన్ని పునరుద్ధరించింది. 90 శాతం రాయితీపై చిత్తూరు జిల్లాలో తొలుత 1,500 షెడ్లు మంజూరు చేయగా డిమాండ్ నేపథ్యంలో అనంగా 827 మంజూరు చేశారు. ఈ ఒక్క పథకానికే రూ.50 కోట్లు ఖర్చు చేశారు. తిరుపతి జిల్లాలో 1,048 షెడ్లకు రూ.24 కోట్లు వెచ్చించారు. సీసీ రహదారులు, డ్రెయిన్లు, తదితర పనులకు రెండు జిల్లాల్లో రూ.140 కోట్లు వెచ్చించారు.

రూ.72 కోట్లకుపైగానే ఖర్చుచేసి: వైకాపా హయాంలో చిత్తూరు జిల్లాలో 2023- 24లో మెటీరియల్ కాంపోనెంట్, కూలీల వేతనాల చెల్లింపులకు కలిపి రూ.299.47 కోట్లు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం 2023- 24లో రూ.371.85 కోట్లు వెచ్చించింది. తిరుపతి జిల్లాలో రూ.349.6 కోట్లు గతంలో వినియోగించుకోగా 2024-25లో ఇది ఏకంగా రూ.443.39 కోట్లకు పెరిగింది. అంటే తిరుపతిలో రూ.93.79 కోట్లు ఎక్కువగా ఖర్చు చేశారు. చిత్తూరు జిల్లాలో ఇది రూ.72.38 కోట్లుగా ఉంది. రెండు జిల్లాల్లో కలిపి రూ.72 కోట్లకుపైగానే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టారు.

అంతకుమించి చేయాలని: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తిరుపతి జిల్లాలో ఉపాధిహామీ పథకంలో రూ.500 కోట్లు, చిత్తూరు జిల్లాలో రూ.400 కోట్లు వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోకులాలపాటు జలసంరక్షణకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు.

సామాజిక ఆస్తుల సృష్టే లక్ష్యం: కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం మేరకు సామాజిక ఆస్తులు సృష్టించాలనే లక్ష్యంతో నిధులు ఎక్కువగా వినియోగించుకుంటున్నాం. ఇదే సమయంలో పేదలకు ఉపాధి కల్పిస్తున్నాం. ఈ ఏడాది రూ.500 కోట్ల లక్ష్యాన్ని చేరుకురాం. వెంకటేశ్వర్, తిరుపతి కలెక్టర్

# అప్రమత్తతతో సురక్షిత ప్రయాణం

చిత్తూరు : రహదారి ప్రమాదాల నివారణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లు గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ మేరకు గుర్తించిన 25 బ్లాక్ స్పాట్లలో ప్రమాదాల నివారణపై దిశానిర్దేశం చేశారు. **ప్రమాదాలకు కారణాలు..**ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్ ధరించక పోవడం, సీట్ బెల్టు పెట్టుకోక పోవడం, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం.చేపట్టే చర్యలు.. వేగ నిరోధకాలు, రంబుల్ స్టిక్, సోలార్ లైటింగ్, సైన్ బోర్డుల్ని ఏర్పాటుచేయనున్నారు. హైవేల వద్ద రోడ్డు దాటేందుకు ఏర్పాటుచేసిన అక్రమ క్రాసింగ్ మూసివేయనున్నారు.

**జరుగుతోంది ఇలా..** 2024లో 458 వాహన ప్రమాదాలు జరగ్గా 510 మంది గాయపడ్డారు. 228 మంది మృతిచెందారు. వీరిలో ద్విచక్ర వాహనదారులు 128 మంది మరణించారు. : 2025 మార్చి వరకు 116 ప్రమాదాలు జరగ్గా 51 మంది మరణించారు. 153 మంది గాయపడ్డారు.

**బ్లాక్ స్పాట్లు ఇవే..**

ఎన్‌హెచ్ 69 (చెన్నై-బెంగళూరు) : చీలాపల్లి క్రాస్, గంగాసాగరం, యాదమరి కూడలి, వరిగపల్లి జంక్షన్, కేజీసత్రం, మొగిలి ఘాట్, దొరచెరువు, జగమర్ల క్రాస్, దండపల్లి జంక్షన్, పొన్నమాకులపల్లి క్రాస్, ఆలకుప్పం. ఎన్‌హెచ్-40: కర్నూలు-చిత్తూరు రహదారిలో మురకంబట్టు కూడలి. ఎన్‌హెచ్ 140: చిత్తూరు-తిరుపతి ఆరు వరసల హైవేలో తెల్లగుండ్లపల్లి క్రాస్, పి.కొత్తకోట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద. ఎన్‌హెచ్ 716: పుత్తూరు-ఊత్తుకోట రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్ బంక్, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, కన్నంమిట్ట ప్రాంతం.నియమాల్ని పాటించి ప్రాణాల్ని కాపాడుకోవాలి.. రహదారి భద్రతా నియమాల్ని పాటించి, ప్రజలు తమ విలువైన ప్రాణాల్ని కాపాడుకోవాలి. ట్రాఫిక్ నియమాల్ని ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. సుమిత్‌కుమార్, కలెక్టర్

# ధరలో 'మాధుర్యమేదీ'?

నూజివీడు : మధుర ఫల రాజుగా పేరొందిన మామిడికి గిట్టుబాటు ధరపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని తోటల్లో ముందుగానే మామిడి కోతకొస్తోంది. రాత్రిళ్లు చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పూతను నిలబెట్టుకునేందుకు రూ.లక్షల విలువైన మందులు పిచికారీ చేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది దిగుబడులు తగ్గాయంటున్నారు. వ్యాపారులు సిండికేట్ అయి ధరలను తగ్గించడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారులు, మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇస్తున్న సలహాలు రైతులకు ఉపయోగపడటం లేదు.

**మార్కెటింగ్ సౌకర్యం లేనట్లే**

మామిడికి మార్కెటింగ్ సౌకర్యం కోసం నున్న మార్కెట్టును నూజివీడుకు తరలిస్తామని మంత్రి పార్థసారథి ప్రకటించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు చేసి ఉద్యానశాఖ కమిషనరేట్‌కు పంపారు.



**నాణ్యత ఉంటేనే ...**

నాణ్యత అధికంగా ఉంటేనే వ్యాపారులు ధర పెంచుతున్నారు. లేదంటే వారు చెప్పిన ధరకు కాయలు మార్కెట్‌లో వదిలి రావాల్సిందే. నూజివీడు రసాలు టన్ను రూ.10 వేల నుంచి రూ.12 వేలు, బంగినపల్లి రూ.30 వేల నుంచి 50 వేలు, తోతాపురి రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. ఇది ఏమాత్రం గిట్టుబాటు కాదని నూజివీడు రైతులు పేర్కొన్నారు. తేనె మంచు పురుగు, పిండినల్లి, పండు ఈగ, రకరకాల తెగుళ్ల బారిన పడి నష్టపోతున్నామని చెప్పారు. సూచనలు కోసం రైతులు నేరుగా సంప్రదించవచ్చని ఉద్యానాధికారిణి ఆర్.హేమ తెలిపారు. కాయ రక్షణకు వినియోగిస్తున్న కవర్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లా పరిధిలో 75,564 ఎకరాల్లో మామిడి సాగవుతోంది.

ఈ ఏడాది సాగర్ జలాలు కనుచూపు మేరలో కనిపించకపోవడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతం. బోరు బావులు, ట్యాంకర్లలో నీటిని తీసుకుని వెళ్లి చెట్టుకు ఉన్న కొద్దిపాటి కాయలను రక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.

# అక్రమ తవ్వకం.. అవినీతి పెంపకం

నంద్యాల : చేపల చెరువులు వెల్లువలా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండానే వ్యవసాయ భూముల్లో ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారు. సమీపంలోని సాగునీటి కాల్వల నుంచి గుట్టుగా నీటిని తరలిస్తున్నారు.. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ తీసుకొని చౌర్యానికి పాల్పడుతున్నారు. కుళ్లిన మాంసం వ్యర్థాలను చేపలకు ఆహారంగా ఉపయోగించి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ఈ దందా రోజురోజుకు పెరిగిపోతున్నా.. మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

**వీరికి అనుమతులు అక్కర్లేదు**

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలం తంగడంచెలో 10 ఎకరాల వ్యవసాయ పొలంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆధ్వర్యంలో అక్రమ చేపల చెరువు సాగవుతోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో ఎలాంటి అనుమతి లేకుండానే రెండు చోట్ల చేపలు పెంచుతున్నారు.మంత్రాలయం మండలం రాంపురం, కగల్లు, శాతనూరు తదితర గ్రామాల్లో 10 అక్రమ చెరువులు ఉన్నాయి. కోసిగి మండలంలో మరో 10 చోట్ల అనుమతుల్లేకుండానే చెరువులు తవ్వి చేపలు పెంచుతున్నారు. ఒక్కోటి 10 నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో తవ్విన వీటికి తుంగభద్ర నది నీటిని ఉపయోగిస్తున్నా అడిగేవారు లేరు.

**గడిగరేవుల.. ఆగడాలు చాలా**

గడివేముల మండలం గడిగరేవుల గ్రామంలో 30కి పైగా అక్రమ చేపల చెరువులు ఉన్నాయి. ఇక్కడ రైతులు గోరుకల్లు జలాశయం నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం భూములను లీజు పద్ధతిలో అప్పగించారు. ఈ భూముల్లో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరిగాయి. ఒక్కో రైతు 3 నుంచి 10 ఎకరాల వరకు మట్టి తవ్వకాల కోసం తమ భూములను ఇచ్చారు. కోస్తా ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఈ భూములను లీజుకు తీసుకుని చేపల చెరువులుగా మార్చారు. ఇక్కడ కొన్ని చెరువులకు కుందూనది నుంచి నీటిని అక్రమంగా తోడుకుంటున్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తూ ప్రభుత్వానికి మోసం చేస్తున్నారు.

**మట్టి దోచి.. చెరువుగా మార్చి**

నంద్యాల మండలం అయ్యలూరుమెట్టలో రెండు ప్రాంతాల్లో అనుమతి లేని చేపల చెరువులు ఉన్నాయి. ఇక్కడ గతంలో ఇటుకల బట్టీల కోసం వ్యవసాయ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టారు. దీంతో పొలాల్లో గుంతలు పడ్డాయి. వ్యవసాయానికి పనికిరాకుండా పోయిన ఆయా భూముల యజమానులతో ఒప్పందం చేసుకుని వ్యాపారులు చేపల చెరువులుగా మార్చేశారు. కొన్నేళ్లుగా చేపల పెంపకం సాగిస్తున్నారు. జిల్లా కేంద్రం చెంతనే అక్రమాలు సాగుతున్నా మత్స్యశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.

**కోళ్ల వ్యర్థాలే దాణా**

సాధారణంగా చేపలకు నాచు, ఉడికించిన మొక్కజొన్న, తవుడు లాంటి దాణాను ఆహారంగా ఇస్తుంటారు. కానీ క్యాట్ ఫిష్, ఫంగస్, తెల్లరకం చేపలు జంతు కళేబరాలు, కోళ్ల వ్యర్థాలు తింటాయి. మంచినీటిలో పెరిగే చేప నెలకు అర కిలో నుంచి కిలో వరకు పెరిగితే చికెన్ వ్యర్థాలు తినే చేపలు రెండు నుంచి ఐదు కిలోల వరకు పెరుగుతాయి. అంతేకాకుండా చేపల దాణాతో పోల్చితే చికెన్ వ్యర్థాలు తక్కువ ధరకు లభిస్తాయి. ఆయా చెరువుల్లో పెరిగిన చేపలను హైదరాబాద్, బెంగళూరు, కర్ణాటక ప్రాంతాలకు తరలిస్తున్నారు. గడిగరేవుల, అయ్యలూరుమెట్ట ప్రాంతాల్లో అక్రమంగా చేపల చెరువులు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. **ఎకరానికి రూ.వెయ్యి చొప్పున చెల్లించాలి**

ప్రస్తుతం నంద్యాలలో 700 ఎకరాలు, కర్నూలు జిల్లాలో 300 ఎకరాల వరకు అక్రమ చేపల చెరువులు ఉన్నట్లు అంచనా. చేపల చెరువు సాగుకు అధికారికంగా అనుమతి తీసుకోవాలి. ఇందుకు ఎకరాకు రూ.వెయ్యి వరకు మత్స్యశాఖకు రుసుము చెల్లించాలి.

మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. వారి ఆమోదం తర్వాత చెరువు నిర్మాణానికి తవ్వకాలు చేపట్టాలి. విస్తీర్ణాన్ని బట్టి రెవెన్యూ, భూగర్భజలశాఖ, జలవనరుల శాఖ అధికారులు కొలతలు వేస్తారు. ఆమేరకే తవ్వాలి. ఆ తర్వాత కాలుష్య నియంత్రణ మండలి ఎన్‌వోసీ జారీ చేస్తుంది. వాణిజ్య విభాగం కింద విద్యుత్తు కనెక్షన్ తీసుకోవాలి.

# మృత్యు కుంట

అనంతపురం : ఎద్దులకు నీళ్ల తాపించేందుకు వెళ్లి కుంటలో మునిగి ఇద్దరు పదోతరగతి విద్యార్థులతోపాటు ఒక ఎద్దు మృతిచెందింది. ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు పరీక్షల్లో ఉత్తీర్ణత చెందగా.. మరొకరు ఒక సబ్జెక్టు తప్పారు. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం చంద్రగిరిలో జరిగిన ఈ ఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. గ్రామస్థుల కథనం మేరకు.. పోతప్ప కుమారుడు వంశీ(15), కుళ్లాయప్ప కుమారుడు గోవిందరాజు(16) ఎద్దులను కడిగి, నీటిని తాపించేందుకు బండిని తోలుకుని గురువారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని హెచ్చెల్సీ కాలువ కట్ట పక్కన ఉన్న కుంట వద్దకు వెళ్లారు. బండి కుంటలోకి దిగగానే ఎద్దులు అదిరి ముందుకు లాక్కెళ్లాయి. గుంత లోతుగా ఉండటంతో విద్యార్థులు మునిగిపోయి గల్లంతయ్యారు. ఒక ఎద్దు తప్పించుకొని గట్టుకురాగా మరో ఎద్దు మునిగిపోయింది. సమీపంలోనే జీవాలను మేపుతున్న కొందరు గమనించి



గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కుంట వద్దకు చేరుకొని గాలింపు చేపట్టారు. ఇద్దరు విద్యార్థులతోపాటు ఎద్దును బయటకు తీయగా అప్పటికే మృతిచెందారు. కుంటను ఎస్పై నబీరసూల్, పోలీసులు పరిశీలించారు. ప్రమాదం జరిగిన కుంట కర్ణాటక రాష్ట్రం ఎత్తినబూదిహాళ్ గ్రామ పొలిమేరలో ఉన్నందున బళ్లారి గ్రామీణ పోలీసులకు సమాచారం ఇచ్చామని ఎస్పై తెలిపారు.

**ఆరుగురిని మింగిన కుంట**

కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో హెచ్చెల్సీ పక్కనే ఉన్న ఈ కుంట బొమ్మనహాళ్ మండలంలోని చంద్రగిరి, కురువల్లి గ్రామాలకు చెందిన ఆరుగురిని పొట్టన పెట్టుకుంది. గతంలో హెచ్చెల్సీ కాలువ మరమ్మతుల కోసం పొక్లెయిన్‌లతో మట్టిని తవ్వడంతో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. కాలువకు నీరు వదిలినప్పుడు ఈ గుంతల్లోకి నీటిని విడుదల చేయించుకుని వేసవిలో మూగజీవాల దాహార్తి తీరుస్తున్నారు.

**పరీక్ష ఫలితాలు వెలువడిన 24 గంటల్లోనే..**

శివ పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత చెందగా, గోవిందరాజులు ఒక సబ్జెక్టు తప్పారు. ఫలితాలు వచ్చిన 24 గంటలు కాకముందే ఇద్దరిని కుంట పొట్టన పెట్టుకుందని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరు మున్నీరయ్యారు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత శిఖరాలకు చేర్చాలని కలలు కన్నామని, పదోతరగతికే ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారని తల్లిదండ్రులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

# నగర దారుల్లో విద్యుత్తు బస్సులు

విశాఖపట్నం: నగర రోడ్లపై విద్యుత్తు బస్సులు పరుగులు తీయనున్నాయి. విశాఖలో రెండు దశల్లో దాదాపు వంద బస్సులు నడిపేలా ప్రణాళిక చేస్తున్నారు. మొత్తంగా జిల్లా అంతటా 200 బస్సులు నడపాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో తొలుత గాజువాక, సింహాచలంలో 50 బస్సులు చొప్పున నిర్వహించేలా డిపోలను సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటికే అందుకు అనుమతులొచ్చాయి. సింహాచలం డిపో పరిధిలోని సింహపురి కాలనీ వద్ద ఆర్టీసీకి అయిదెకరాల వరకు స్థలం ఉంది. ఈ ఖాళీ స్థలాన్ని డిపో నిర్వహణ, విద్యుత్తు బస్సుల మరమ్మతులు, గ్యారేజీ నిర్వహణ, సిబ్బందికి శిక్షణ, బ్యాటరీ ఛార్జింగు పాయింట్లు ఉంటాయి.



70 కి.మీ పరిధిలో: నగరంలో 70 కిలోమీటర్ల పరిధిలో ఒక రోజులో సగటున 6.86 లక్షల మంది ప్రయాణిస్తారు. విజయవాడలో ఈ సంఖ్య 5 లక్షల లోపే. దీంతో రాష్ట్రంలో ఎక్కువ బస్సుల అవసరం విశాఖ నగరానికే ఉంది. ఇక్కడి అధికారులు 200 బస్సులకు ప్రతిపాదించగా త్వరలోనే రానున్నాయి. నగర పరిధిలోని ఆరు డిపోల పరిధిలో మూడింటిలో విద్యుత్తు బస్సుల కోసం స్థలం కేటాయించనున్నారు. గాజువాక, సింహాచలం డిపోల తరువాత మధురవాడలో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే డ్రైవర్లు, మెకానిక్‌లలో కొందర్ని ఆ బస్సుల కోసం సిద్ధం చేస్తున్నారు. నగర అవసరాలకు తగ్గట్టు ఏ బస్సులు అవసరం, ఇక్కడి రహదారులపై సరిగా నడుస్తాయా? ఎన్ని కిలోమీటర్లు తిరగాలి? ఎన్ని బస్సులు అవసరమనే అంశాలపై ఇప్పటికే పరిశీలన పూర్తయింది.

త్వరలోనే..: నగరానికి త్వరలో మొదటి విడతగా 50 రానున్నాయి. బహుళ వాహనాల వినియోగంతో కాలుష్యం పెరిగిపోతుంది. మహానగరాల్లో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంది. ఇటువంటి నగరాలకు విద్యుత్తు బస్సుల వినియోగం మంచి ఫలితాలు ఇస్తుంది. ఇప్పటికే దేశంలోని పలు నగరాల్లో ఈ రకమైనవి నడుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో మంచి ఫలితాలే ఇస్తున్నాయి. కొద్ది రోజుల్లో నగర రోడ్లపై ఈ బస్సులు తిరగనున్నాయి. వీలైనన్ని ఎక్కువ బస్సులు విశాఖకు వచ్చే అవకాశం ఉంది.

అప్పలనాయుడు, జిల్లా ప్రజారవాణాధికారి

## నిర్మాణాలు సరే.. నీరు ఏదీ?

కదిరి : ఎండలు మండుతున్న తరుణంలో మూగజీవాల దాహం తీర్చడానికి ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోతున్నాయి. పాడి పశువులను మేతకు బయటకు తీసుకెళితే నీటి సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మూగజీవాల దాహార్తి తీర్చేలా ఉపాధి హామీ పథకం కింద తొట్టెలు నిర్మాణం చేపట్టింది. జిల్లాకు 1362 మంజూరు అయ్యాయి. ఒక్కోదానికి రూ.30 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. నీటి లభ్యత లేకుంటే అదనంగా 15 మీటర్లు పైపులైన్‌కు రూ.2,300 వ్యయం చేసేలా చర్యలు చేపట్టారు. పంచాయతీకి రెండు నుంచి మూడు చొప్పున మంజూరు చేశారు. ఇదిలా ఉండగా గతంలో 874 నిర్మించారు. వాటిలో కనీసం 30 శాతం కూడా వినియోగంలో లేవు. కొన్నిచోట్ల మట్టితో నిండిపోయాయి. నీటి సౌకర్యం లేకపోవడం, ప్రణాళికాబద్ధంగా నిర్మించకపోవడంతో ప్రజాధనానికి సార్థకత లేకుండాపోయింది. మరి కొన్ని చోట్ల కూర్చోనేందుకు మట్టితో నింపేశారు. పాడిపశువులు, జీవాలకు అవసరమైన నీటిని సక్రమంగా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

నీటి లభ్యత ఉన్న ప్రాంతంలోనే నిర్మిస్తున్నాం విజయప్రసాద్, డ్వామా పీడీ

అన్ని పంచాయతీల్లో నీటి లభ్యత ఉన్న ప్రాంతంలోనే నిర్మాణాలు చేపడుతున్నాం. పైపులైన్ ఏర్పాటుకు అదనంగా నిధులు ఇస్తున్నాం. అవసరమైతే పాతవాటిని

# కాలిపోతే కష్టాలే!



అనంతపురం : విద్యుత్తు శాఖలో కొన్ని నిబంధనలు కాగితాలకే పరిమితమవుతుండటంతో రైతులు, వినియోగదారులు వ్యయప్రయాస తప్పడం లేదు. విద్యుత్తుశాఖ ఏర్పాటు చేసిన నియంత్రికలు మరమ్మతుకు(కాలిపోతే)గురైతే వాటిని ఆ శాఖ వాహనాల్లో తరలించాల్సి ఉంది. ఎక్కడైనా మరమ్మతుకు గురైందని సమాచారం అందిన వెంటనే అక్కడి అధికారులు డిక్లేర్ చేయాల్సి ఉంటుంది. అనంతరం పనిచేసే నియంత్రికను విద్యుత్తు శాఖ వాహనంలో(గుత్తేదారు ద్వారా) తీసుకెళ్లి మార్చాలి. దాన్ని మరమ్మతు కేంద్రానికి తరలించాలి. క్షేత్రస్థాయిలో సిబ్బంది మాత్రం ఇందుకు భిన్నంగా చేస్తున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. మార్చకుండానే మరమ్మతు కేంద్రానికి తీసుకువచ్చి.. ఇక్కడ రిపేరు చేశాక తిరిగి ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు రైతులు, వినియోగదారులే అద్దెకు వాహనాలను తీసుకుని తరలిస్తున్నారు. రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు అద్దె చెల్లిస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు.

**నమోదులో మతలబు**

వినియోగదారులు ప్రైవేటు వాహనాల్లో తీసుకొస్తున్నా... వాటిని గుత్తేదారులు ఏర్పాటు చేసిన వాహనాల్లో తరలించినట్లు వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో వారికి నెలకు ఒక్కో వాహనం 2 వేల కిలోమీటర్లు తిరిగితే రూ.50 వేలు అద్దెగా చెల్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 విద్యుత్తు మరమ్మతు కేంద్రాలు పని చేస్తున్నాయి. కొన్ని కేంద్రాల్లో వాహనాల్లోకి ఎత్తడానికి, దించడానికి అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

**1912కు సమాచారం ఇవ్వాలిశేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ**

నియంత్రిక మరమ్మతులకు గురైన వెంటనే స్థానికులు, రైతులు వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1912కి సమాచారం ఇవ్వాలి. దీంతో ఉన్నతస్థాయిలో పర్యవేక్షణ ఉంటుంది. శాఖ కేటాయించిన వాహనాల్లోనే తరలించాలి. నియంత్రికలను వాహనాల్లోకి ఎత్తి...దించడానికి డబ్బు వసూలు చేయకూడదు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.

# పశువుల సంత జోరుగా.. వసూళ్ల దందా గుట్టుగా



అనంతపురం : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి ఆదివారం పశువుల సంత జోరుగా సాగుతుంది. ప్రతివారం 1500-2000 వరకు పశువులకు సంతకు తీసుకొస్తున్నారు. కనీసం అందులో సగం పశువులు వ్యాపారులే కొని కబేళాలకు తరలిస్తారు. అందుకు బెంగళూరు, కేరళ, తమిళనాడు, హైదరాబాద్‌కు తరలించేందుకు ఎక్కువ మొగ్గు చూపుతారు. కొన్నేళ్ల నుంచి యార్డులో కొందరు పార్టీ పేర్లు చెప్పుకుంటూ వసూళ్ల దందా కొనసాగిస్తున్నారు. గతంలో వైకాపా పేరు చెప్పుకుని భారీగా వసూళ్లు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెదేపా పేరు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నారు. పార్టీ పేరు చెప్పి. వ్యాపారులను, లారీ యజమానులను బెదిరిస్తున్నారు. లారీకి రూ.5 వేలు చొప్పున వసూళ్లు చేస్తున్నారు. యార్డులో సొమ్ము ఇవ్వకపోతే లారీలను వెంబడించి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. విషయం బయటకు పొక్కకుండా అంతా గోప్యంగా దందా కొనసాగుతుంది. యార్డు బయట పరిమితికి మించి పశువులను లారీల్లో తరలిస్తున్నారు.

**ఏడాదికి రూ.72 లక్షలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో పాడి పశువులు, ఎద్దులను రైతులు కొనుగోలు చేస్తున్నారు. బక్కచిక్కిన పశువులన్నీ వ్యాపారులు కొంటుంటారు. ప్రతి వారం కనీసం 700-1000 పశువులు వ్యాపారులే కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఒక్కోవారం కనీసమంటే 50-60 చిన్న, పెద్ద లారీల్లో తరలిస్తారు. అందులో 30 పెద్ద లారీలు ఉంటాయి. ఒక్కో లారీకి రూ.5 వేల చొప్పున యార్డులోనే అక్రమ వసూలు చేస్తున్నారు. ప్రతివారం రూ.1.50 లక్షలు లెక్కవేసుకున్నా.. నెలలో ఈ సొమ్ము రూ.6 లక్షల దాకా అవుతుంది. అంటే ఏడాదికి రూ.72 లక్షలన్నమాట..

**మా దృష్టికి రాలేదు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా కొనసాగుతున్నా.. 7 నెలల క్రితమే ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్నా. పశువులకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నాం. అనంతపురం నగర కార్పొరేషన్ సిబ్బంది ఒక్కో వాహనానికి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. దానికి రశీదులు ఇస్తున్నాం. యార్డులో అక్రమ వసూళ్లు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. బయట వ్యక్తులెవరూ ఒక్క పైసా వసూలు చేయడానికి లేదు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. గోవిందు, ఎంపిక శ్రేణి కార్యదర్శి (ఏఎంసీ)

# కేజీహెచ్ వైద్యులకు శ్రీముఖాలు

కదిరి : కింగ్ జార్జి ఆసుపత్రి ఓపీ, క్యాజువాల్టీ విభాగాల్లో విధులకు గైర్హాజరైన 12 మంది వైద్యులు, ఓ టెక్నీషియన్, మరో స్టాఫ్‌నర్స్‌కు శ్రీముఖాలు జారీ చేశారు. రెండు రోజుల వ్యవధిలో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించారు. వివరణ ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి. ఈనెల 18న జిల్లా ఇంఛార్జి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, 21న అదనపు డీఎంఈ వెంకటేష్ కేజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఓపీ విభాగాలు, వార్డులు, క్యాజువాల్టీలో విధుల్లో లేని వారికి నోటీసులు జారీ చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ, నెఫ్రాలజీ విభాగాల ఓపీల్లో మంత్రి తనిఖీలు చేయగా... రెండు చోట్లా ప్రొఫెసర్లు, సహ, సహాయ ప్రొఫెసర్లు అందుబాటులో లేరు. కేవలం పీజీలు మాత్రమే ఓపీ విధుల్లో ఉన్నారు. దీంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసి, షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను ఆదేశించారు.

మంత్రి ఆదేశాలతో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్.గిరినాథ్, సహ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, సహాయ ప్రొఫెసర్లు డాక్టర్ వంశీయాదవ్, డాక్టర్ మోహన్‌వంశీ, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ జి.ప్రసాద్, సహాయ ప్రొఫెసర్లు డాక్టర్ రత్నప్రభ, డాక్టర్ వై.ఎస్. అనితకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద నోటీసులు జారీ చేశారు. ఎస్ఎన్‌ఐసీ నిర్వహణకు సంబంధించి పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తికి నోటీసు ఇచ్చారు.

అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేష్ చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వీఎస్ఎన్.మూర్తి, సహ ప్రొఫెసర్




డాక్టర్ కె.నర్సింగరావు, సహాయ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జేఎస్‌కేవీ.చక్రవర్తి, ఎనస్తీషియా టెక్నీషియన్ సీహెచ్.అమర్‌బాబు, హెడ్ నర్సు కె.సుజాతకు నోటీసులు అందజేశారు.

**వైద్యవర్గాల్లో కలకలం :** మంత్రి, అదనపు డీఎంఈ తనిఖీల నేపథ్యంలో ఒకేసారి 14 మందికి నోటీసులు జారీ చేయడంతో ఆసుపత్రి వైద్యవర్గాల్లో కలకలం రేగింది. నిత్యం ఓపీల్లో సీనియర్ వైద్యులైన ప్రొఫెసర్లు, సహ, సహాయ ప్రొఫెసర్లు అందుబాటులో ఉండకుండా, సొంత క్లీనిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మంత్రి, అదనపు డీఎంఈ తనిఖీల్లో ఇదే విషయం బహిర్గతమైంది. ఇకపై అన్ని ఓపీల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలనపై నిఘా ఉండనుంది. దీంతో వైద్యుల్లో ఆందోళన మొదలైంది.

# రెక్కల కష్టం.. అమ్మినా నష్టం

అనకాపల్లి : అనకాపల్లి ఆవఖండంలో అర ఎకరా భూమిని కౌలుకు తీసుకొని టమాటా సాగు చేపట్టా! 25 కేజీల బరువు కలిగిన క్రేట్ టమాటా ధర పంట భూమి వద్దకు వచ్చి కొనుగోలు చేస్తే రూ. 100 ఇస్తున్నారు. ఆడ కూలీ రోజుకు 4 క్రేట్ల సరకు కోస్తున్నారు. కూలగా రూ. 400 ఇస్తున్నాం. వ్యాపారి ఇచ్చిన డబ్బు కోత కూలికి సరిపోతుంది. మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్మితే క్రేట్‌కు రూ. 150 ఇస్తున్నారు. దీనిలో ఆటోకు రూ. 40 పోతుంది. పది క్రేట్లలో తీసుకువెళ్తే ఆటో, కోత కూలి పోనూ రూ.100 మిగులుంది. అందుకే పంటను కోయకుండా భూమిలోనే విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నా.

..అనకాపల్లికి చెందిన రైతు పొలిమేర నాగేశ్వరరావు ఆవేదన ఇదీ. జిల్లాలో ప్రస్తుతం టమాటా సాగుదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో ఏటా 1,200 ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. ఒక్క అనకాపల్లి ఆవఖండంలోనే 250 ఎకరాల్లో వేస్తున్నారు. ప్రస్తుతం పంట చివరి దశకు వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాయలపై మచ్చలు వచ్చాయి. ప్రస్తుతం మదనపల్లి నుంచి సరకు వస్తోంది. అక్కడ నుంచి వచ్చే కాయలు చూడటానికి బాగుంటాయి. దీంతో వ్యాపారులు జిల్లాలో పండిన సరకుకు తక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు రాంబాబు, బచ్చిరాము ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమాటా పంట వేసిన రైతులు ఈ ఏడాది ఆది నుంచి



నష్టాలు చవిచూస్తున్నారు. వరి కోతల అనంతరం దీనిని సాగు చేస్తుంటారు. గత నెలలో ఒకేసారి పంట కోతకు రావడం ధరలు పడిపోయాయి. అప్పుడు కూడా ఇదే పరిస్థితి. వాస్తవానికి కొత్త అమావాస్య తర్వాత ధరలు బాగుంటాయని, ఈసారి కేవలం కొద్ది రోజులే ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. క్రేట్ టమాటా ధర రూ. 250 నుంచి 300 వరకు అమ్మకాలు చేశామన్నారు. వర్షాల కారణంగా ప్రసుత్తం పంట దెబ్బతిందని వాపోతున్నారు. ఎకరాకు రూ. 30 వేలు పెట్టుబడులు పెట్టి, మొత్తం నష్టపోయామన్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

## కొల్లేరు కమ్మేస్తూ.. మత్స్యకారులను కుంగదీస్తూ..

మండవల్లి : కొల్లేరులో ఎంతో గడ్డు పరిస్థితులను సైతం తమకు అనుగుణంగా మార్చుకుని మనుగడను సాధించే ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్, రాక్షస జాతి(సైల్ఫిన్ క్యాట్‌ఫిష్) చేపలు నానాటికి పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కొల్లేరులో ఎక్కువగా లభ్యమయ్యే చేపల్లో మొదటి స్థానం రాక్షస జాతి, రెండో స్థానం క్యాట్‌ఫిష్‌ది. అతి తక్కువ నీరు, ఎక్కువ వ్యాధి నిరోధక శక్తి, భయంకరమైన మాంసాహారులుగా పేరొందిన ఈ రెండు జాతులు ఇతర చేపల్ని వేటాడి తినడం వల్ల కొల్లేరులో ఇతర జాతులకు మనుగడకు ముప్పు వాటిల్లుతుంది.

క్యాట్‌ఫిష్ సాగు వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పుతోపాటు మనుషుల్లో అనేక వ్యాధులు వస్తున్నాయని 1995 పర్యావరణ వేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. 1997లో వీటి సాగుపై కేంద్రప్రభుత్వం నిషేధాన్ని విధించింది. అప్పటి నుంచి సాగు లేకపోయినా కొల్లేరులోని ఇతర మత్స్య జాతులను వేటాడుతూ తన ఉనికిని చాటుకుంటోంది. రాక్షస జాతి చేపలు ఆక్వేరియంలో నాచుని తగ్గించుకోవడానికి వృద్ధి చేశారు. పదేళ్లుగా వీటి సంతతి పంట కాలువలు, చేపల చెరువుల్లో,



ప్రస్తుతం పెద్దఎత్తున కొల్లేరులో దర్శనమిస్తున్నాయి.

**తీవ్రంగా నష్టపోతున్న మత్స్యకారులు..**

2006 కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఎక్కువ మంది మత్స్యకారులు కొల్లేరులో వేటను సాగిస్తూ జీవనాన్ని గడుపుతున్నారు. కానీ గత నాలుగేళ్లుగా క్యాట్‌ఫిష్ జాతి పెరిగి పోవడంతో ఇతర జాతులు లభ్యత క్రమంగా తగ్గుముఖం పట్టింది. అరుదైన జాతులు కనుమరుగవటం క్యాట్‌ఫిష్ స్థాయి పెరిగిపోవడంతో మత్స్యకారులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అంతరించిపోయే దశలో నల్లజాతి చేపలు.. కొల్లేరులో 126 రకాల చేపలు పెరుగుతుంటాయి. కొన్నేళ్లుగా వేసవిలో కొల్లేరు తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులు ఎదుర్కొంటోంది. దీంతో కొల్లేరులో ఏటా నల్లజాతి మత్స్య సంపద తరిగిపోతూ వస్తోంది. కానీ తీవ్ర నీటి ఎద్దడిని తట్టుకుని, బురదలో బతికే స్వభావం ఉన్న ఈ రెండు జాతులు మాత్రం పిల్లలను పెడుతూ దాన్ని వృద్ధి చెందుతున్నాయి.

**చాలా ప్రమాదకరం..** క్యాట్‌ఫిష్ జాతులు చాలా ప్రమాదకరమైనవిగా గుర్తించి ప్రభుత్వం దీన్ని నిషేధించింది. కొల్లేరులో పెరుగుతున్న సైల్ఫిన్ క్యాట్‌ఫిష్, క్యాట్‌ఫిష్‌ను అడ్డుకోవడం సాధ్యమయ్యే పనికాదు. రసాయనాలను వినియోగిస్తే ఇతర జాతులకు ముప్పు. క్యాట్‌ఫిష్ జాతులు దొరికినప్పుడు వాటిని నాశనం చేసేలా మత్స్యకారులే చర్యలు తీసుకోవాలి. - రాజ్‌కుమార్ ఇన్‌చార్జి ఏడీ, మత్స్యశాఖ

# శ్రీకాళహస్తికి పరిశ్రమల హారం

శ్రీకాళహస్తి : కూటమి పాలనలో శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిశ్రమల హారంగా మారనుంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికలు రూపొందించాలని సమీక్షిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

గతంలో తెదేపా ప్రభుత్వంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రం-1, 2గా ఏర్పేడు- వెంకటగిరి ప్రధాన రహదారిపై ఈఎంసీ-3గా కేటాయించి ఏపీఐఐసీకి పెద్దఎత్తున భూములు కేటాయించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ



నేపథ్యంలో ఈఎంసీ-1,2లో 830.5 ఎకరాల ఏపీఐఐసీకి భూములు కేటాయించగా.. 330 ఎకరాల్లో రూ.వేల కోట్లు పెట్టుబడులతో డిక్సన్, సిలికాన్, కార్బన్, టీసీఎల్ వంటి 56 భారీ పరిశ్రమలను ఏర్పాటుకు పందగలా భూమి చేశారు. అప్పటికే 30కిపైగా పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించడం గమనార్హం.

**పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు**

ఈఎంసీ-1, 2, 3లో వెయ్యి ఎకరాలకు పైగా ఏపీఐఐసీకి కేటాయించిన భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి నూతన పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై ప్రత్యేక దృష్టిసారిస్తూ అధికారులతో చర్చలు జరపడంతో రానున్న రోజుల్లో కదలికలు ఏర్పడనున్నాయి.

**తెదేపా హయాంలో శ్రీకారం**

తిరుపతి ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు సమీపంలో ఉండటంతో 2014లో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెదేపా శ్రీకారం చుట్టింది. అతి తక్కువ కాలంలోనే దేశంలోనే ఆదర్శవంతమైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా మార్చేందుకు సంకల్పించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి కుంటుపడింది.

**వైకాపాలో వెనుదిరిగినవెన్నో**

వైకాపా ఐదేళ్ల పాలనలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోగా జియో, విన్‌టెక్, ఎయిల్‌డిక్సన్, ఫాక్స్‌లింక్ వంటి కొన్ని ప్లాంట్‌లు వెనుదిరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు సమీపంలో అపాచీ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏపీఐఐసీకి కేటాయించి భూములు బీడు భూములగానే దర్శనమిస్తున్నాయి.

# బె'ధర'గొడుతున్నారు

చిత్తూరు : వ్యవసాయ శాఖలో అన్నదాతకు వ్యక్తిగత యంత్ర పరికరాలు అందించే యాంత్రీకరణ పథకం ఐదేళ్ల తరవాత అమల్లోకి వచ్చింది. కొన్ని పరికరాలపై 50శాతం.. మరికొన్నింటికి నిర్దేశిత మొత్తాన్ని రాయితీగా నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే వీటి ధరలు ఎక్కువగా నిర్ణయించడం గమనార్హం.. తైవాన్ స్ప్రేయర్‌నే పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖ ప్రైవేటు కన్నా రూ.4,132 అధికంగా నిర్ణయించింది. ఇదే స్ప్రేయరుకు ఉద్యానశాఖ రూ.10 వేలు రాయితీ ఇస్తుండగా రైతులు రూ.23 వేలకే కొనుగోలు చేసి బిల్లులు సమర్పిస్తున్నారు.

**తగ్గిపోతున్న సాయం..**

వ్యవసాయ శాఖ సీలింగ్ నిర్ణయించడం వల్ల అన్ని పరికరాలపై 50 శాతం రాయితీ అందడం లేదు. పైకా కొన్నింటి ధరలను అధికంగా



పేర్కొనడంతో రైతుకు వాస్తవంగా దక్కే ఆర్థిక ప్రయోజనం 25 నుంచి 30 శాతమే ఉంటోంది. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన మేరకు అన్నదాతకు లబ్ధి చేకూరడం లేదు. ఉద్యానశాఖలో అమలవుతున్న యాంత్రీకరణ పథకం వారికి మేలు చేసేలా ఉంది. ఎందుకంటే రైతులే స్వయంగా బేరమాడి కొనుగోలు చేసి బిల్లులు పెడుతుంటే అధికారులు రాయితీ జమ చేస్తున్నారు. సాధారణంగా ఒక్క పరికరాన్నే కొనుగోలు చేసే రైతు బాగా బేరమాడితే వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. అలాంటిది రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో పరికరాలు కొనుగోలు చేసినప్పుడు ధర ఇంకా తగ్గాల్సి ఉంది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

**పెరిగింది ఇందుకేనంటా..**

నోడల్ ఏజెన్సీగా ఉన్న ఆగ్రోస్‌కు 2శాతం కమీషన్, జీఎస్టీ కారణంగా ధరలు పెరిగాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులు యంత్రాలు సరఫరా చేసిన కంపెనీలకు రాయితీ సొమ్ము జమ చేసేందుకు 3-4 నెలలు సమయం పడుతుండటంతో ఆయా కంపెనీల ధరలు ఐదు నుంచి 10 శాతం అధికంగా ఉన్నాయని మరికొందరు అధికారులు పేర్కొంటున్నారు.

**అంతంత మాత్రంగానే దరఖాస్తులు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యంత్రీకరణ పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు ప్రభుత్వం ఈ నెల మూడో తేదీన ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలకు లక్ష్యాలను కేటాయించి జిల్లా వ్యవసాయాధికారులకు పంపింది. 24 రోజులు గడిచినా ఉమ్మడి జిల్లాలో కేవలం 1,208 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక మూడు రోజులే గడువు ఉందని ఈలోగా రైతులు దరఖాస్తు చేసుకుని నాన్ సబ్సిడీ చెల్లించిన వారికి ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆగ్రోస్ జిల్లా మేనేజరు శశిచంద్రమౌళిరెడ్డి తెలిపారు.

# మిగిలిందా.. మింగేస్తారు!!



విశాఖపట్నం : మధురవాడ పరిధిలోని లే-అవుట్లు, కాలనీల్లో మిగులు భూములను మింగేస్తున్నారు. సామాజిక అవసరాల కోసం రికార్డుల్లో 'ఓపెన్ స్పేస్' స్థలాలుగా ఉన్నా...నకిలీ పత్రాలు సృష్టించి భూబకాసురులు కబ్జా పర్వం సాగిస్తున్నారు. రెవెన్యూ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, మిథిలాపురి వుడా కాలనీ, సాగర్ నగర్ శాంతినికేతన్ లే-అవుట్ పరిధిలో రూ.కోట్ల విలువైన భూములు దర్జాగా ఆక్రమించేశారు.

**వైకాపా నాయకుల గుప్పిట్లో..**

రెవెన్యూ కాలనీలో సర్వే నెంబరు 292లో గెడ్డ పక్కన లే-అవుట్లో సుమారు 300 గజాల మిగులు భూమి ఉంది. లేఅవుట్ మ్యాప్‌లోనూ అలానే చూపిస్తోంది. అయితే 'వుడా' నుంచి కొనుగోలు చేసినట్లు కొందరు వైకాపా నాయకులు పత్రాలు సృష్టించారన్న ఆరోపణలున్నాయి. దీని విలువ రూ.3 కోట్లు పైమాటే. ఇదే సర్వే నెంబరులో గెడ్డకు చేరువగా రూ.1.50కోట్ల విలువైన 200 గజాల మిగులు స్థలంలో స్థానికంగా ఉన్న ఓ వైకాపా నాయకుడు రేకుల షెడ్లు నిర్మిస్తే తొలగించారేకానీ, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు.

**జీవీఎంసీ అధికారుల ఉదాసీనత..**

ఎన్జీఓస్ కాలనీ ఫేజ్-2 సర్వే నెంబరు 175లో గెడ్డకు ఇరువైపులా పార్కు నిర్మాణం కోసం ఖాళీ స్థలం వదలిపెట్టారు. వైకాపా నాయకుల అండదండలతో పక్కనే ఉన్న ఓ జిరాయితీ స్థల యజమాని దాదాపు రూ.1.5 కోట్ల విలువైన 250 గజాల స్థలం ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కళ్లముందే ఆక్రమణలు గుర్తించినా చర్యలు తీసుకోలేదు. ఇదే కాలనీలో మరోచోట ఎంవీవీ ఓజోన్ అపార్టుమెంట్ వెనుక రూ.3.5 కోట్లు విలువ చేసే సుమారు 500 గజాలకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇక్కడ నిర్మించిన భవనం, రేకుల షెడ్డుకు జీవీఎంసీ పన్నులు వేయడం, విద్యుత్తు సదుపాయం కల్పించడం గమనార్హం. ఈ లేఅవుట్లో మిగులు స్థలాల కబ్జాపై నెల రోజుల క్రితం రెవెన్యూ అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు సమాచారమిచ్చినా స్పందించలేదు. ఈ వ్యవహారం వెనుక వైకాపా నేత, మాజీ మంత్రి హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

సాగర్‌నగర్ బీచ్ రోడ్డులోని తుపాన్ రక్షిత భవనం వెనుకనున్న శాంతినికేతన్ లేఅవుట్లో సుమారు రూ.3 కోట్లు విలువ చేసే 400 గజాల పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. దీనికి నకిలీ పత్రాలు సృష్టించి ఇప్పటికే విక్రయాలు జరిపి ప్రహరీ నిర్మించినట్లు తెలుస్తోంది. లేఅవుట్ మ్యాప్ ప్రకారం పార్కు స్థలంగా చూపిస్తున్నా, జీవీఎంసీ అధికారులు వీఎల్‌టీ పన్ను కట్టించుకుని కబ్జాదారులకు వంతపాడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ పార్కు ఆక్రమణ వెనుక ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఓ వైకాపా నాయకుడి అనుచరుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది.

**అలా అమ్మకాలు..**

మిథిలాపురి వుడా కాలనీ లేఅవుట్కి సంబంధించి కమర్షియల్ స్పేస్ కోసం విడిచి పెట్టిన భూమి పక్కనే సుమారు 700 గజాల మిగులు స్థలం ఉంది. దీనిపై కన్నేసిన కొందరు వ్యక్తులు ఇటీవల అక్కడ పిచ్చిమొక్కలు తొలగించారు. రూ.5కోట్ల విలువైన ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయానికి తెరతీశారు. స్థలానికి సమీపంలో గెడ్డను భవన నిర్మాణ వ్యర్థాలతో కప్పి కొన్ని రేకుల షెడ్లు నిర్మించి 500 గజాలకు పైగా భూమిని కబ్జా చేశారు. నకిలీ పత్రాలతో మరికొంత ఆక్రమణకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ భూమి విలువ రూ.10కోట్లకుపైగా ఉంటుంది.

# నాటి దూకుడు నేడేమైంది..?




అనకాపల్లి : నాడు.. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడి ఇంటి నిర్మాణంలో జలవనరుల శాఖకు చెందిన రెండు సెంట్ల స్థలం కలిసిందని స్పందనలో ఫిర్యాదు వచ్చింది. దానిపై అధికారులు హడావుడి చేశారు. కేసులు పెట్టి వందల సంఖ్యలో పోలీసులను ఇంటికి పంపి నిర్మాణాన్ని కూలగొట్టే ప్రయత్నం చేశారు. తమకు సంబంధిత శాఖ నుంచి ఎన్వోసీ ఉందని చెప్పినా వినలేదు. అది నకిలీదంటూ అయ్యన్నను అర్ధరాత్రి అరెస్టు చేసేవరకు అప్పటి సర్కారు పెద్దలు నిద్రపోలేదు. నేడు.. కశింకోట మండలం విస్సన్నపేటలో వైకాపా నేతలు తమ బినామీల పేరిట భారీ లేఅవుట్ వేశారు. అందులో కొండ గెడ్డలు, ప్రభుత్వ భూములు కొంతమేర కలిపేశారని గత ప్రభుత్వంలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారంలో అక్రమాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇదివరకే జనసేన నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ ఆ ఫిర్యాదును పట్టించుకోనేలేదు. ఇదీ నేటి అధికారుల మెతక వైఖరి తీరు. తాజాగా మరోసారి ఆ పార్టీ నాయకుడొకరు ఆ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశారు.

గత ప్రభుత్వంలో నేతలు ఆదేశిస్తే చాలు అధికారులు దూకుడు చూపేవారు. బుల్డోజర్లు తీసుకెళ్లి మరీ నిర్మాణాలు నేలమట్టం చేసేవారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఫిర్యాదులు చేసినా అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇందుకు విస్సన్నపేట భూముల వ్యవహారమే ఉదాహరణ. నాటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అతని ప్రధాన అనుచరుడు బొడ్డేటిడ ప్రసాద్ కనుసన్నల్లోనే ఈ లేఅవుట్ వ్యవహారాలు నడిచాయి. అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి అనుచరుడు ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి ఇక్కడ 55 ఎకరాలపైగా భూములు కొనుగోలు చేశారు. 609 ఎకరాల్లో భారీ లేఅవుట్ వేశారు. దీనికోసం పది అడుగులున్న గోర్జిని వంద అడుగుల రహదారిగా విస్తరించారు. పక్కనే ఉన్న కొండను తొలిచేశారు. కొండగెడ్డలను కప్పేశారు. అసైన్డ్ భూములను ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదు వచ్చాక అప్పటి ఆర్‌డీవో సీతారామారావు విచారణ జరిపారు. సుమారు పదెకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. చర్యలైతే తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలో నాటి నేతల అక్రమాలను పూర్తిస్థాయిలో వెలికి తీస్తారని ఆశించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటారని భావించారు. ఫిర్యాదు వచ్చి పదినెలలైనా అధికారులైతే ఆ దిశగా అడుగులు వేయడమే లేదు. అప్పట్లో హడావుడి చేసిన కూటమి పెద్దలు కూడా మౌనం దాల్చడం వెనుక వారితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

**సా..గుతున్న విజిలెన్స్ విచారణ..**

కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత గత ప్రభుత్వంలో భూముల వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. అందులో భాగంగా విస్సన్నపేట లేఅవుట్‌పైనా విచారణ చేస్తున్నారు. అయితే భూ రికార్డులు సక్రమంగా లేకపోవడం, కొండలు కరిగించినా వాటిని ఎక్కడికి, ఎంత పరిమాణంలో తరలించారనే వివరాలు దొరక్కపోవడంతో కాలయాపన జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో విచారణ చేపట్టిన ఆర్డీవో నివేదిక సైతం ఇప్పటి వరకు వెలుగుచూడలేదు. ఈ భూముల వ్యవహారంలోనే సస్పెన్షన్‌కు గురైన అధికారిని ఆర్డీవో కార్యాలయంలోని కీలక పోస్టులో పెట్టారు. ఆయన హయాంలో జరిగిన అక్రమాల వివరాలు ఇప్పుడు ఆయన్ని దాటి బయటకు వస్తాయా అన్నది ఫిర్యాదుదారుల అనుమానం.

# సర్కారీ భూముల్లో సౌర కుసుమాలు



అనకాపల్లి : వ్యవసాయ కనెక్షన్లకు అవసరమైన విద్యుత్తును పూర్తిగా సోలార్ ద్వారానే ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవన్ ఉద్ధాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) ద్వారా వ్యవసాయ ఫీడర్లన్నింటినీ సోలరైజేషన్ చేయబోతున్నారు. ఇందులో భాగంగా జలవనరుల శాఖకు సంబంధించిన పంట కాల్వలపైనా, ప్రభుత్వ భూముల్లో సౌర విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. దీనివల్ల భూముల ఆక్రమణలకు చెక్‌పెట్టడంతో పాటు సంబంధిత శాఖలకు ఆదాయం రానుంది. ఈపీడీసీఎల్ పరిధిలోని అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో సుమారు 358 ఎకరాల్లో సౌర పలకలు ఏర్పాటు చేయడానికి ఇటీవల టెండర్లు పిలిచారు.ఎకరాకి రూ.31వేల చొప్పున.. ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయి. వాటిని కాపాడుకోవడమే పెద్ద సవాల్‌గా మారింది. వాటిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం ఇవ్వడం వల్ల ఆక్రమణల నుంచి రక్షణ ఏర్పడుతుంది. నర్సీపట్నం నియోజకవర్గంలో 90 ఎకరాల దేవాదాయ భూములతో పాటు రాంబిల్లి, మాకవరపాలెం, భీమిలి, ఆనందపురం మండలాల్లో ప్రభుత్వ భూములను ఈ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధిత శాఖలకు విద్యుత్తు సంస్థ లేఖలు రాసింది. వీటి ద్వారా ఆయా శాఖలకు లీజు రూపంలో ఎకరాకు రూ.31వేల చొప్పున ఆదాయం సమకూరుతుంది.

కాలువ గట్టుపై కాసుల పంట.. జిల్లాలో పోలవరం ఎడమ కాలువ ఉంది. పాయకరావుపేట నుంచి కశింకోట మండలం వరకు ఈ కాలువ ఇరువైపులా సోలార్ పలకలు ఏర్పాటు చేయడానికి 123 ఎకరాలను గుర్తించారు. జలవనరుల శాఖకు ఏడాదికి రూ.31 వేల చొప్పున ఎకరాకి లీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రెండేళ్లకు 5 శాతం లీజు పెంచుతుండాలి. 25 ఏళ్లు పాటు ఈ లీజు ఒప్పందం కొనసాగనుంది.

# రాకుంటే అడగొచ్చు.. రాయితీ పొందొచ్చు

రాజాం : పేదలకు అందిస్తున్న తొలి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకే గడువుంది. దీపం పథకం అర్హులు ఇంకా మిగిలి ఉంటే సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రతి ఆర్థిక సంవత్సరంలో మూడు అందించాలని నిర్ణయించింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవుతుండడంతో అప్పట్లోగా బుక్ చేసుకోకపోతే తొలి ఏడాది లబ్ధికి దూరం అవుతారు. బుకింగ్ చేసుకున్న 24 గంటల్లో పట్టణ ప్రాంతాలకు, 48 గంటల్లో గ్రామీణ ప్రాంతాలకు అందిస్తున్నారు. లబ్ధిదారులు నగదు చెల్లించి బండను తీసుకున్న 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో జమ చేస్తున్నారు.

**తప్పిదాలు దిద్దుకోండి**



గ్యాస్ సిలిండర్ తీసుకున్నా.. సాంకేతిక సమస్యలు, లబ్ధిదారుల వివరాల నమోదులో తప్పిదాలతో కొందరికి రాయితీ జమ కావడం లేదు. ఎందుకు రావట్లేదో పౌర సరఫరాల అధికారులు, గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించి తెలుసుకోవచ్చు. ఆధార్ నంబరు మనుగడలో లేకపోవడం, బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం కాకపోవడం, బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడం, లబ్ధిదారుడు చనిపోవడం, సరైన బ్యాంకు ఖాతా నంబరు నమోదు చేసుకోకపోవడం, ఈకేవైసీ డాక్యుమెంట్లు పెండింగ్ ఉండడం, తదితర కారణాలతో చాలా మంది జిల్లాలో లబ్ధి పొందలేకపోయారు.

ముందుకు రావాలి: అర్హులంతా దీపం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇంకా మిగిలి ఉంటే బుక్ చేసుకోవాలి. సాంకేతిక సమస్యలుండి లబ్ధి బ్యాంకు ఖాతాలో జమకాకపోతే సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి సరిదిద్దుకోవాలి.

మధుసూదనరావు, డీఎస్‌వో

అందించిన సిలిండర్లు: 4,46,846

అందులో రాయితీ పొందినవి : 4,42,394

ఆ మొత్తం మంజూరు: రూ.32.63 కోట్లు

బ్యాంకులో రాయితీ జమైన బండలు: 4,40,373

ఖాతాలో జమైన సొమ్ము: రూ.32.49 కోట్లు

# ఉంటే ఎక్కువ.. లేకుంటే తక్కువ

విజయనగరం : వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అయిదేళ్లు పారిశ్రామిక రంగం కుదేలైంది. కూటమి ప్రభుత్వం ఈ రంగమే ప్రగతిలో కీలకం కానుందని, అధిక సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించి చిన్న పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏపీఐఐసీ ద్వారా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు మహిళలను ఆహ్వానిస్తున్నారు.



గత పాలనలో ప్రభుత్వ స్థలాలను భవనాల నిర్మాణం, కాలనీ లేఅవుట్లకు సేకరించడంతో ప్రస్తుతం పాతిక ఎకరాలు ఒకే చోట ఎక్కడ ఉందా అని రెవెన్యూ అధికారులు అన్వేషిస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఏడు, మన్యం జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. కొని చోట్ల వందల ఎకరాలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల పది ఎకరాలు కూడా లేదు. ఆయా ప్రాంతాల్లో డి-పట్టా భూముల సేకరణకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన వాటిని ఏపీఐఐసీకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గుర్తింపు దశ దాటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని పరిశ్రమల శాఖ అధికారులు అంటున్నారు.

# ఎర్రకాలువ పరిధిలో రైతులకు ఊరట

నిడదవోలు : గతేడాది జులై నెలలో కురిసిన భారీ వర్షాలకు నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో ఎర్రకాలువ పొంగి పంట పొలాలను ముంచెత్తి రైతులకు తీవ్ర నష్టం మిగిల్చిన విషయం తెలిసిందే. ఆ కష్టం నుంచి నిడదవోలు, ఉండ్రాజవరం, నల్లజర్ల, దేవరపల్లి మండలాలకు చెందిన రైతులు ఇంకా తేరుకోలేదు. ఆయా మండలాల్లో ఎర్రకాలువ వరదలకు సుమారు 14 వేల ఎకరాల్లో 4,500 మంది రైతులకు చెందిన వరి, చెరకు, ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి. గత వైకాపా పాలనలో కాలువ నిర్వహణకు కనీస పనులను చేపట్టకపోవడంతో ఎర్రకాలువ పొంగిన సందర్భంలో గట్లకు గండ్లు పడి పంటచేలను ముంచెత్తింది. ఆ సమయంలో రైతులను ఓదార్చేందుకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఆ మేరకు మంత్రి దుర్గేష్ పలు సందర్భాల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఉత్పాదక రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం, ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలోనూ ఈ విషయం ప్రస్తావనకు రావడతో సీఎం స్పందించి ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్థికశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. పూర్తిగా వరిపంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.17 వేలు నష్టపరిహారం అందించనున్నారు. ఈ సొమ్ము అందితే తమ కష్టాలు కొంత వరకు తీరుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నిడదవోలు మండలంలోనే అధిక నష్టం...**

ఎర్రకాలువ వరద ప్రభావం నిడదవోలు మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, ఉనకరమిల్లి, కంసాలిపాలెం, రావిమెట్ల, శంకరాపురం, సింగవరం, నిడదవోలు, తాళ్లపాలెం, శెట్టిపేట గ్రామాలపైనే ఎక్కువగా ఉంటుంది. వీటిలో సింగవరం, తాళ్లపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో మరింత అధికం. ఒక్క సింగవరంలోనే 575 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లింది. నిడదవోలులో 359, శంకరాపురంలో 145, శెట్టిపేటలో 396 హెక్టార్లలో నష్టపోయారు. ఉండ్రాజవరం మండలం కాల్దారి, సూర్యారావుపాలెం, పసలపూడి, దేవరపల్లి మండలం త్యాజంపూడి, నల్లజర్ల మండలంలో గుండేపల్లి, తెలికిచర్ల, అనంతపల్లి, నబీపేట, చోడవరం, పోతవరంలో ప్రభావం చూపుతుంది.

## అందని అదనపు పౌష్టికాహారం

అనంతపురం : ఐసీడీఎస్‌లో పౌష్టికాహార పంపిణీ బాగోతంలో ప్రతినెలా ఏదొక సమస్య ఉత్పన్నమవుతోంది. అధికార యంత్రాంగం గాడిలో పెట్టడానికి శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత నెలకు సంబంధించి గర్భిణి, బాలింతలకు అందజేయాల్సిన అదనపు పౌష్టికాహారం(కిట్లు) పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. నాలుగు రోజుల్లో మార్చి నెల పూర్తి కానుంది. అందులో రెండు రోజులు సెలవులు ఉన్నాయి. శుక్ర, శనివారాల్లో వంద శాతం కిట్ల సరఫరా అసాధ్యమే. కిట్ల గుత్తేదారు ప్రతి నెలా నిర్లక్ష్యం ప్రదర్శించినా ఐసీడీఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 10న కొత్త పీడీ నాగమణి బాధ్యతలు స్వీకరించినా పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. ఇప్పటికీ నాలుగు ప్రాజెక్టులకు కిట్ల సరఫరా ఆగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ




లేనివిధంగా అనంత గర్భిణి/బాలింతల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంది. ఈ మహమ్మారి బారిన నుంచి గట్టెక్కించడానికే ఐదు రకాలతో కూడిన అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఏ నెలలోనూ సకాలంలో పంపిణీ చేయని దుస్థితి నెలకుంది.

**అరకొరే..**ప్రతి నెలా అదనపు పౌష్టికాహారం(కిట్టు) కింద ఐదు రకాల సరకులు ఇస్తారు. అటుకులు కిలో, రాగిపిండి 2 కిలోలు, బెల్లం, చిక్కీ, ఖర్జూరం 250 గ్రాముల చొప్పున ఇవ్వాలి. ప్రతి నెలా మొదటి వారంలోనే ఇంటింటా పంపిణీ(టీహెచ్ఆర్) కార్యక్రమం కింద అందించాలి. గర్భిణి/బాలింత కిట్టును నెలంతా వినియోగించాలి. జిల్లాలోని ఐదు ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో అందలేదు. కొన్ని ప్రాజెక్టులకు ఒక నెలలో ఇవ్వాల్సిన కిట్లను తరువాత నెల్లో పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా ఐసీడీఎస్ అధికారులు ఏమాత్రం చర్యలకు ఉపక్రమించలేదు.

## పదోన్నతులు సరే.. ఖాళీల భర్తీ ఏదీ?

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే గ్రామ పట్టుపరిశ్రమ సహాయకులను(వీఎస్‌ఏ), సాంతికేక సహాయకులుగా(టీఏ) పదోన్నతి కల్పించారు. దీంతో వారందరిని రిలీవ్ చేయడంతో విధుల్లో చేరారు. వారి స్థానంలో గ్రామస్థాయి సహాయకులను ఇంతవరకు నియమించలేదు. కనీసం మండలస్థాయి అధికారులకు భవనాలు స్వాధీనం చేయలేదు. దీంతో 69 రైతు సేవా కేంద్రాలు మూతపడ్డాయి. రైతులకు అందించే సేవలు స్తంభించాయి. రైతులు, పశుపోషకులు, కాపర్లు కేంద్రాలు చుట్టు తిరుగుతున్నారు. కనీసం సమాచారం చెప్పే నాథుడే లేరని వాపోతున్నారు. ప్రస్తుతం కొన్ని కేంద్రాల్లో రైతులకు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియతో పాటు యాంత్రికీకరణ పథకం అమలుకు దరఖాస్తు స్వీకరిస్తున్నారు. ఈనెలాఖరులో రెండు కార్యక్రమాలు పూర్తి చేయాలని




ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈక్రమంలో పలుచోట్ల తెరుచుకోకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 54, అనంతపురం జిల్లాలో 15 కేంద్రాలు తెరుచుకోవడం లేదు.

**ఇళ్లలో టెలివిజన్లు..**

పదోన్నతి పొందిన వారు రిలీవ్ అయితే మండల అధికారులకు కేంద్రాలను అప్పగించాలి. అదేదీ లేకుండా కేంద్రాలకు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో టెలివిజన్, ట్యాబు, డివైజర్, రెండు టేబుళ్లు, 15 కుర్చీలు, రెండు ర్యాకులు చొప్పున పంపిణీ చేశారు. టీవీలు, కుర్చీలు సిబ్బంది ఇళ్లలో పెట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాన్ని జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అధికారి ఆంజినేయులు దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

## నీరు పారదు.. పంట తడవదు



గుత్తి: గుత్తి మండలంలోని సేవాఘడ్ వద్ద ఉన్న చెండ్రాయిని కుంట సాగునీటి కాలువ శిథిలావస్థకు చేరుకుంది. ముళ్లపొదలతో నిండి సాగునీరు ముందుకు పారడం లేదు. దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదు. కొన్ని చోట్ల కాలువ పూర్తి శిథిలమై రాళు తేలాయి. సుమారు 5 వేలకు పైగా ఆయకట్టు ఉన్న చెండ్రాయిని కుంట రిజర్వాయర్ కాలువలకు కనీసం మరమ్మతులు, ముళ్లపొదలు తొలగించలేరా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉండగా రిజర్వాయర్ నీటిని బయటకు పంపే షెల్టర్ మరమ్మతులకు గురై గత రెండేళ్ల నుంచి సాగునీరు వృథా పోతోందని రైతులు తెలిపారు. రిజర్వాయర్‌కు మరమ్మతులు చేసి సాగునీరు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన ఉందని రైతులు విన్నవిస్తున్నారు.

## పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయ్..



అనంతపురం: కనీస అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలుపై ప్రకటనలు గుప్పిస్తున్నారు. ప్లాటు కొంటే ఉచిత రిజిస్ట్రేషన్‌తో పాటు బంగారు నాణెం, ద్విచక్ర వాహనం బహుమతిగా ఇస్తామంటూ ఆకర్షిస్తున్నారు. దీంతో చాలామంది అవగాహన లేకుండా ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా అహుడా అధికారులు పట్టించుకోవడం లేదు. విమర్శలు వచ్చిన సందర్భాల్లో కొన్ని లేఅవుట్లలో రాళ్లు తొలగిస్తున్నారు. మళ్లీ రెండు రోజులకే సదరు నిర్వాహకులు కొత్త రాళ్లు పాతి యథేచ్ఛగా ప్లాట్ల అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

**నిబంధనలు గాలికి..**

ఉమ్మడి అనంత జిల్లాలోని 993 పంచాయతీల్లో అహుడా (అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) విస్తరించి ఉంది. పంచాయతీ ఏర్పాటు చేసే లేఅవుట్లకు అహుడా అనుమతులు తప్పనిసరి. 10 శాతం భవిష్యత్తు అవసరాలకు కేటాయించాలి. ప్రాంతాన్ని బట్టి 33, 60 అడుగుల రోడ్లు ఏర్పాటు చేయాలి. లేఅవుట్‌లో 30 నుంచి 40 శాతం భూమిని వదులుకోవాల్సి వస్తుందని అనుమతులు తీసుకోవడం లేదు. అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి ప్లాట్లు కట్టబెడున్నారు. ఇలా అహుడా పరిధిలో సుమారు 2,400 లేఅవుట్లకు అనుమతులు లేవు. ప్రస్తుతం ఇరు జిల్లాల్లో 280 లేఅవుట్లకు మాత్రమే అనుకూలంగా ఉన్నాయి.

**మామూళ్ల మత్తులో..**

అనధికార లేఅవుట్లపై అహుడా ఎప్పటికప్పుడు పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులకు నివేదికలు పంపించాలి. దీంతోపాటు అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వివరాలు ఇవ్వాలి. నోటీసులకు స్పందించని వారి లేఅవుట్లను ధ్వంసం చేయాలి. ఇటీవల అనంతపురం గ్రామీణం, రాప్తాడు, మామిళ్లపల్లి ప్రాంతాల్లో 14 లేఅవుట్లను అధికారులు ధ్వంసం చేశారు. కొందరు మళ్లీ కొత్తగా రాళ్లు పాతి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం-శివనారాయణశర్మ, అహుడా వైస్ చైర్మన్**

అహుడా పరిధిలో అనుమతులు లేని లేఅవుట్లను గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. ఇటీవల కొన్ని లేఅవుట్లలో రాళ్లను తొలగించాం. త్వరలోనే పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

## తిర'కాసు'లెన్నో!



అనంతపురం : అనంతపురం నగర డంపింగ్ యార్డులో చెత్తతరలింపు అవినీతి కంపుగా మారింది. వైకాపా ప్రభుత్వ హయాంలో చెత్త తరలింపు పూర్తి కాకుండానే రూ.కోట్లు నగదు చేతులు మారింది.. 40 సంవత్సరాలుగా పేరుకున్న చెత్తగుట్టలను ప్రాసెసింగ్ చేసి తరలించామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు భిన్నం. పూర్తిగా తొలగింపు చేపట్టలేదన్నది స్పష్టం. ఈలోగా కొత్త చెత్త వెల్లువలా రావడంతో దాన్ని ఆ గుట్టలోనే కలిపేసి ప్రాసెసింగ్ పూర్తయిందని చెప్పి బిల్లులు నొక్కేశారు. చెత్తను ప్రాసెసింగ్ చేశామని లెక్కలు చూపగానే అధికార యంత్రాంగం సంతకాలు చేసేశారు. ప్రాసెసింగ్ కాలేదని అప్పుడు అడ్డు చెప్పకుండా వైకాపా మాజీ ముఖ్యనేత అండతో బిల్లుల చెల్లింపు సాగించేశారు. కాకి లెక్కలు చూపి తెరవెనుక మంత్రాంగం ఆయనే నెరిపారని డంపింగ్ యార్డులో భారీగా అవినీతి జరిగిందని, కీలకమైన వారికి కమిషన్లు దక్కడం వల్లే అవినీతి గుట్టు వెలికి రాలేదని.. ఆ పార్టీకి చెందిన నగరపాలకలోని రెండో కీలక ప్రజాప్రతినిధి కౌన్సిల్ సమావేశాల్లో పలుసార్లు ప్రస్తావించారు. ఇటీవల జరిగిన నగరపాలక కౌన్సిల్ సమావేశంలో సైతం గట్టిగా వాదన విన్పించినా విచారణ జోలికి వెళ్లడం లేదు.

**వైకాపా కీలక నేత అండ**

చెత్తను ప్రాసెసింగ్ చేయకుండానే పూర్తి చేశామని బిల్లులు కాజేశాక.. కొత్త తంతు మొదలైంది. టెండరు మాకే దక్కుతుందన్న ధీమాతో యంత్రాలను అక్కడే ఉంచారు. పెద్దయెత్తున దుమారం రేగగానే యంత్రాలను వెనక్కి పంపారు. పాలక వర్గానికి చెప్పకుండా, గుట్టుచప్పుడు కాకుండా బయోమైనింగ్ ఎలా చేస్తారని అప్పట్లోనే కౌన్సిల్ సమావేశంలో వైకాపా నాయకులు తప్పుబట్టారు. అధికార యంత్రాంగం అంతా వైకాపా ముఖ్యనేత చెప్పినట్లు చేయడంతో చెల్లింపులు సాగుతూ వచ్చాయి. ఎంత తరలించారు, ఎంత బిల్లు చెల్లించారు అన్న వివరాలను వెలికితీస్తే అవినీతి డొంక కదులుతుంది.

**విచారణ.. కాలయాపన!**

విచారణ పేరుతో కలెక్టరు సైతం జాప్యం చేస్తుండటంతో అవినీతి లెక్కలు తేలలేదు. విచారణ వెంటనే చేయాలని గత సంవత్సరం జులైలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఫిర్యాదు చేశారు. అప్పటి జేసీ కేతన్‌గార్గ్‌ను విచారణ అధికారిగా నియమించారు. తర్వాత ఆయన బదిలీపై వెళ్లారు. విచారణకు కమిటీ వేసి ఇప్పటికే ఆరునెలలు అవుతోంది. అది ఏమైందో అంతుచిక్కని అంశంగా మారింది.

## నవధాన్యం.. భూమికి సారం



చిత్తూరు : మోతాదుకు మించి రసాయనాల వినియోగంతో నేల నిర్జీవంగా మారుతోంది.. దీంతో వ్యయం పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయి.. సాగు గిట్టుబాటు కాక రైతులు కాడి పడేస్తున్నారు.. ఈ పరిస్థితుల్లో నేలకు పునరుజ్జీవం కల్పించి సహజ శక్తిని పెంపొందించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.. తక్కువ పెట్టుబడితో ప్రకృతి విధానంలో పంటల సాగు ప్రోత్సహిస్తున్నారు.. ఇందులో భాగంగా నవ ధాన్యాలు అందజేసి ప్రకృతి సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

ఖరీఫ్ సీజన్‌కు ముందే వేసవిలో సుమారు లక్ష మంది రైతులతో 85 వేల ఎకరాల్లో నవధాన్యాల విత్తనాలు వేయించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. గతేడాది 80 వేల ఎకరాల్లో వీటిని సాగు చేశారు. రుతుపవనాలు రాకముందే పొడి నేలలో వేయనున్నారు. పొలం సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు ఎంతో ఉపయోగపడనున్నాయి.

**35 రకాల విత్తనాలు..**

నవధాన్యాల కిట్లలో జొన్న, మొక్కజొన్న, కందులు, పెసలు, వేరుసెనగ, పొద్దుతిరుగుడు, ధనియాలు, మెంతులు, ఆవాలు, జీలుగలు, జనుము, పిల్లిపెసర, ఆకుకూరలు, ఉలవలు, అలసంద, మినుములు, కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు, నువ్వులు, వరి, తీగ, దుంపజాతికి చెందిన 35 రకాల విత్తనాలతో ఓ కిట్ రూపొందించారు. ఒక్కో దాంట్లో 15 కిలోల చొప్పున అన్ని రకాల విత్తనాలు ఉంటాయి. వీటిని వేసవిలో ప్రధాన పంట వేసే ముందుగా రైతులకు పంపిణీ చేస్తారు. కిట్ల తయారీ దాదాపు పూర్తయింది, త్వరలో రైతులకు అందజేయనున్నారు.

**జిల్లా వివరాలు..**

సాగు లక్ష్యం: 85 వేల ఎకరాలు

నవధాన్యాల కిట్లు: 83 వేలు

ఎన్నో ప్రయోజనాలు30 రకాల విత్తనాలను పచ్చిరొట్ట ఎరువులుగా సాగు చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. నేలలో కర్బన శాతం పెరుగుతుంది. కలియదున్నడం వల్ల భూసారానికి లోపం ఉండదు. ప్రధాన పంటకు రసాయన ఎరువుల భారంతో పాటు కలుపు బెడద, చీడపీడల ఉద్ధృతి తగ్గుతుంది. నేలలో నీటి సామర్థ్యం పెరిగి, వానపాముల సంఖ్య వృద్ధి చెందుతుంది. స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలను అధిగమించొచ్చు. త్వరలో కిట్లు అందజేయనున్నాం.వాసు, జిల్లా పథక మేనేజరు, ప్రకృతి వ్యవసాయ విభాగం

## నత్తనడకన.. 'నవీకరణ'..!

విశాఖపట్నం : విశాఖ చేపలరేవులో చేపడుతున్న నవీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో జాప్యం కారణంగా ఆయా పరిసరాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కీలకమైన జెట్టీల ఆధునికీకరణ, ఫింగర్ జెట్టీ, డ్రై డాక్ పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.

విశాఖ పోర్టు నిధులు రూ.150 కోట్లతో చేపట్టిన పనులకు 2023 ఆగస్టులో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. ఆ ఏడాది నవంబరులో ప్రారంభించిన పనులను 2024 నవంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ముందుకు సాగలేదు. ఆ తర్వాత 2025 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని భావించినా... ఆ దిశగా అడుగులు ముందుకు పడడం లేదు. చేపలరేవు ఆవరణలో వివిధ అవసరాల కోసం నిర్మించిన భవనాల పనులు మాత్రం తుది దశకు చేరాయి.

**రాబోయే రెండు నెలల్లో..**ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు చేపలవేటపై నిషేధం ఉంటుంది. ఆ సమయంలోనే జెట్టీల నవీకరణ పనులు చేపట్టాల్సి ఉంటుంది. కాని ఇప్పటికీ ఆయా పనులు ప్రారంభం కాలేదు. జెట్టీల్లో డ్రెడ్జింగ్ పనులు రెండు విడతల్లో చేయాల్సి ఉండగా, ఇప్పటి ఓ విడత పూర్తి చేశారు.డ్రై డాక్ లేకపోవడంతో బోట్ల మరమ్మతులకు



ఇబ్బందిగా ఉంటోందని బోటు ఆపరేటర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి.. రాబోయే రెండు నెలల్లో పనులను వేగవంతం చేయించాలని మత్స్యకారవర్గాలు కోరుతున్నాయి.

**40 శాతమే పూర్తి**

తొలినాళ్లలో చేపలరేవులో 300 బోట్లు నిలుపుకొనేలా 11 జెట్టీలతో నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు రోజూ వందల టన్నుల మత్స్య సంపద దిగుబడులు, ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 700 మర పడవలు, మరో వెయ్యి ఇంజిన్ బోట్లు ఉన్నాయి. వీటి ద్వారా చేపల వేట సాగుతోంది. ఇక్కడి ఆవరణలో సౌకర్యాల కల్పనకు కేంద్రం, విశాఖ పోర్టు సంయుక్తంగా ముందుకొచ్చాయి. అలా చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు కేవలం 40 శాతం మాత్రమే పూర్తయ్యాయి.

**ఇవీ సదుపాయాలు..!**

సరకు నిల్వకు శీతలీకరణ కేంద్రాలు
రహదారుల అభివృద్ధి
వలల తయారీ కేంద్రం
వాహనాలకు పార్కింగ్
ప్యాకింగ్ వసతి
మురుగు నీటి శుద్ధి కేంద్రం
శుద్ధమైన తాగునీటి వసతి
జెట్టీల నవీకరణ
కొత్తగా ఫింగర్ జెట్టీ ఏర్పాటు
బోట్ల మరమ్మతులకు డ్రైడాక్ నిర్మాణం

## 'జల'సిత్వాలు కూడగట్టుకునేలా!

చిత్తూరు, తిరుపతి: వైకాపా హయాంలో పడకేసిన సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధమైంది. తాజాగా బుధవారం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి అవసరమైన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.పోలవరం ప్రాజెక్టు తర్వాత అత్యధికంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.3,243 కోట్లు కేటాయించి సర్కార్ చిత్తశుద్ధి చాటుకుంది. ఇదే తరహాలో తిరుపతి జిల్లాలో మూడు జలాశయాలు, ఒక చెరువుకు నీళ్లు అందించేందుకు నిధులు విడుదల చేయాలని సీఎం చంద్రబాబును కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. పుంగనూరు నియోజకవర్గంలో పలు రిజర్వాయర్లు, జలాశయాలు నిర్మించారని బాధిత రైతులకు పరిహారం మాత్రం ఇవ్వలేదని ఆ నగదూ మంజూరు చేయాలని చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ విన్నవించారు. త్వరితగతిన రూ.1,154.73 కోట్ల నిధులు విడుదల చేస్తే తిరుపతి జిల్లాలో నిర్మాణాలు పూర్తయి ఇక్కట్లు తొలగుతాయి. పుంగనూరు రైతులకు కష్టాలు తప్పుతాయి.

**రూ.270.13 కోట్లతో ఆల్తూరుపాడు**

వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందించడంలో ఆల్తూరుపాడు రిజర్వాయర్ కీలకం. గుత్తేదారులకు వైకాపా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపేశారు. రూ.270.13 కోట్లతో పరిపాలనా అనుమతులివ్వాలని సీఎం దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. య మల్లెమడుగు జలాశయంలో 2.69 టీఎంసీలు లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశలో ఒక టీఎంసీబీ ఆల్తూరుపాడు, మేర్లపాక జలాశయాలతోపాటు లిఫ్ట్ పనులు చేసేలోగా మిగిలిన సామర్థ్యం మేరకు నింపాలనుకున్నారు. రూ.259 కోట్లకు ప్రతిపాదనలు పంపి.. నిధుల విడుదలకు ఆర్థికశాఖ ఆమోదం కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎంకు తెలిపారు.

**రూ.489.60 కోట్లతో బాలాజీ జలాశయం**


బాలాజీ జలాశయాన్ని పూర్తిచేస్తే తిరుమల, తిరుపతి నగరంలోని ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య ఉండదు. తెదేపా హయాంలో తొలి దశ అటవీ అనుమతులు లభించగా రెండో దశ అనుమతులకు వైకాపా ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయలేదు. ఈ నేపథ్యంలో అనుమతులకు కృషి చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. పనులకు రూ.498.60 కోట్లు అవసరమని నివేదించారు. చంద్రగిరి మండలం మూలపల్లె చెరువుకు నీరందించేందుకు రూ.127 కోట్లు వ్యయమవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**పరిహారం ఇవ్వకుండానే 'పెద్దాయన' పనులు**

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పుంగనూరు నియోజకవర్గంలో రిజర్వాయర్లు, చెరువుల నిర్మాణాలు పూర్తి చేసినా నిర్వాసిత రైతులకు రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదు. వైకాపాలో 'పెద్దాయన'గా ముద్రపడ్డ కీలక ప్రజాప్రతినిధి నియోజకవర్గం కావడంతో అన్నదాతలు నోరెత్తే సాహసం చేయలేదు. సోమల మండలంలోని ఆవులపల్లి, పుంగనూరు మండలంలోని నేతిగుట్లపల్లి, రొంపిచెర్ల మండలంలోని గానుగచింత, సదుం మండలంలో కొర్లగుంటవారిపల్లి, గంటావారిపల్లి, చింతపర్తివారిపల్లి కర్షకులు ఏళ్లుగా పరిహారానికి విన్నవిస్తున్నా ఫలితం లేదు. రూ.96.04 కోట్లు విడుదల చేస్తేనే భూములు కోల్పోయిన రైతులకు ఉపశమనం లభిస్తుంది.

# రకుల్ సొగసు చూడ తరమా..!


రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేనంత బిజీగా సినిమాలు చేసిన విషయం తెల్సిందే. ఈమె కోసం నెలల తరబడి వెయిట్ చేసిన హీరోలు కూడా తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్నారు అంటే అతిశయోక్తి లేదు. అలాంటి స్టార్‌డం దక్కించుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తక్కువ సమయంలోనే టాలీవుడ్‌కి దూరం అయింది. టాలీవుడ్ లో ఆఫర్లు తగ్గడంతో బాలీవుడ్‌లో ప్రయత్నాలు చేసింది. అయితే బాలీవుడ్‌లో వరుసగా ఆఫర్లు దక్కినా లక్ కలిసి రాకపోవడంతో అక్కడ కూడా ప్రస్తుతం పెద్దగా ఆఫర్లు లేవు. అయినా కూడా సోషల్ మీడియాలో ఈమె జోరు తగ్గడం లేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఈమె దే దే ప్యార్ దే 2 సినిమాలో నటిస్తోంది. 2019లో వచ్చిన దే దే ప్యార్ దే సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో సీక్వెల్‌పై అంచనాలు ఉన్నాయి. మొదటి పార్ట్‌లో రకుల్ ప్రీత్ సింగ్‌కి నటిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. అంతే కాకుండా రకుల్ అందాన్ని చూపించేందుకు కూడా స్కోప్ దక్కింది. ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్‌కి పెద్దగా క్రేజ్ లేదు. అయినా కూడా రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియాలో ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవుతూనే ఉంటాయి. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి



ఫిజిక్ ఈమె సొంతం అంటూ ఉంటారు. అందుకే ఈమెను అత్యధికులు అభిమానిస్తూ ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమెకు ఏకంగా 2.5 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్న విషయం తెల్సిందే. తాజాగా ఈమె %ు% సిటీ షోస్టాపర్స్ అనే డిజిటల్ మ్యాగజైన్ కోసం ఫోటో షూట్ ఇచ్చింది. ఆ ఫోటో షూట్‌లో ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రకుల్ సొగసు చూడ తరమా అన్నట్లుగా ఈ ఫోటోలు ఉన్నాయి. అందమైన రకుల్ ప్రీత్ సింగ్ అంతకు మించిన అందమైన ఔట్ ఫిట్ ధరించి, ఒక పెయిటింగ్ మాదిరిగా ఫోజ్ ఇస్తే ఎలా ఉంటుందో అలాగే ఈ ఫోటోలో ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇంతటి అందగత్తెకు టాలీవుడ్‌లో రావాల్సిన ఆఫర్లు రావడం లేదు, దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు అంటూ పలువురు సోషల్ మీడియా ద్వారా అసహనం వ్యక్తం చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ అందాల ఆరబోత కెరీర్ ఆరంభంతో పోల్చితే ఏమాత్రం తగ్గలేదని కూడా కొందరు అభిమానులు కామెంట్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో 2011లో కేరటం సినిమాతో అడుగు పెట్టిన రకుల్ ప్రీత్ సింగ్‌కి 2013లో వచ్చిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌తో మంచి గుర్తింపు లభించింది. సందీప్ కిషన్ హీరోగా నటించిన ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో రకుల్ ప్రీత్ సింగ్ క్రేజ్ అమాతం పెరిగింది. టాలీవుడ్‌లో మహేష్ బాబు, ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్, నాగ చైతన్య, రవితేజ, రామ్, మంచు మనోజ్, గోపీచంద్ వంటి స్టార్స్‌తో సినిమాల్లో నటించింది. కోలీవుడ్‌లోనూ ఈమె పలువురు స్టార్ హీరోలకు జోడీగా నటించి మెప్పించింది. అందం విషయంలో ఏమాత్రం తగ్గని ఈ అమ్మడు ముందు ముందు మళ్లీ ఈ అమ్మడు బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## 'కేజీఎఫ్ -3' లో ఛాన్స్ అడిగిన బ్యూటీ!

'కేజీఎఫ్' ఫ్రాంచైజీ పాన్ ఇండియాలో ఎలాంటి సంచలనాలు నమోదు చేసిందో తెలిసిందే. రెండు భాగాలు భారీ విజయం సాధించి కన్నడ ఇండస్ట్రీ పేరు పాన్ ఇండియాలో మారు మ్రోగించింది. దీంతో యశ్ పాన్ ఇండియా స్టార్ గా మారిపోయాడు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇండియాలో బిజీ డైరెక్టర్ అయిపోయారు. కానీ ఇదే సినిమాలో హీరోయిన్ గా నటించిన కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి మాత్రం ఆ రేంజ్ లో వెలగలేకపోయింది. 'కేజీఎఫ్' తర్వాత మరో ఛాన్స్ అందుకోవడానికి నాలుగేళ్లు పటింది. విక్రమ్ హీరోగా నటించిన 'కోబ్రా'లో నటించింది. అక్కడ నుంచి టాలీవుడ్ కి ప్రమోట్ అవ్వడానికి మరో మూడేళ్లు సమయం పట్టింది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హిట్ ది థర్డ్ కేసు'లో నటిస్తోంది. 'తెలుసు కదా' అనే మరో చిత్రం లోనూ ఛాన్స్ అందుకుంది. ముందుగా 'తెలుసు కదా'లోనే ఛాన్స్ అందుకుంది. ఆ తర్వాతే 'హిట్' లో అవకాశం



వచ్చింది. ఇవన్నీ పక్కనబెడితే 'కేజీఎఫ్ 3' కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. అది ఎప్పుడు ప్రారంభమ వుతుంది? అన్నది తెలియదుకానీ అందులో హీరో యశ్ మాత్రం యధావిధిగా కొనసాగుతాడు. పాత పాత్రలతో పాటు కొన్ని కొత్త పాత్రలు యాడ్ అవుతాయి. ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ మరింత ప్రతిష్టా త్మకంగాను తెరకె క్కిస్తాడు. మరి హీరోయిన్ సంగతేంటి? రెండు భాగాల్లోనూ నటించిందని శ్రీనిధిని తప్పించి కొత్త భామను తీసుకుం టారా? అన్న సందేహం రావడం సహజమే. ఇదే డౌట్ శ్రీనిధికు వచ్చింది. అందుకే ప్రశాంత్ నీల్ ని కలిసిన సమయంలో ఈ విషయం గురించి అడుగుతూనే ఉందిట. ఆ మధ్య ముంబైలో ఓ సినిమా షూట్ సందర్భంగా యశ్ ని కలిసినప్పుడు కూడా ఈ విషయం గురించి సరదాగా అడిగిందిట. కేజీఎఫ్ 2లో నా పాత్రని చంపేసారు. కేజీఎఫ్ 3 ప్లాన్ ఏంటి? అని అడిగా. మరి ఉన్నానా? లేనా? అన్నది అప్పుడే క్లారిటీ రాదు. అందుకు చాలా సమయం పడుతుందని తెలిపింది.




# శుభం ట్రైలర్ టాక్: సీరియల్స్‌పై సమంత కామెడీ ప్రయోగం




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నిర్మాతగా మారి చేస్తోన్న మొదటి సినిమా శుభం. ఇప్పటికే టీజర్ తో మంచి వినోదాన్ని అందించి ఆడియన్స్ ను ఆకట్టుకున్న ఈ కామెడీ హర్రర్ అందరితో నవ్వుల్ని పూయించింది. ఇప్పుడు తాజాగా శుభం థియేట్రికల్ ట్రైలర్ రిలీజైంది. ఈ ట్రైలర్ ముందు చాలా సరదాగా మొదలైంది. భర్తలు, తమ భార్యలను ఎలా కంట్రోల్ లో పెట్టాలనే డిస్కషన్ తో ట్రైలర్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత సడెన్ గా కొత్తగా పెళ్లైన జంటకు ఫస్ట్ నైట్ సీన్ మొదలవుతుంది. ఆ సీన్ లో పెళ్లి కొడుకు తనను తాను ఆల్ఫా మగాడని చెప్పుకోవడానికి ట్రై చేస్తూ ఉండగా, పెళ్లి కూతురు అతని మాటలు సైలెంట్ గా వింటూ ఉంటుంది. ఆ తర్వాత ఆమె సీరియల్ పెట్టుకుని అందులో లీనమై, తనలోని భిన్నమైన కోణాన్ని బయట పెడుతుంది. దీంతో ఒక్కసారిగా అక్కడి పరిస్థితులన్నీ వింతగా మారిపోతాయి. చూస్తుంటే ఆడవాళ్లు సీరియల్ చూడటం వ్యసనంగా మారితే ఎలా ఉంటుందో దానికి హర్రర్‌ను, కామెడీని మిక్స్ చేసి శుభం ను తెరకెక్కించినట్టు అనిపిస్తుంది. ఊరు మొత్తం ఇదే సమస్యను ఎదుర్కొంటే జరిగే పరిణామాలేంటి? ఆ పరిస్థితులను ఆల్ఫా మగాళ్లు ఎలా ఎదుర్కొని బయటపడ్డారనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే అంటూ మేకర్స్ ఊరిస్తున్నారు. మొత్తానికి 2.50 నిమిషాల శుభం ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటూ అందరినీ ఆకట్టుకుంది. ఆఖరిగా ట్రైలర్ ఎండింగ్ లో సమంత చేసిన క్యామియో కూడా అందరినీ ఎట్రాక్ట్ చేసింది. మే 9న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాతో ఆడియన్స్ ను థ్రిల్ చేయాలని సమంత చూస్తోంది. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ సినిమాకు వసంత్ మారింగంటి కథను అందించాడు. టీజర్ తోనే మంచి అంచనాలను ఏర్పరచిన శుభం సినిమా ఇప్పుడు ట్రైలర్ తో వాటిని ఇంకాస్త పెంచింది. ట్రైలర్ తో హైప్ పెంచాలనే సమంత ప్లాన్ వర్కవుట్ అయినట్టే. ఫుల్ లెంగ్త్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రూపొందిన ఈ సినిమాతో సమంత నిర్మాతగా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.


# ట్రెండ్ పాన్ ఇండియా అయినా టాలీవుడ్ మార్క్!



టాలీవుడ్ మాస్ ని బాలీవుడ్ కి సైతం పరిచయం అవుతోంది ఇప్పుడిప్పుడే. ఇటీవలే జాట్ తో పక్కా కమర్శియల్ సినిమా చేసి తెలుగు సినిమా ఫార్ములా ఇదీ అని అక్కడ నిరూపించాడు గోపీచంద్ మలినేని. ఈ సినిమాకు ఉత్తరాది రాష్ట్రాల్లో మంచి రెస్పాన్స్ వచ్చింది. మాస్ ఆడియన్స్ ను కనెక్ట్ చేయడంలో నూరుపాళ్లు సక్సెస్ అయింది. ఇలాంటి కమర్శియాల్టీ బాలీవుడ్ లో కనిపించదు. అక్కడ మేకింగ్ స్టైల్ వేరు. టాలీవుడ్ స్టైల్ వేరని ప్రూవ్ చేసారు. టాలీవుడ్ నుంచి రిలీజ్ అవుతున్న పాన్ ఇండియా చిత్రాల్లో సైతం ఐటం పాటలతో ఉత్తరాదిని ఏ రేంజ్ లో ఊపుతున్నారో చెప్పాల్సిన పనిలేదు. పుష్ప లో ఊ అంటావా మావ పాట అక్కడ ఏ రేంజ్ ఊపు తెచ్చిందే తెలిసిందే. నార్త్ లో సైతం రీల్స్ హల్చల్ చేసాయి అటుపై పుష్ప 2 లో కిసిక్ పాటే అంతే కనెక్ట్ అయింది. అంతకు ముందు కేజీఎఫ్ లోనూ స్పెషల్ సాంగ్ తో అలరించిన సంగతి తెలిసిందే. తమన్నా స్టెప్పు లకు ఓ రేంజ్ లో రెస్పాన్స్ వచ్చింది. మల్లికా షెరావత్, మలైకా అరోరా దిగొచ్చినట్లే అనిపించింది. ప్రస్తుతం యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో చేస్తోన్న డ్రాగన్ లోనూ అలాంటి స్పెషల్ సాంగ్ ఒకటి ప్లాన్ చేస్తున్నారు. ఇది నెక్ట్స్ లెవల్లో ఉంటుందని సమాచారం. ఈ పాట కోసం శ్రుతి హాసన్ ని రంగంలోకి దించుతున్నారు. అలాగే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న పెద్ది చిత్రంలో సైతం బుచ్చిబాబు ఇలాంటి ఛాన్స్ తీసుకునే అవకాశం ఉంది. గ్లోబల్ స్టార్ తో పక్కా మాస్ సినిమా తెరకెక్కిస్తున్నాడు. అలాంటప్పుడు హీటెక్కించే ఐటం పాట లేకుండా పెద్ది ఉంటుందా? లేకపోతే అభిమానులు ఊరుకుంటారా? ఇలా పాన్ ఇండియా చిత్రాల్లో సైతం మేకర్స్ టాలీవుడ్ కి కలిసొచ్చిన ఐటం సాంగ్ ను జత చేస్తూ ఇండియాని అల్లాడిస్తున్నారు.

# చీరకే అందాన్ని తెచ్చేలా అనసూయ హొయలు

మొదట టీవీ యాంకర్‌గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్న అనసూయ భరద్వాజ్, తన మల్టీటాలెంట్‌తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి వరుసగా అభిమానులను అలరిస్తూనే ఉంది. 'క్షణం' సినిమాలో విలక్షణమైన పాత్రతో ఆకట్టుకున్న అనసూయ, 'రంగస్థలం'లో రంగమ్మత్త పాత్రతో మరింత క్రేజ్ సంపాదించింది. యాంకర్‌గా ఉన్నంత వరకు కేవలం గ్లామర్ షోకే పరిమితమవుతుందనుకున్నవారికి అనసూయ నటనతో సమాధానం చెప్పింది. తాజాగా అనసూయ చీరలో చేసిన ఒక ఫోటోషూట్ సోషల్ మీడియాలో దుమ్ము రేపుతోంది. గోధుమ రంగు మరియు ఆకుపచ్చ కలర్ మిక్స్ లో ఉన్న చీర, ఆమె అందాన్ని రెట్టింపు చేసింది. నెమలి ఆకారంలో మెరిసే ఈ డిజైన్ చీరలో అనసూయ చూపించిన ఎక్స్‌ప్రెషన్లు ఫ్యాషన్ వర్గాల్లో ప్రత్యేకంగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ



లుక్‌లో ఆమె మెరిసే మేకప్, నాజూకైన ఆభరణాలు, మెరుపులా మెరిసే హెయిర్ స్టైల్ అన్నీ కలిసి పర్ఫెక్ట్ ట్రెడిషనల్ లుక్‌ను ఇచ్చాయి. ఆమె చూపిన గ్లామర్ డోస్‌తో పాటు గౌరవంగా నిలిచే హావభావాలు ఆమెలో ఉన్న వేరైటీని హైలైట్ చేస్తున్నాయి. సాధారణంగా చీరలలో లావణ్యంగా కనిపించటం కొంతమంది యాంకర్లకు కష్టంగా మారినా, అనసూయ మాత్రం తన క్యూట్ లుక్స్ తో మరింత అందాన్ని తెచ్చింది.

ప్రస్తుతం అనసూయ ఫ్లాష్ బ్యాక్ అనే తమిళ సినిమాతో బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఆమె తాజా ఫొటోలు చూస్తుంటే చీరకే ఓ కొత్త జీవం ఇచ్చినట్టుగా అనిపిస్తోంది. ఫ్యాషన్ స్టేట్మెంట్ ఇవ్వడంలో అనసూయకు ప్రత్యేకత ఉందని ఈ లుక్ మరోసారి రుజువు చేసింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు రంగమ్మత్త స్టైల్ రిటర్న్.. అంటూ పాజిటివ్ గా కామెంట్స్ చేస్తున్నారు.

# కథ విన్నప్పుడే ఆ విషయం ఫిక్సయ్యా

కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ శ్రీనిధి శెట్టి. కెజిఎఫ్1, కెజిఎఫ్2 సినిమాలతో మంచి ఫాలోయింగ్ సంపాదించిన శ్రీనిధి ఇప్పుడు టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన హిట్: ది థర్డ్ కేస్ సినిమాలో శ్రీనిధి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో శ్రీనిధి మీడియాతో మాట్లాడి పలు విషయాలను షేర్ చేసుకుంది. కెజిఎఫ్, కెజిఎఫ్2, ఇప్పుడు హిట్3 మూడూ సినిమాలూ హింసతో కూడుకున్నవేనని, కానీ తాను మాత్రం చాలా సాఫ్ట్ అని, వయొలెన్స్ ను తాను వద్దనుకున్నా, వయొలెన్స్ తనను వద్దనుకోవడం లేదని, అయితే హిట్3 సినిమా మొదటి సీన్ నుంచి వయొలెన్స్ గా ఉండదని, అవసరమైన చోట మాత్రమే ఇందులో యాక్షన్ ఉంటుందని, కెజిఎఫ్ సినిమాలకు హిట్3 సినిమాకు చాలా తేడా ఉందని చెప్పింది. ఈ సినిమా కథ విన్నప్పుడే యాక్షన్ సినిమా అని అర్థమైందని, అప్పుడే ఈ సినిమాకు ఏ సర్టిఫికేట్ వస్తుందని అర్థమైందని, ఈ విషయంలో నానితో ఏ సర్టిఫికేట్ మూవీ చేయడానికి నీకు 16 ఏళ్లు పట్టింది కానీ నేను నాలుగో సినిమాతోనే ఈ ఫీట్ ను సాధించానని చెప్తుంటానని శ్రీనిధి తెలిపింది. అయితే అందరూ



అనుకున్నట్టు ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాదని శ్రీనిధి ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చింది. హిట్3 లో క్రైమ్, ఇన్వెస్టిగేషన్, డ్రామా, యాక్షన్, లవ్, అన్నీ ఉంటాయని, కాకపోతే యాక్షన్ కొంచెం ఎక్కువగా ఉంటుందని, వయొలెంట్ గా ఉండే అర్జున్ సర్కార్ ను కూల్ చేసే భార్య, ప్రేయసి మృదుల క్యారెక్టర్ లో తాను కనిపిస్తానని, సినిమాలో అర్జున్, మృదుల మాట తప్పించి ఇంకెవరి మాటా వినడని, అందుకే కథలో అవసరమైన ప్రతీ చోటా తన పాత్ర కనిపిస్తుందని, దాంతో పాటూ తన క్యారెక్టర్ కు మరో ఇంట్రెస్టింగ్ యాంగిల్ కూడా ఉందని, అదేంటనేది స్క్రీన్ పైనే చూడాలని శ్రీనిధి తెలిపింది. తెలుగులో పరిచయం అవుతున్న మొదటి సినిమాకు సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవాలనే ఆశతో ఈ సినిమాకు తానే డబ్బింగ్ చెప్పానని, కన్నడ అమ్మాయిలా కాకుండా తెలుగమ్మాయిలా ఈ సినిమాకు డబ్బింగ్ చెప్పానని, ఈ విషయంలో డైరెక్టర్ శైలేష్ తనకెంతో సాయం చేశాడని చెప్పింది. ఇదే ఇంటర్వ్యూలో బాలీవుడ్ లో తెరకెక్కుతున్న రామాయణం సినిమాలో సీత పాత్ర గురించి కూడా శ్రీనిధి క్లారిటీ ఇచ్చింది. రామాయణం సినిమాకు తాను కేవలం ఆడిషన్ మాత్రమే ఇచ్చానని, కానీ మళ్లీ చిత్ర యూనిట్ నుంచి తనకెలాంటి ఫోన్ రాలేదని, సీత పాత్ర తనకు వస్తే తాను వదులుకున్నానని వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని, అసలు అలాంటి పాత్రలు వస్తే ఎవరైనా ఎందుకు వదులుకుంటారని ప్రశ్నించింది. ప్రస్తుతం తెలుగులో సిద్ధూ జొన్నలగడ్డ సరసన తెలుసు కదా సినిమా చేస్తున్న శ్రీనిధి, కెజిఎఫ్3లో తాను ఉంటుందో ఉండదోననే ప్రశ్నను డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ను అడగాలని చెప్పింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536